# సమాచార యోగి
మాసపత్రిక

# SAMACHARA YOGI
Telugu Monthly

సంపుటి : 2 సంచిక : 7 జులై : 2025 వెల : రూ.25/-

Volume:2 Issue : 7 July : 2025 Cost : Rs. 25/-



ఎడిటర్ :
**డా॥ పోలోజు కృష్ణమాచారి**

సబ్ఎడిటర్ : **విష్ణుమూర్తి**

స్టాఫ్ రిపోర్టర్స్ :
**ఇ. కిరణ్ కుమార్**
**పి. సుధీర్ కుమార్**

డి.టి.పి. : **ఎ. శ్రీనివాస్**

**అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీస్ :**
H.No. 6-3-1373, B-1373
NGO's Colony, Vanasthalipuram
Hyderabad - 500070
Cell : 9390222472



Edited,Printed, Published and Owned by:
**POLOJU KRISHNAMACHARY,**
Printed At : MANI RAGHAVA PRINTERS,
#A-20, VAMBAY COLONY,
HYDERGUDA, RAJENDRAGANAR,
RANGAREDDY TELANGANA,
PUBLISHED FROM: B-1373, NGOS
COLONY, VANASTHALIPURAM,
HAYATH NAGAR MAN DAL,
DISTRICT, RANGA REDDY
TELANGANA - 500070.
EDITOR : **POLOJU KRISHNAMACHARY,**
Ce11:9390222472,
pkrishnamachary1979@gmail.com
RNI TEL TEL NO.2024/89286


## లోపలి పేజీలలో..




ప్రధాని మోదీకి నమీబియా
అత్యున్నత పురస్కారం.. | 3






SRH, HCA వివాదం లో బిగ్ ట్విస్ట్..
హెచ్ సీ ఏ ప్రెసిడెంట్ జగన్మోహన్ రావు అరెస్ట్ | 5





సభలో చర్చిద్దామంటే ప్రెస్‌క్లబ్‌లో రాద్ధాంతం అభివృద్ధి,
నదీ జలాలపై మాట్లాడటానికి సిద్ధం.. | 19





కృష్ణా జలాల్లో అన్యాయం.. కాళేశ్వరం లోపాలపై సర్కారు ఫోకస్ సీఎం,
మంత్రులు, ఎమ్మెల్యేలకు మంత్రి ఉత్తమ్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ | 21

ఎడిటోరియల్

# రైతు సంక్షేమం

మన దేశంలో 'కరోనా' కారణంగా నాలుగేళ్ల క్రితం దాదాపు అన్ని కీలక రంగాల్లోనూ ఉత్పత్తి నిలిచిపోయిన సమయంలో 140 కోట్ల దేశ ప్రజల ఆకలిని తీర్చింది వ్యవసాయ రంగమే. దేశానికి స్వాతంత్ర్యం లభించిన కాలంలో 25కోట్ల దేశ జనాభాకు రెండు పూటలా తినగలిగే ఆహార ధాన్యాలు పండించే పరిస్థితి లేదు. 'పిఎల్-480' అగ్రిమెంట్ ద్వారా ఇతర దేశాల నుంచి ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకునేవాళ్లం. దానిని 'షిప్ టు మౌత్' ఎకానమీ అనేవారు. అంటే, విదేశాల నుంచి ఓడల్లో ఆహార ధాన్యాలు వస్తేనే ప్రజలకు తిండి లభించేది. అటువంటి దుర్భర పరిస్థితులను అధిగమించడానికి ప్రభుత్వాలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు కృషి చేశారు. ఫలితంగా, తొలుత హరితవిప్లవం, ఆ తర్వాత క్షీర విప్లవం చోటుచేసుకున్నాయి. నేడు పుష్కలంగా ప్రజానీకానికి తిండిగింజలు అందుబాటులోకి రావడమేకాక ఎగుమతులు చేసే అవకాశం ఏర్పడింది. అయితే, ఇదంతా నాణేనికి ఒకవైపు మాత్రమే. ఆహార ధాన్యాలు పుష్కలంగా ఉత్పత్తి అవుతున్నప్పటికీ రైతుల పరిస్థితి మాత్రం నానాటికీ తీసికట్టుగానే ఉంటున్నది. సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీ (సీఎస్‌డీసీ) నివేదిక ప్రకారం వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడంతో 76 శాతం మంది రైతులు వ్యవసాయాన్ని మానుకొని ఇతర ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల్లోకి మళ్లాలని భావిస్తున్నారు. ఇందుకు పలు కారణాలు ఉన్నాయి. అందులో ముఖ్యంగా వ్యవసాయం ద్వారా ఆదాయం లభించకపోగా అప్పు మిగలడం ఇంకా వ్యవసాయంలోనే కొనసాగితే తమ భవిష్యత్తు మరింత దుర్భరంగా మారుతుందేమోనన్న భయాందోళనలు తరచుగా కరువు, వరదలు, చీడపీడల రూపంలో కలుగుతున్న అపార నష్టాలు ప్రభుత్వాల నుంచి పంట నష్టపరిహారం అందించడంలో గానీ, కనీస మద్దతు ధరలు కల్పించడంలో గానీ ఆశించిన మేర సహాయ సహకారాలు లేకపోవడం అప్పులు, ఇతరత్రా సమస్యల వల్ల కుటుంబంలో పెరుగుతున్న ఆర్థిక ఒత్తిడులు, అశాంతి. వీటితోపాటు వ్యవసాయానికి అవసరమైన పెట్టుబడులు సకాలంలో దొరక్కపోవటం నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో లేకపోవడం అష్టకష్టాలు పడి పంట పండిస్తే వాటికి కనీస మద్దతు ధర లభించకపోవడం మార్కెట్‌లో దళారుల బెడద సరైన ధర వచ్చేవరకు పంట ఉత్పత్తిని భద్రపర్చుకొనే గిడ్డంగుల సదుపాయం లేకపోవడం... ఇంకా అనేక సమస్యలు, సవాలక్ష కారణాలు దశాబ్దాల తరబడి భారత రైతాంగాన్ని వేధిస్తున్నాయి.

2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని 2016లో ఎన్డీఏ ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ ఇప్పటివరకూ ఆచరణలో ఆ హామీ పూర్తిగా నెరవేరలేదు. డా. స్వామినాథన్ కమిషన్ సిఫారసు మేరకు పంట వ్యయానికి 50శాతం కలిపి కనీస మద్దతు ధర అందిస్తామన్న హామీ నేటికీ ఆచరణలోకి రాలేదు. పైగా, ఆ ఫార్ములాను అమలు చేస్తే వినియోగదారుడిపై భారం పడుతుందని సర్వోన్నత న్యాయస్థానంలో అఫిడవిట్ దాఖలు చేసి తప్పించుకున్నారు. కాగా, ఇటీవలి కాలంలో రైతులకు నష్టాలు పెరిగాయి. వాతావరణ మార్పుల వల్ల వ్యవసాయ ఆదాయాలు 15 నుంచి 20 శాతం వరకు పడిపోయినట్లు 2023-24 ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. ఫలితంగా, 2020లో ప్రతి మూడు రైతు కుటుంబాల్లో ఒకటి అప్పుల ఊబిలో కూరుకుపోగా, ప్రతి రుణగ్రస్థ రైతు కుటుంబం తలసరిన రూ.1.03 లక్షల అప్పు మోస్తున్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

ఆర్థిక సర్వే ప్రకారం గత ఐదేళ్లుగా దేశ వ్యవసాయాభివృద్ధి సగటు రేటు 3.5శాతం. ఆహార ధాన్యాల ఉత్పత్తి కూడా గణనీయంగా పెరిగింది. కానీ, రైతులకు ఒరిగింది శూన్యం. కారణం అధిక ఉత్పత్తి ఉన్నప్పుడు ధరల పతనం జరిగి రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడటం. పంట అధికంగా పండినపుడు ఎగుమతులు చేసుకొనే వెసులుబాటు సామాన్య రైతులకు లేదు. మరో పక్క విదేశాల నుంచి పప్పుధాన్యాలతోపాటు పండ్లు, కూరగాయలు దిగుమతి కావడంతో దేశీయ రైతాంగం ఆ పోటీని తట్టుకోలేకపోతున్నారు. వ్యవసాయం గిట్టుబాటుకాక అప్పుల భారం పెరిగి రైతులు పెద్ద సంఖ్యలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

నిజానికి, వివిధ రకాల వ్యవసాయ ఉత్పత్తుల్లో నేటికీ భారతదేశం అగ్రస్థానంలో ఉంది. కానీ, హెక్టారుకు వచ్చే సగటు ఉత్పత్తి, ఉత్పాదకతలో మాత్రం అట్టడుగు స్థానంలో ఉంది. మొక్కజొన్న, వరి, గోధుమ, సోయా తదితర పంటల ఉత్పాదకతలో భారత్ వృద్ధి నత్తనడకన ఉండగా, బ్రెజిల్ లాంటి దేశాలు సైతం ఉత్పాదకతలో శరవేగంగా ముందుకు సాగుతున్నాయి. దేశ ఆహార భద్రతకు కీలకమైన వ్యవసాయ రంగాన్ని సమూలంగా మార్పు చేసే అవకాశం గతంలో కంటే ఇప్పుడు ఎక్కువగా ఉంది. గతంలో కంటే మెరుగైన వాతావరణ అంచనాలను వేసే సాంకేతిక పరిజ్ఞానం అందు బాటులోకి వచ్చింది. అధిగ దిగుబడి ఇచ్చే వంగడాలను, విత్తనాలను వృద్ధి చేసుకోగలిగిన టెక్నాలజీ వచ్చింది. అభివృద్ధి చెందిన దేశాలలో వ్యవసాయ రంగంలో నిరంతర పరిశోధనలు జరుగుతున్నాయి. వ్యవసాయ పరిశోధనలకు చేసే వ్యయాన్ని ఆయా దేశాలు పెట్టుబడి గానే పరిగణిస్తున్నాయి. వ్యవసాయరంగంలో సైతం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వినియోగాన్ని ఆ దేశాలు వేగవంతం చేశాయి. ఇటీవల అత్యధిక శాతం ప్రజలు చిరుధాన్యాలవైపు మొగ్గు చూపుతున్నందువల్ల పంట మార్పిడిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

వ్యవసాయాన్ని ప్రాధాన్యతారంగంగా ప్రభుత్వాలు పరిగణించాలి. దేశంలోని అన్ని వ్యవసాయ విశ్వవిద్యాలయాలలో పెద్దఎత్తున పరిశోధనలు జరపాలి. వాటి ఫలితాలను రైతాంగానికి అందించాలి. వ్యవసాయ ఎగుమతులను ప్రోత్సహించాలి. రైతులకు అధిక ఆదాయాన్ని అందించే వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడి, ఉద్యానవనం పంటలు, మత్స్య ఉత్పత్తులకు ప్రోత్సాహం కల్పించాలి. రైతాంగ కుటుంబాల విద్య, ఆరోగ్యంపై దృష్టి పెట్టడం కోసం గ్రామాలలో మౌలిక సదుపాయాలను విస్తరించాలి. రైతాంగ కుటుంబాల పిల్లలకు చేతివృత్తులపై ఆధారపడిన కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు తగిన పాఠశాలలు ఏర్పాటు చేయాలి. రైతు కుటుంబాల ఆరోగ్య సంరక్షణకు ఆసుపత్రుల్ని ఏర్పాటు చేయాలి. విద్య, ఆరోగ్యం, ఉపాధి అందుబాటులో ఉంటే గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలు ఆగిపోతాయి. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందితేనే దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. ఈ రంగాన్ని మెరుగుపర్చడానికి నిరంతర కార్యాచరణ అవసరం.

**- ఎడిటర్**

# ప్రధాని మోదీకి నమీబియా అత్యున్నత పురస్కారం..



ప్రధాని మోదీకి అరుదైన గౌరవం లభించింది. ప్రస్తుతం నమీబియా పర్యటనలో ఉన్న మోదీ.. ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన "ఆర్డర్ ఆఫ్ ది మోస్ట్ ఏన్షియంట్ వెల్విట్చియా మిరాబిలిస్" ను అందుకున్నారు. నమీబియా ప్రెసిడెంట్ నెటుంబో నంది మోదీకి ఈ పురస్కారాన్ని అందజేశారు. 140 కోట్ల భారతీయుల తరఫున ఈ పురస్కారం తీసుకుంటున్నట్లు ప్రధాని చెప్పారు.ప్రధాని మోదీ నమీబియాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనకు అరుదైన గౌరవం దక్కింది. ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన "ఆర్డర్ ఆఫ్ ది మోస్ట్ ఏన్షియంట్ వెల్విట్చియా మిరాబిలిస్" పురస్కారాన్ని అందుకున్నారు. నమీబియా ప్రెసిడెంట్ నెటుంబో నంది మోదీకి ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ పురస్కారం పట్ల మోదీ సంతోషం వ్యక్తం చేశారు. ప్రెసిడెంట్ నెటుంబో నందితో పాటు నమీబియా ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. 140కోట్ల భారతీయుల తరఫున ఈ పురస్కారాన్ని తీసుకుంటున్నట్లు చెప్పారు. మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విదేశాల్లో 27 అవార్డులు అందుకోగా ప్రస్తుత ఐదు దేశాల టూర్‌లో నాలుగు పురస్కారాలు అందుకున్నారు.ఆ తర్వాత ప్రెసిడెంట్ నెటుంబో నందితో మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. డిజిటల్ టెక్నాలజీ, రక్షణ, భద్రత, వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, విద్య, ఖనిజాలు వంటి రంగాలలో పరస్పర సహకారంపై చర్చించారు. వాణిజ్యం, ఎనర్జీ, పెట్రోకెమికల్స్ వంటి అంశాలపై కీలక చర్చలు జరిపారు. అంతేకాకుండా నాలుగు ఇరుదేశాల మధ్య ఒప్పందాలు కుదిరాయి. ఇక నమీబియా పార్లమెంట్‌లో మోదీ ప్రసంగించనున్నారు. ఈ ఐదు దేశాల పర్యటనలో పార్లమెంట్‌లో మోదీ ప్రసంగించడం ఇది మూడోసారి.అంతకుముందు బ్రెజిల్ నుంచి నమీబియా చేరుకున్న మోదీకి ఘనస్వాగతం లభించింది. ఆ దేశ ప్రెసిడెంట్ నెటుంబో నంది స్వయంగా ఎయిర్ పోర్టుకు వెళ్లి మోదీని రిసీవ్ చేసుకున్నారు. 21 గన్స్‌తో కూడిన గౌరవ వందనాన్ని ప్రధాని స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మోదీ స్వయంగా డప్పు వాయించి అక్కడున్నవారిని ఉత్సాహపరిచారు. కాగా ప్రధాని మోదీ బ్రెజిల్‌లో రెండు రోజుల పర్యటనను ముగించుకుని నమీబియా చేరుకున్నారు. రియో డి జనీరోలో జరిగిన 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి ఆయన హాజరై.. బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియోతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అంతకుముందు ఆయన ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా దేశాల్లో పర్యటించారు.

# స్టార్ లింక్ కు స్పేస్ ఏజెన్సీ నుంచీ గ్రీన్ సిగ్నల్

## ఎలాన్ మస్క్ నేతృత్వంలోని స్టార్



లింకు కీలక అనుమతులు లభించాయి. భారత్లో కమర్షియల్ గా శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు ప్రారంభించేందుకు కావాల్సిన అనుమతులను ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ అథరైజేషన్ సెంటర్ (IN-SPACE) మంజూరు చేసిందని రాయిటర్స్ వార్తా సంస్థ తెలిపింది. 2022 నుంచి కమర్షియల్ లైసెన్స్ పొందేందుకు ఎదురుచూస్తున్న ఈ సంస్థకు ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ లభించింది. టెలికాం విభాగం నుంచి గత నెలలోనే స్టార్ లింక్ అనుమతులు పొందింది. తాజాగా స్పేస్ ఏజెన్సీ నుంచి కూడా అనుమతులు రావడంతో స్టార్ లింక్కు మార్గం సుగమం అయ్యింది. స్టార్ లింక్తో పాటు వన్వెబ్, రిలయన్స్ జియోకు ఇప్పటికే ఈ తరహా అనుమతులు లభించాయి.

ఇంకా ప్రభుత్వం నుంచి స్పెక్ట్రమ్ పొందడం, బేస్ స్టేషన్ల ఏర్పాటుకు మౌలిక వసతులు సమకూర్చుకోవడంతో పాటు తమ సేవలు సెక్యూరిటీ ప్రోటోకాల్కు లోబడి ఉన్నాయని నిరూపించేందుకు ట్రయల్స్ నిర్వహించాల్సి ఉంటుంది. సామాన్యులకు స్టార్ లింక్శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి తేవడానికి ఇవన్నీ పూర్తి కావాల్సి ఉంటుంది.

# అంతరిక్షానికి మరో భారత సంతతి వ్యోమగామి

## నాసా ఐఎస్ఎస్ మిషన్కు ఎంపికైన అనిల్ మీనన్
## 2026లో ఐఎస్ఎస్ కు.. 8 నెలలపాటు అక్కడే పరిశోధన

న్యూఢిల్లీ, : భారత సంతతికి చెందిన నాసా వ్యోమగామి అనిల్ మీనన్ ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) యాత్రకు ఎంపికయ్యారు. ఈ క్రమంలో సునీతా విలియమ్స్ తర్వాత ఐఎసఎసలో అడుగుపెట్టనున్న మరో ఇండో-అమెరికన్ వ్యోమగామిగా ఆయన రికార్డు సృష్టించనున్నారు. 2026 జూన్లో నాసా చేపట్టనున్న మిషన్లో భాగంగా అనిల్ మీనన్.. 'రోస్కోస్మోస్ సోయజ్ ఎంఎస్-29' అనే అంతరిక్ష నౌకలో ఫ్లైట్ ఇంజనీర్గా, ఎక్స్పెడిషన్ 75 సభ్యుడిగా ఐఎసఎసకు వెళ్లనున్నారు. మీనన్ను వచ్చే ఏడాది తన మొదటి మిషన్ కోసం ఐఎసఎసకు పంపుతున్నామని నాసా తెలిపింది. మీనన్తోపాటు రష్యాకు చెందిన ప్యోటర్ డుబ్రోవ్, అనా కికినా కూడా రోస్కోస్మోస్ సోయజ్ ఎంఎస-29లో ప్రయాణించనున్నారని పేర్కొంది.

ఈ ముగ్గురూ దాదాపు ఎనిమిది నెలలపాటు ఐఎసఎసలో శాస్త్రీయ పరిశోధనలు చేపట్టనున్నారు. ఈ ప్రయోగం కజకిస్థాన్ నుంచి చేపట్టనున్నారు. అమెరికాలో స్థిరపడిన భారత్-ఉక్రెయిన్కు చెందిన శంకరన్ మీనన్, లీసా సమోలెంకో దంపతులకు అనిల్ మీనన్ జన్మించారు. హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి న్యూరోబయాలజీ డిగ్రీ సాధించారు. మసాచుసెట్స్ నుంచి మెకానికల్ ఇంజనీరింగ్లో మాస్టర్స్ డిగ్రీ, స్టాన్ఫోర్డ్ యూనివర్సిటీ నుంచి ఎమర్జెన్సీ మెడిసిన్, ఏరోస్పేస్ మెడిసిన్ పూర్తిచేశారు. 2014లో ఫ్లైట్ సర్జన్గా నాసాలో చేరిన మీనన్.. 2021లో వ్యోమగామి కార్యక్రమానికి ఎంపికయ్యారు. మూడేళ్ల కఠిన శిక్షణ అనంతరం 2024లో వ్యోమగామిగా పట్టభద్రుడయ్యారు. స్పేస్ ఎక్స్లో పనిచేసే అనా మీనన్ను ఆయన వివాహం చేసుకున్నారు.

# SRH, HCA వివాదం లో బిగ్ ట్విస్ట్..
# హెచ్ సీ ఏ ప్రెసిడెంట్ జగన్మోహన్ రావు అరెస్ట్




సన్ రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజ్, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ వివాదంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో హెచ్ సీ ఏ ప్రెసిడెంట్ జగన్మోహన్ రావును సీఐడీ అరెస్ట్ చేసింది. జగన్మోహన్ రావుతో పాటు హెచ్ సీ ఏ బాడీని మొత్తం సీఐడీ అదుపులోకి తీసుకుంది.కాగా, 2025 ఐపీఎల్ సందర్భంగా ఎస్ఆర్ హెచ్ యాజమాన్యం, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ మధ్య టికెట్ల గురించి వివాదం జరిగిన విషయం తెలిసిందే. ఓ మ్యాచ్ సందర్భంగా తమకు టికెట్స్ కేటాయించలేదని స్టేడియంలోని కార్పొరేట్ బాక్సు హెచ్ సీ ఏ తాళం వేసింది. ఈ ఘటనతో విసిగిపోయిన ఎస్ఆర్ హెచ్ యాజమాన్యం హైదరాబాద్ వదిలి పోతామని హెచ్చరించింది. ఈ వివాదం రాష్ట్రంలో సంచలనంగా మారడంతో ప్రభుత్వం రంగంలోకి దిగింది.ఈ మేరకు ఎస్ఆర్ హెచ్, హెచ్సీఏ వివాదంపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. హెచ్సీఏ ప్రెసిడెంట్ టికెట్ల కోసం ఎస్ఆర్హెచ్ ఫ్రాంచైజ్ని ఇబ్బందులకు గురి చేసినట్లు విజిలెన్స్ అధికారులు నిర్ధారించారు. ఎస్ఆర్ హెచ్ సీ ఏ యాజమాన్యం10 శాతం టికెట్లు ఫ్రీగా ఇస్తామన్నప్పటికీ.. 20 శాతం టికెట్లు ఇబ్బందులకు గురి చేసినట్లు విజిలెన్స్ అధికారులు నిర్ధారించారు. ఎస్ఆర్ హెచ్ యాజమాన్యం10 శాతం టికెట్లు ఫ్రీగా ఇస్తామన్నప్పటికీ.. 20 శాతం టికెట్లు కావాలని ఎస్ఆర్ హెచ్ యాజమాన్యంపై హెచ్ సీ ఏ ఒత్తిడి తెచ్చినట్టు దర్యాప్తులో గుర్తించారు విజిలెన్స్ అధికారులు.ఫ్రీగా 10 శాతం కంటే ఎక్కువ టికెట్లు ఇచ్చే ప్రసక్తే లేదని ఎస్ఆర్ హెచ్ తేల్చి చెప్పడంతో ఓపెన్ మార్కెట్లో కొనుగోలు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని జగన్మోహన్ రావు డిమాండ్ చేశారు. ఇందుకు హెచ్ సీ ఏ ద్వారా రిక్వెస్ట్ పెడితే టికెట్లు ఇచ్చేందుకు ఎస్ఆర్ హెచ్ యాజమాన్యం ఒప్పుకుంది. అయితే.. తనకు వ్యక్తిగతంగా 10 శాతం టికెట్లు ఇవ్వాలని జగన్మోహన్ రావు డిమాండ్ చేయగా.. వ్యక్తిగతంగా టికెట్లు ఇచ్చేది లేదని ఎస్ఆర్ హెచ్ తేల్చి చెప్పింది.టికెట్లు ఇవ్వకపోవడంతో ఉప్పల్ స్టేడియంలో మ్యాచుల సందర్భంగా ఎస్ఆర్ఆహెచ్ యాజమాన్యాన్ని జగన్మోహన్ రావు ఇబ్బందులకు గురి చేసినట్లు సీఐడీ గుర్తించింది. ఇందులో భాగంగానే ఉప్పల్ స్టేడియంలో లక్నోతో జరిగిన మ్యాచ్ సందర్భంగా స్టేడియంలోని వీఐపీ గ్యాలరీలకు హెచ్ సీ ఏ సిబ్బంది తాళాలు వేసినట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు.ఎస్ఆర్ హెచ్ యాజమాన్యాన్ని హెచ్ సీ ఏ తీవ్ర ఇబ్బందులకు గురి చేసినట్లు నిర్ధారించిన విజిలెన్స్ అధికారులు.. హెచ్ సీ ఏ పై చర్యలకు సిఫారసు చేశారు. విజిలెన్స్ నివేదిక ఆధారంగా హెచ్ సీ ఏ పై సీఐడీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో హెచ్ సీ ఏ ప్రెసిడెంట్ జగన్మోహన్ రావును బుధవారం (జూలై 9) సీఐడీ అరెస్ట్ చేసింది. జగన్మోహన్ రావుతో పాటు హెచ్సీఏ బ మొత్తాన్ని అదుపులోకి తీసుకుంది సీఐడీ.

# రాజస్థాన్‌లో 4500 ఏళ్ల నాటి నాగరికత..

## మహాభారత ఆధారాలు గుర్తింపు!

## రుగ్వేదంలో పేర్కొన్న సరస్వతి నదితో లింక్..




రాజస్థాన్‌లోని బహజ్ గ్రామంలో భారత పురావస్తు సర్వే (ASI) 4500 ఏళ్ల నాగరికతకు సంబంధించిన ఆధారాలను కనుగొంది. 23 మీటర్ల లోతు తవ్వకాలలో ప్రాచీన సరస్వతి నది ఆనవాళ్లు, 800 కంటే ఎక్కువ కళాఖండాలు బయటపడ్డాయి. మహాభారత, మౌర్య, గుప్త కాలాలకు చెందిన వస్తువులు కనుగొన్నారు.రాజస్థాన్‌లో 4500 ఏళ్ల నాటి నాగరికత.. మహాభారత ఆధారాలు గుర్తింపు! రుగ్వేదంలో పేర్కొన్న సరస్వతి నదితో లింక్.. రాజస్థాన్‌లోని డీగ్ జిల్లాలోని బహజ్ గ్రామంలో 4,500 సంవత్సరాల నాటి నాగరికతకు సంబంధించిన ఆధారాలను భారత పురావస్తు సర్వే (ASI) కనుగొంది. 2024 జనవరి 10న ప్రారంభమైన ఈ తవ్వకంలో అనేక ముఖ్యమైన విషయాలు బయటపడ్డాయి. వాటిలో 23 మీటర్ల లోతైన పాలియో–ఛానల్ కూడా ఉంది. దీనిని పురావస్తు శాస్త్రవేత్తలు రుగ్వేదంలో ప్రస్తావించిన పౌరాణిక సరస్వతి నదికి అను సంధానిస్తున్నారు.ఈ పురాతన నదీ వ్యవస్థ బహుశా ప్రారంభ మానవ స్థావరాలకు మద్దతు ఇచ్చిందని, బహజ్‌ను పెద్ద సరస్వతి బేసిన్ సంస్కృతికి అనుసంధానించిందని అంచనా వేస్తున్నారు. తవ్వకాలలో 800కి పైగా కళాఖండాలు బయటపడ్డాయి. వాటిలో కుండలు, బ్రాహ్మీ లిపిలోని పురాతన ముద్రలు, రాగి నాణేలు, యజ్ఞ కుండ్, మౌర్యుల కాలం నాటి శిల్పాలు, శివుడు, పార్వతి విగ్రహాలు, ఎముకలతో చేసిన పనిముట్లు ఉన్నాయి. ఈ తవ్వకంలో హరప్పా అనంతర కాలం, మహాభారత కాలం, మౌర్యుల కాలం, కుషాణుల కాలం, గుప్తుల కాలం వంటి ఐదు వేర్వేరు కాలాలకు సంబంధించిన ఆధారాలు బయటపడ్డాయి. ఇటీవలి పరిశోధనల ప్రకారం బ్రజ్ ప్రాంతం మతపరమైన, సాంస్కృతిక, చారిత్రక వారసత్వ కేంద్రంగా ఉంది.బహజ్ గ్రామంలో తవ్వకం దాదాపు 23 మీటర్ల లోతుకు చేరుకుంది, ఇది ఇప్పటివరకు రాజస్థాన్‌లో నిర్వహించిన లోతైన తవ్వకాలలో ఒకటి. ఈ తవ్వకంలో రుగ్వేద సరస్వతి నదికి అను సంధానించబడిన ఒక పురాతన నదీ కాలువ లేదా పాలియో కాలువ బయటపడిందని %జుఐ% సైట్ హెడ్ పవన్ సరస్వత్ తెలిపారు. ఈ నీటి వ్యవస్థ సరస్వతి లోయను మధుర, బ్రజ్ ప్రాంతాలతో అనుసంధానించే ప్రారంభ మానవ స్థావరాలకు మద్దతు ఇచ్చి ఉండవచ్చని ఆయన అన్నారు. %జుఐ% బృందం ప్రకారం.. తవ్వకంలో మహాభారత కాలం నాటి కుండలు, హవన్ కుండ్‌లతో కూడిన పొరలు కూడా బయటపడ్డాయి. వీటిలో దీర్ఘచతురస్రాకార, వృత్తాకార చిత్రాలు, అగ్ని ఆచారాల అవశేషాలు ఉన్నాయి. ఈ కుండలు మహాభారత కాలం నాటి దుస్తులు, పాత్రల వర్ణనలతో సరిపోలుతున్నాయని అధికారులు తెలిపారు.ఈ ప్రదేశంలో జరిపిన తవ్వకాల్లో మౌర్య మాతృదేవత తలగా భావించే 400 %బ్పొ% నాటి విగ్రహం లభించిందని పురావస్తు శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. గుప్తుల నిర్మాణ శైలికి చెందిన మట్టి గోడలు, స్తంభాలు, లోహశాస్త్రానికి సంబంధించిన కొలిమిలు, ఇవి రాగి, ఇనుము ముడి పదార్థాల వాడకాన్ని సూచిస్తున్నాయి. సూదులు, దువ్వెనలు, అచ్చులు వంటి ఎముకలతో తయారు చేయబడిన ఉపకరణాలు భారతదేశంలో మొదటిసారిగా ఈ రూపంలో కనుగొనబడ్డాయి. త్రవ్వకాల్లో లభించిన ఇతర ఆధారాలలో శక్తి, భక్తి సంప్రదాయాలతో ముడిపడి ఉన్న శివ–పార్వతిల టెర్రకోట విగ్రహాలు ఉన్నాయి. ఆ కాలం నాటి వాణిజ్య, సౌందర్య సంప్రదాయాలను ప్రతిబింబించే శంఖం గాజులు, అర్ధ–విలువైన రాతి పూసలు. వేద, ఉత్తరవేద కాలాల మతపరమైన ఆచారాలను నిర్ధారించే 15 కి పైగా యజ్ఞ కుండ్లు బయటపడ్డాయి.

తవ్వకం సమయంలో ఒక మానవ అస్థిపంజరం కూడాబయటపడింది. దీనిని పరీక్ష కోసం ఇజ్రాయెల్‌కు పంపారు. ఈ తవ్వకం రాజస్థాన్ మాత్రమే కాకుండా మొత్తం ఉత్తర భారతదేశం, ప్రాచీన చరిత్రను అర్థం చేసుకోవడానికి కొత్త దిశను అందిస్తుందని శాస్త్రవేత్తలు అంటున్నారు. ఇప్పటికే ASI సాంస్కృతిక మంత్రిత్వ శాఖకు ఒక నివేదికను సమర్పించింది. ఈ ప్రాంతాన్ని జాతీయ పురావస్తు రక్షిత ప్రాంతంగా ప్రకటించే అవకాశం ఉంది.

# ఇదో బాహుబలి బిల్డింగ్..!

## ఒకే భవనంలో 20 వేల మంది నివాసం.. అపార్ట్‌మెంట్ కాదది నగరమే.. !



ఈ భవనం ఎత్తు 206 మీటర్లు. అయితే ఇందులో నివసించేవారికి కావాల్సిన అన్ని సౌకర్యాలు అదే భవనంలో అందుబాటులో ఉంటాయి. ఈ భవనంలో ఒక పాఠశాల, స్విమ్మింగ్ పూల్, సూపర్ మార్కెట్లు, ఫుడ్ కోర్ట్, బార్బర్ షాప్, నెయిల్ సెలూన్, ఇంటర్నెట్ కేఫ్ అన్నీ ఉన్నాయి. ఈ భవనంలో నివసించే ప్రజలకు, బయటకు వెళ్లడం అనేది ఒక ఎంపిక, అవసరం కాదు. అందుకేప్రపంచంలో ఒక ఎత్తైన భవనం ఉంది. అక్కడ ఒకే పైకప్పు కింద ఏకంగా ఒక నగరమే నిర్మించబడింది. ఒకే భవనంలో 20 వేల మంది నివసించడం అనేది ఒక అద్భుతం.

ఇది సినిమా కథ కాదు, ఇది నిజం. చైనాలో ఒక చిన్న నగరంలోని మొత్తం జనాభా నివసించే భవనం ఉంది. ఈ భవనం చైనాలోని హాంగ్‌జౌ నగరంలో ఉంది. చైనాలోని రీజెంట్ ఇంటర్నేషనల్ అపార్ట్‌మెంట్ ప్రపంచంలోని అతిపెద్ద నివాస భవనాల్లో ఒకటి. ఇది పట్టణ జీవితం, నిర్వచనాన్ని పూర్తిగా మారుస్తుంది. ఈ 39 అంతస్తుల భారీ భవనంలో 20,000 కంటే ఎక్కువ మంది నివసిస్తున్నారు. అంటే, ఇది ఒక నిలువెత్తు నగరం అని చెప్పాలి. ఈ భవనం ఎత్తు 206 మీటర్లు. అయితే ఇందులో నివసించేవారికి కావాల్సిన అన్ని సౌకర్యాలు అదే భవనంలో అందుబాటులో ఉంటాయి. ఈ భవనంలో ఒక పాఠశాల, స్విమ్మింగ్ పూల్, సూపర్ మార్కెట్లు, ఫుడ్ కోర్ట్, బార్బర్ షాప్, నెయిల్ సెలూన్, ఇంటర్నెట్ కేఫ్ అన్నీ ఉన్నాయి. ఈ భవనంలో నివసించే ప్రజలకు, బయటకు వెళ్లడం అనేది ఒక ఎంపిక, అవసరం కాదు. అందుకే దీనిని స్థిరమైన పట్టణ జీవనానికి ఒక నమూనాగా చూస్తున్నారు. చాలా మంది నెలల తరబడి బయటకు అడుగు పెట్టరు. ప్రఖ్యాత సింగపూర్ శాండ్స్ హోటల్ డిజైనర్ అలీసియా లూ ఈ భవనాన్ని డిజైన్ చేశారు. 2013 లో ది రీజెంట్ ఇంటర్నేషనల్ భవనం ప్రారంభం అయింది. అయితే అప్పట్లో ఈ భవనం ఒక ప్రముఖ కట్టడంగా వార్తల్లో నిలిచింది. ఈ భవనంలోని ప్రతి అంతస్తులో వివిధ వృత్తులు, జీవనశైలికి చెందిన వ్యక్తులు నివసిస్తున్నారు. యువ నిపుణులు, చిన్న వ్యాపారవేత్తలు, సోషల్ మీడియా ప్రభావితం చేసేవారు, వృద్ధ జంటలు కూడా ఉన్నారు. ఒక నివేదిక ప్రకారం, ఇక్కడ ఒక చిన్న కిటికీలు లేని అపార్ట్‌మెంట్ అద్దె దాదాపు 1,500 RMB (రూ. 17,000), బాల్కనీ, బహిరంగ స్థలం ఉన్న పెద్ద ఫ్లాట్ కోసం, ఒకరు 4,000 RMB (రూ. 45,000 కంటే ఎక్కువ) వరకు చెల్లించాలి.

**ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే సామర్థ్యం:** 260,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఈ భవనం ఆధునిక పరిమాణంలోనే కాకుండా సాంకేతికంగా కూడా అభివృద్ధి చెందింది. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే విధంగా దీనిని రూపొందించారు. దీని S-ఆకారపు నిర్మాణం దీనికి ప్రత్యేక గుర్తింపును ఇస్తుంది. స్మార్ట్ డిజైన్, టెక్నాలజీ సహాయంతో నిలువుగా జీవించడం సాధ్యమే కాకుండా, సౌకర్యవంతంగా, స్వయం సమృద్ధిగా కూడా ఉండగలదని ఈ భవనం చూపిస్తుంది.

# బిజేపీకి వ్యతిరేకంగా.. పొత్తు కోసం చర్చలు జరుపుతున్నాం..! ఒవైసీ కీలక వ్యాఖ్యలు



బీహార్ అసెంబ్లీ ఎన్నికలలో NDA ను అధికారంలోకి రాకుండా నిరోధించేందుకు AIMIM ప్రతిపక్ష మహాఘట బంధన్‌తో కలిసి పనిచేయాలని నిర్ణయించింది. ఎంఐఎం అధినేత ఒవైసీ, మహాఘటబంధన్ నాయకులతో సంప్రదింపులు జరిగాయని, బీజేపీకి వ్యతిరేకంగా పోరాడేందుకు ఆసక్తి వ్యక్తం చేశారని తెలిపారు. ఓటర్ల జాబితాలో అవకతవకలపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ తిరిగి అధికారంలోకి రాకుండా నిరోధించడమే లక్ష్యంగా తమ పార్టీ బీహార్‌లోని ప్రతిపక్ష మహాఘటబంధన్ నాయకులను సంప్రదించిందని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆదివారం తెలిపారు. తమ రాష్ట్ర పార్టీ చీఫ్ అఖ్తరుల్ ఇమాన్, కాంగ్రెస్, ఆర్జేడీ, ఇతరులతో కూడిన మహాఘట్బంధన్ నాయకులను సంప్రదించారని, బీజేపీ, దాని మిత్రదేశాలకు వ్యతిరేకంగా పోరాడటానికి ఆసక్తిని వ్యక్తం చేశారని ఒవైసీ అన్నారు. “మా రాష్ట్ర అధ్యక్షుడు అఖ్తరుల్ ఇమాన్, మహాఘట్బంధన్‌లోని కొంతమంది నాయకులతో మాట్లాడారు, బీహార్‌లో బిజెపి లేదా ఎన్డీఏ తిరిగి అధికారంలోకి రావాలని మేం కోరుకోవడం లేదని ఆయన స్పష్టంగా పేర్కొన్నారు.ఇప్పుడు బీహార్‌లో ఎన్డీఏ తిరిగి అధికారంలోకి రావాలా? వద్దా? అనేది ఈ రాజకీయ పార్టీలపైనే ఆధారపడి ఉంది” అని ఒవైసీ తెలిపారు. బీహార్‌లోని సీమాంచల్ ప్రాంతంలో బలమైన ఉనికిని కలిగి ఉన్న ఎంఐఎం 2022లో దాని ఐదుగురు ఎమ్మెల్యేలలో నలుగురు RJDలో చేరడంతో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. తమ పార్టీ సీమాంచల్ నుంచే కాకుండా బయట కూడా అభ్యర్థులను నిలబెడుతుందని ఒవైసీ అన్నారు. “వారు (మహాఘట్‌బంధన్) తమతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా లేకుంటే, తాము ప్రతిచోటా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నాం..” అని ఆయన అన్నారు. అంతకుముందు బీహార్‌లో ఓటర్ల జాబితాల “స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్”ను వ్యతిరేకిస్తూ ఒవైసీ భారత ఎన్నికల సంఘానికి లేఖ రాశారు.ఇది చట్టబద్ధంగా ప్రశ్నార్థకమైన చర్య అని, ఇది రాబోయే ఎన్నికలలో నిజమైన ఓటర్లకు స్వరం లేకుండా చేస్తుంది” అని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. “ఓటరు జాబితాలో నమోదు కావడానికి, ప్రతి పౌరుడు ఇప్పుడు వారు ఎప్పుడు, ఎక్కడ జన్మించారో నిరూపించే పత్రాలను మాత్రమే కాకుండా, వారి తల్లిదండ్రులు ఎప్పుడు, ఎక్కడ జన్మించారో కూడా చూపించాల్సి ఉంటుంది. ఉత్తమ అంచనాలు కూడా జననాలలో మూడింట ఒక వంతు మాత్రమే నమోదు అయ్యాయని చెబుతున్నాయి. చాలా ప్రభుత్వ పత్రాలు లోపాలతో నిండి ఉన్నాయి” అని ఆయన ఎక్స్‌లో తెలిపారు. అలాంటి ప్రక్రియ నిర్వహించడం వల్ల పేదలు ఓటర్ల జాబితా నుండి తొలగించబడతారని, ఇది వారి రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించడమేనని కూడా ఆయన వాదించారు.

# మహిళలను వేధించేవారి బెండు తీస్తున్న షీ టీమ్స్.. 15 రోజుల్లో ఎంత మంది చిక్కారంటే..?




రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మహిళలపై వేధింపులకు పాల్పడిన 141 మంది ఆకతాయిలను షి టీమ్ అటకట్టించారు. వీరిలో 42 మంది మైనర్లు ఉండటం గమనార్హం. జూన్ 1వ తేదీ నుంచి 15 తేదీ వరకు వాట్సాప్, డైరెక్ట్ కంప్లైంట్లు, సోషల్ మీడియాలో వచ్చిన 163 ఫిర్యాదుల ఆధారంగా చర్యలు తీసుకున్నారు.రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మహిళలపై వేధింపులకు పాల్పడిన 141 మంది ఆకతాయిలను షి టీమ్ అటకట్టించారు. వీరిలో 42 మంది మైనర్లు ఉండటం గమనార్హం. జూన్ 1వ తేదీ నుంచి 15 తేదీ వరకు వాట్సాప్, డైరెక్ట్ కంప్లైంట్లు, సోషల్ మీడియాలో వచ్చిన 163 ఫిర్యాదుల ఆధారంగా చర్యలు తీసుకున్నారు.మెట్రో రైళ్లు, స్టేషన్లు, బస్టాపులు, ఆఫీసులు, కాలేజీల వంటి హాట్ స్పాట్లలో వేధింపులు చోటుచేసుకున్నాయని పోలీస్ అధికారుల తెలిపారు. అరెస్ట్ అయిన వారందరికీ ఎల్బీనగర్‌లోని పోలీస్ కమిషనర్ క్యాంప్ ఆఫీస్‌లో శిక్షణ పొందిన కౌన్సిలర్లు, ప్రొఫెషనల్ సైకాలజిస్టుల ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. మైనర్లకు సీనియర్ సైకాలజిస్టుల ద్వారా ప్రత్యేకంగా కౌన్సిలింగ్ అందించారు. అదే సమయంలో మెట్రో రైళ్లు తదితర ప్రాంతాల్లో డేకాయ్ ఆపరేషన్ల ద్వారా ఆరుగురిని పట్టుకుని జరిమానాలు విధించారు.

ఇక బాల్య వివాహాలపై అవగాహన కల్పించేందుకు స్వయం సహాయక సంఘాల సహకారంతో రాచకొండ పోలీసులు ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో రెండు బాల్య వివాహాలను అడ్డుకున్నారు. రాచకొండ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు షి టీమ్ సేవలను అభినందించారు. ఎటువంటి ఇబ్బంది ఎదురైనా మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి సి టీమ్ ను సంప్రదించాలని కోరారు. అవసరమైతే రాచకొండ వాట్సాప్ కంట్రోల్ నంబర్ 8712662111 లేదా డయల్ 100 కు కాల్ చేయాలని సూచించారు.

# ఆటవికం, అమానుషం - ఇంతకంటే దారుణం ఉంటుందా..? మహిళను చెట్టుకు కట్టేసి..



వరంగల్ జిల్లా ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామంలో అమానుష ఘటన వెలుగుచూసింది. వివాహేతర సంబంధం ఆరోపణలతో మహిళను బంధించి, దారుణంగా వేధించారు. బాధితుల ఆచూకీ తెలియక పోవడం ఆందోళనకరంగా మారింది. పోలీసులు నలుగురు నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. పూర్తి వివరాలు తెలుసుకుందాం...

ఆటవికం, అమానుషం.. ఈ ఘటన గురించి ఏం చెప్పాలి.. అజ్ఞానంతో పశువుల కంటే దారుణంగా ప్రవర్తించారు. ఒక వివాహిత అక్రమ సంబంధం పెట్టుకుందన్న ఆరోపణలతో.. కొందరు ఆమెను బంధించి, వివస్త్రను చేసి అత్యంత దారుణంగా ప్రవర్తించారు. ఆమె జననాంగాల్లో జీడి పొడి పోసి పాశవికంగా వ్యవహరించారు. బాధితురాలు ఎంత వేడుకున్నా వారు వినలేదు. అపై ఆమెతో పాటు వివాహేతర సంబంధం పెట్టుకున్నారని ఆరోపిస్తున్న వ్యక్తికి అరగుండు కొట్టారు. మాటల్లో చెప్పలేనట్లుగా ప్రవర్తించారు నిందితులు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామంలో ఈ దారుణం వెలుగుచూసింది. తన భర్త ఆ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని రాజు భార్య కుటుంబసభ్యులకు చెప్పింది. దీంతో భార్య తరపు బంధువులు రాజు, సదరు మహిళను దొరకబట్టి అమానవీయంగా దాడిచేశారు. ఆ తరువాత ఆ ఇద్దరినీ ఏం చేశారో ఇప్పటివరకు ఆచూకీ తెలియడం లేదు. తప్పు చేశారని చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటారా? మీరే దాడి చేసి పనిష్మెంట్ ఇస్తారా అంటూ హనుమకొండ జిల్లా ధర్మసాగర్ ఘటనపై సీరియస్ అయ్యారు పోలీసులు. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

# రష్యా చమురు కొంటే 500% సుంకం
## అమెరికాలో బిల్లు.. భారత్‌పై తీవ్ర ప్రభావం

వాషింగ్టన్, : ఉక్రెయిన్‌తో యుద్ధం తర్వాత రష్యాకు మిగిలిన అతి పెద్ద ఆదాయ వనరు చమురు. రష్యాపై ఆర్థిక ఆంక్షలు మరింత కఠినతరం చేయాలంటే ఆ దేశం నుంచి చమురు కొంటున్న దేశాలపై భారీగా సుంకాలు విధించాలంటూ అమెరికా సెనేటర్ లిండ్సీ గ్రహమ్ ఒక బిల్లు తయారుచేశారు. అధ్యక్షుడు ట్రంప్ సూచనతోనే ఈ బిల్లు తయారైందని వార్తలు వెలువడుతున్నాయి. రష్యా చమురులో 70 శాతం భారత్, చైనాలే కొంటున్నాయి. అంటే గ్రహమ్ బిల్లు ప్రధానంగా ఈ రెండు దేశాలనే లక్ష్యంగా చేసుకున్నట్టు స్పష్టమవుతోంది. ఇటువంటి దేశాలు అమెరికాకు ఎగుమతి చేసే సరుకులపై 500 శాతం సుంకం విధించాలని తన బిల్లులో ఆయన ప్రతిపాదించారు.

రష్యా దగ్గర చమురు కొనడం అంటే ఉక్రెయిన్‌కు మద్దతు నిరాకరించినట్టే భావించాల్సి ఉంటుందని ఆ బిల్లులో పేర్కొన్నారు. తన బిల్లుకు ట్రంప్ మద్దతు ఇచ్చారని, దీనిపై ముందుకెళ్లడానికి ఇదే సరైన సమయమని ఆయన సూచించారని గ్రహమ్ తెలిపారు. తన బిల్లు సెనేట్‌కు ఆగస్టులో రావచ్చునని తెలిపారు. నిజానికి, 2022లో ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధం మొదలవగానే ప్రపంచ మార్కెట్‌లో చమురు ధరలు భగ్గుమన్నాయి. భారత్‌కు చౌకగా చమురు ఇవ్వడానికి ఈ సమయంలో రష్యా ముందుకొచ్చింది. యుద్ధానికి ముందు భారత్‌కు ప్రపంచ దేశాల నుంచి దిగుమతి అయిన చమురు ఉత్పత్తుల్లో ఒక శాతం కంటే తక్కువగానే రష్యా నుంచి అందేవి. ఇప్పుడు ఆ పరిమాణం 40-45 శాతానికి పెరిగిపోయింది.

# బైక్ కొంటున్నారా.. అయితే ఇకపై రెండు హెల్మెట్లు కొనాల్సిందే ! కేంద్ర ప్రభుత్వ కొత్త రూల్స్ ఇవే..



కేంద్ర ప్రభుత్వం 2026 జనవరి 1 నుండి రెండు వీలర్లపై కొత్త భద్రతా నిబంధనలు అమలు చేయనుంది. రైడర్, పిల్లియన్ ఇద్దరూ హెల్మెట్ ధరించడం తప్పనిసరి అవుతుంది. అంతేకాదు 50cc కంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న కొత్త ద్విచక్ర వాహనాలలో ABS (యాంటీ-లాక్ బ్రేకింగ్ సిస్టమ్) తప్పనిసరి చేయనున్నారు. ఇకపై టూ వీలర్ కొనే వారు.. కచ్చితంగా రెండు హెల్మెట్లు కొనాల్సిందే. ఎందుకంటే కేంద్ర ప్రభుత్వం దీనికి సంబంధించి నిర్ణయం తీసుకోనుంది. వాహనం నడిపేవారికి, వెనుక కూర్చున్న వారికి కూడా హెల్మెట్ తప్పనిసరి చేస్తూ మార్గదర్శకాలు జారీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ కొత్త నిబంధనలను అమల్లోకి తీసుకొచ్చేందుకు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ కేంద్ర మోటార్ వాహనాల రూల్స్-1989 కు పలు ముఖ్య మైన మార్పులను చెయ్యాలని కేంద్రం ప్రతిపాదించింది. కొత్త సవరణ నియమాల తుది నోటిఫికేషన్ అధికారిక గెజిట్‌లో ప్రచురించిన తర్వాత మూడు నెలల్లోపు ఈ రూల్ తప్పనిసరి అవుతుందని ప్రభుత్వ నోటిఫికేషన్ పేర్కొంది. వాహనం నడిపే వారితో పాటు వెనక కూర్చున్న వారి భద్రత కోసం కొత్త నిబంధనను కేంద్రం అమలులోకి తీసుకురానుంది. హెల్మెట్ నిబంధనతో పాటు ప్రభుత్వం మరో భద్రతా చర్యను కూడా ప్రతిపాదించింది. 2026, జనవరి 1 నుంచి 50 సీసీ కంటే ఎక్కువ సామర్థ్యం లేదా గంటకు 50 కిలోమీటర్ల వేగం దాటే మోటార్ సైకిళ్లు, స్కూటర్లు సహా అన్ని కొత్త ఎల్2 క్యాటగిరీ ద్విచక్ర వాహనాలకు యాంటీ-లాక్ బ్రేకింగ్ వ్యవస్థ(ఏబీఎస్) లను అమర్చాలని సూచనలు జారీచేసింది. వాహనానికి ఆకస్మికంగా బ్రేక్ వేసిన సమయంలో వాహనాన్ని నియంత్రించడానికి, దానితో పాటు వాహనం జారిపోయే అవకాశాలను కూడా తగ్గిస్తుంది అని నివేదికలో స్పష్టం చేశారు.

# రాజ్యాంగమే సుప్రీం

## బుల్డోజర్ న్యాయం పనిచేయదు.. సీజేఐ జస్టిస్ గవాయ్ వ్యాఖ్యలు

అమరావతి (మహారాష్ట్ర), : దేశంలో రాజ్యాంగమే సర్వోన్నతమని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ అన్నారు. ప్రజాస్వామ్యంలోని మూడు విభాగాలైన న్యాయ, కార్యనిర్వాహక, శాసన వ్యవస్థలు దాని కిందే పనిచేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. తన జన్మస్థానమైన అమరావతిలో బుధవారం జరిగిన సన్మానసభలో ఆయన ప్రసంగించారు. రాజ్యాంగమే సర్వోన్నతం అంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన 'మౌలిక స్వరూపం' తీర్పును ప్రస్తావించారు. రాజ్యాంగాన్ని సవరించే అధికారం మాత్రమే పార్లమెంటుకు ఉందని, పూర్తిగా మార్చివేసే అధికారంలేదని ఆ తీర్పు ద్వారా స్పష్టం చేసిందని పేర్కొన్నారు. పార్లమెంటే సుప్రీం అని కొందరు అంటున్నారని, కానీ తన ఉద్దేశంలో రాజ్యాంగమే సుప్రీం అని అన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆదేశాలు ఇచ్చినంత మాత్రాన జడ్జి స్వతంత్రంగా వ్యవహరిస్తున్నట్టు కాదన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులను కాపాడేలా తాను తీర్పులు ఇచ్చినట్టు జస్టిస్ గవాయ్ చెప్పారు. బుల్డోజర్ న్యాయానికి వ్యతిరేకంగా ఇచ్చిన తీర్పును ప్రస్తావించారు. నివాస హక్కు సుప్రీం అని, దానిని బుల్డోజర్లతో అడ్డుకోలేరని తెలిపారు.

# చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్ కొత్త కూటమి..?

## ఇండియాకు వ్యతిరేకంగా పెద్ద ప్లానింగ్..!



చైనా, పాకిస్తాన్, బంగ్లాదేశ్ దేశాలు SAARC కు ప్రత్యామ్నాయంగా కొత్త ప్రాంతీయ సంస్థను ఏర్పాటు చేసేందుకు కున్మింగ్‌లో సమావేశమయ్యాయి. ఈ కొత్త సంస్థ ఆర్థిక సంబంధాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధిని మెరుగుపరుస్తుందని భావిస్తున్నారు. బంగ్లాదేశ్ ఈ కొత్త సంస్థ రాజకీయ కూటమి కాదని స్పష్టం చేసింది. ఇండియా కీలక సభ్యుడిగా ఉన్న దక్షిణాసియా ప్రాంతీయ సహకార సంఘం (SAARC) స్థానంలో కొత్త ప్రాంతీయ సంస్థను సృష్టించే ప్రతిపాదనపై పాకిస్తాన్, చైనా, బంగ్లాదేశ్ పనిచేస్తున్నట్లు సమాచారం. ప్రాంతీయ సమైక్యత, కనెక్టివిటీని పెంచే లక్ష్యంతో కొత్త వేదికను ఏర్పాటు చేయడానికి పాకిస్తాన్, చైనా రెండు దేశాలు చర్చలను వేగవంతం చేస్తున్నాయని దౌత్య వర్గాలను ఉటంకిస్తూ పాకిస్తాన్ ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్ నివేదించింది.

**కున్మింగ్ సమావేశం..** జూన్ 19న కున్మింగ్‌లో జరిగిన సమావేశంలో ఈ ఆలోచన మరింత రూపుదిద్దుకుంది. ఈ సమావేశంలో బంగ్లాదేశ్‌తో పాటు పాకిస్తాన్, చైనా పాల్గొన్నాయి. నివేదికల ప్రకారం.. కున్మింగ్ చర్చలు కొత్త ప్రాంతీయ కూటమిని నిర్మించడానికి చైనా, పాకిస్తాన్ చేస్తున్న ప్రయత్నాల కొనసాగింపు. ఇటీవలి సంవత్సరాలలో సార్క్ పెద్దగా ప్రభావం చూపని ప్రాంతాలైన ఆర్థిక సంబంధాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రాంతీయ సమన్వయాన్ని చురుకుగా ప్రోత్సహించగల నిర్మాణాన్ని సృష్టించడంపై దృష్టి కేంద్రీకరించబడింది.

ఈ నూతన కూటమిలో చేరడానికి ఆహ్వానాలు శ్రీలంక, మాల్దీవులు, ఆఫ్ఘనిస్తాన్ వంటి ఇతర మాజీ సార్క్ సభ్య దేశాలకు కూడా అందే అవకాశం ఉందని ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్ నివేదించింది. మే నెలలో చైనా, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ మధ్య జరిగిన ఇలాంటి త్రైపాక్షిక సమావేశం తర్వాత కున్మింగ్ సమావేశం జరిగింది.

ఆ సమావేశం చైనా-పాకిస్తాన్ ఆర్థిక కారిడార్ (CPEC) విస్తరణ, తాలిబాన్ పాలిత ఇస్లామిక్ ఎమిరేట్‌తో సహా ఈ ప్రాంతంలో సహకారాన్ని పెంచే మార్గాల చుట్టూ తిరిగింది. కొత్త ప్రభావవంతమైన ప్రాంతీయ వేదిక కోసం సమయం ఆసన్నమైందని చైనా, పాకిస్తాన్ రెండూ నమ్ముతున్నాయని నివేదికలో పేర్కొన్నారు. అయితే కున్మింగ్ సమావేశంలో పాల్గొన్నప్పటికీ చైనా, పాకిస్థాన్‌లతో కొత్త రాజకీయ కూటమిని ఏర్పాటు చేస్తున్నారనే వాదనలను బంగ్లాదేశ్ అధికారికంగా తోసిపుచ్చింది. ఈ సమావేశం రాజకీయ స్వభావం కలిగి లేదని, మూడు దేశాల మధ్య వ్యూహాత్మక కూటమిని సృష్టించినట్లు అర్థం చేసుకోకూడదని బంగ్లా అధికారులు స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో కలకలం.. మత్తు కోసం కల్లులో ఏం కలుపుతారో తెలుసా..? వామ్మో యమ డేంజర్



వాస్తవానికి కల్లు అనగానే పల్లెటూళ్లు గుర్తుకొస్తాయి. తాటి, ఈత చెట్ల నుంచి వచ్చే కల్లు ప్రజలు తాగి ఆస్వాదిస్తుంటారు, కల్లుతాగితే మంచిదని కూడా కొంతమంది చెబుతుంటారు. పల్లెల్లో సరే.. పొట్టకూటి కోసం పట్టణాలకు వచ్చిన వారి కోసం నగరాల్లో కల్లు కాంపౌండ్లు వెలిశాయి. నగర శివారు ప్రాంతాల నుంచి కల్లు సేకరించి ఆయా ప్రాంతాల్లో విక్రయిస్తారు. హైదరాబాద్ నగరంలో కల్తీ కల్లు ఘటన కలకలం రేపింది.. ఈ ఘటనలో మృతుల సంఖ్య రెండుకు చేరింది. కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనపై సర్కార్ సీరియస్ అయింది.. మూడు కల్లు కాంపౌండ్లు సీజ్ చేసిన ఎక్సైజ్ పోలీసులు.. ఐదుగురిని అరెస్ట్ చేసి విచారణ జరుపుతున్నారు. కూకట్‌పల్లి సర్దార్ పటేల్ నగర్, ఇంద్రహిల్స్, కె.పి.హెచ్.బి ఉషాముళ్లపూడి రోడ్డులోని కల్లు కాంపౌండ్‌లలోకల్లు తాగి దాదాపు 20మందికిపైగా అస్వస్థతకు గురయ్యారు. నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సీతారాం అనే వ్యక్తి మృతి చెందాడు. గాంధీలో చికిత్స పొందుతూ.. స్వరూప అనే మహిళ చనిపోయింది. కల్తీ కల్లు ఘటనలో హైదర్‌నగర్‌లో మరో ఇద్దరికి అస్వస్థతగురయ్యారు. జగన్, లక్ష్మమ్మ అనే ఇద్దరికి వాంతులు, విరేచనాలవ్వడంతో ఆస్పత్రికి తరలించారు. నిమ్స్ ఆస్పత్రిలో కల్తీ కల్లు బాధితులను పరామర్శించారు ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు. ఘటన జరిగిన వెంటనే వేగంగా స్పందించి.. అందరినీ హాస్పిటల్స్‌కు తరలించామన్నారు. కల్తీ కల్లుతో 19మంది అస్వస్థతకు గురయ్యారని.. వారందరి ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు.వాస్తవానికి కల్లు అనగానే పల్లెటూళ్లు గుర్తుకొస్తాయి. తాటి, ఈత చెట్ల నుంచి వచ్చే కల్లు ప్రజలు తాగి ఆస్వాదిస్తుంటారు, కల్లుతాగితే మంచిదని కూడా కొంతమంది చెబుతుంటారు. పల్లెల్లో సరే.. పొట్టకూటి కోసం పట్టణాలకు వచ్చిన వారి కోసం నగరాల్లో కల్లు కాంపౌండ్లు వెలిశాయి. నగర శివారు ప్రాంతాల నుంచి కల్లు సేకరించి ఆయా ప్రాంతాల్లో విక్రయిస్తారు. అయితే కల్లు కాంపౌండ్ నిర్వాహకుల కాసుల కక్కుర్తి కల్తీ కల్లు దారుణాలకు కారణమవుతోంది. సాధారణంగా చెట్టు నుంచి తీసిన కల్లు మంచిది.. కానీ కృత్రిమంగా తయారు చేసిన, రసాయనాలు కలిపిన కల్లు ప్రజల ప్రాణాలను తీస్తున్నాయి.

**కల్లును కల్తీ చేసేందుకు ఏం కలుపుతారో తెలుసా..**

సాధారణంగా కల్లును పలచగా చేసి ఎక్కువ క్వాంటిటీ కోసం నీళ్లను విరివిగా కలుపుతారు. వాటర్ మిక్స్ చేసినంత వరకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. కానీ కొంతమంది కక్కుర్తితో ప్రమాదకర, నిషేధిత రసాయనాలు కలుపుతున్నారు. టేస్ట్ కోసం.. కల్లు తాగే వారికి ఎక్కువ కిక్కు ఇచ్చేందుకు ఇలాంటి కల్లు కల్తీ చేస్తూ ప్రయోగాలు చేస్తున్నారు. కల్తీ కల్లులో అల్ప్రజోలం, క్లోరోహైడ్రేట్, డయాజెపామ్ వంటి మత్తు పదార్థాలు మిక్స్ చేస్తున్నారు. ఇలాంటివి మిక్స్ చేస్తే కల్లు తాగిన వారి ఆరోగ్యం పాడవుతుంది. ముఖ్యంగా మోతాదుకు మించి రసాయనాలు కలిపినప్పుడు కల్లు తాగిన బాధితులు వాంతులు, విరేచనాలతో తీవ్రఇబ్బందులు పడుతూ అస్వస్థతకు గురవుతారు. కొన్ని సందర్భాల్లో కిడ్నీలపై ప్రభావం పడి మరణిస్తారు. కల్తీ కల్లు బాధితుల్లో ఎక్కువ మందికి నరాలపై తీవ్రప్రభావం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.కల్లు కాంపౌండ్ నిర్వాహకుల కాసుల కక్కుర్తి కొన్ని కుటుంబాల ఉసురు పోసుకుంటుంది. ఇలాంటి వాటిపై ఎక్సైజ్ శాఖ దాడుల జరిపి కల్తీ కల్లు వ్యవహారాన్ని నిషేధించాలని ప్రజలు కోరుతున్నారు. కల్లు కాంపౌండ్ లలో తాగేది ఎక్కువ మంది ఉదయం నుంచి సాయంత్రం వరకు కష్టం చేసి వచ్చే పేద ప్రజలే కావడంతో వారంతా కల్తీ కల్లు బారిన పడి తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు.. కావున భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# మీ బడ్జెట్‌లో వీకెండ్ టూర్.. ఐఆర్సీటీసీ నుంచి బెస్ట్ ప్యాకేజ్..




ఐఆర్సీటీసీ తరచూ ప్రయాణికుల కోసం కొత్త టూర్ ప్యాకేజీలను తీసుకొని వచ్చింది. అలాగే తాజాగా మరో ప్యాకేజీ తీసుకొచ్చింది. ఇది వీకెండ్ సమయంలో టూర్ ప్లాన్ చేసుకున్నవారు బెస్ట్ అనే చెప్పాలి. మరి ఆ టూర్ వీకెండ్ ప్యాకేజ్ ఏంటి.? ఎక్కడికి.? టికెట్ ధర ఎంత.? దీని గురించి పూర్తి వివరాలు ఈరోజు మనం ఈ స్టోరీలో తెలుసుకుందాం..

గోదావరి టెంపుల్ టూర్ పేరుతో ఓ కొత్త టూర్ ప్యాకేజ్ తీసుకొచ్చింది ఐఆర్సీటీసీ. ఈ ప్యాకేజీ కోడ్ SHR029 రాజమండ్రి, అన్నవరం, అంతర్వేది ప్రాంతాలను ఈ ప్యాకేజీలో కవర్ చేయవచ్చు. ఈ టూర్ మొత్తం రైలులో కొనసాగుతుంది. ఇందులో స్లీపర్ అండ్ థర్డ్ ఏసి అందుబాటులో ఉన్నాయి. ఈ టూర్ ప్రతి శుక్రవారం లింగంపల్లి నుంచి రాత్రి 08:30 గంటలకు ప్రారంభం అవుతుంది. సికింద్రాబాద్ కూడా పిక్ అప్ పాయింట్ ఉంది. 01వ రోజు శుక్రవారం లింగంపల్లి రైల్వే స్టేషన్ నుంచి రాత్రి 08:30 గంటలకు, సికింద్రాబాద్ రాత్రి 09:15 గంటలకు రైలు నంబర్ 12738 (గౌతమి ఎక్స్‌ప్రెస్) ద్వారా మొదలవుతుంది. రాత్రంతా ప్రయాణం చేయాల్సి ఉంటుంది. 02వ రోజు శనివారం ఉదయం 04:38 గంటలకు రాజమండ్రి స్టేషన్ చిరుకొని అక్కడినుంచి హోటల్‌లో చెక్ ఇన్ అయ్యి ఫ్రెష్ అవుతారు. తర్వాత రాజమండ్రి నుంచి 80 కి.మీ దూరంలో ఉన్న అన్నవరం వెళ్లి శ్రీ సత్యనారాయణ స్వామివారి దర్శనం చేసుకొంటారు. ఇక్కడ ప్రసాదం తీసుకోవడం మర్చిపోవద్దు. ఇది చాల రుచికరంగా ఉంటుంది. సాయంత్రం మళ్లీ రాజమండ్రి తిరిగి వెళ్లి గోదావరి ఘాట్, ఇస్కాన్ ఆలయాన్ని చూసి రాత్రి అక్కడే బస చేస్తారు. 03వ రోజు ఆదివారం హోటల్‌లో చెక్ అవుట్ చేసి అంతర్వేదికి బయలుదేరుతారు. అక్కడ లక్ష్మీ నరసింహ స్వామి దర్శనం తర్వాత బీచ్‌ను సందర్శిస్తారు. తర్వాత శ్రీ బాల బాలాజీ ఆలయం, అప్పనపల్లి, విఘ్నేశ్వర ఆలయం, అయినవల్లి చూస్తారు. సాయంత్రం ద్రాక్షారామం ఆలయ దర్శనం చేసుకొని రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో చేరుకొని 08:18 గంటలకు రైలు నంబర్ 12737 (గౌతమి ఎక్స్‌ప్రెస్)లో తరుగు ప్రయాణం ఉంటుంది. రాత్రంతా ప్రయాణం తర్వాత 04వ రోజు సోమవారం ఉదయం సికింద్రాబాద్‌కు 04:35 గంటలకు, లింగంపల్లికి 05:55 గంటలకు చేరుకుంటారు. దీంతో టూర్ మోగిస్తుంది. ఈ టూర్ ప్యాకేజ్ టికెట్ ధరల విషయానికి వస్తే.. 1 నుంచి 3 ప్రయాణీకులు ఉంటె ప్యాకేజీ టారిఫ్ ప్రతి వ్యక్తికి కంఫర్ట్ (3AC)లో సింగిల్ షేరింగ్ రూ. 15340, ట్విన్ షేరింగ్ రూ. 8940, ట్రిపుల్ షేరింగ్ రూ. 7170, 5-11 సంవత్సరాలు పిల్లలకు విత్ బెడ్ రూ. 6080, విత్ అవుట్ బెడ్ రూ. 4960గా ఉంది. అలాగే స్టాండర్డ్ (SL)లో సింగిల్ షేరింగ్ రూ. 13800, ట్విన్ షేరింగ్ రూ. 7400, ట్రిపుల్ షేరింగ్ రూ. 5630, 5-11 సంవత్సరాలు పిల్లలకు విత్ బెడ్ రూ. 4540, విత్?అవుట్ బెడ్ రూ. 3420గా ఫిక్స్ చేసారు. ఒకవేళ 4 నుంచి 6 ప్రయాణీకులు ఉంటె ప్యాకేజీ టారిఫ్ తగ్గుతుంది. ఇందులో ప్రతి వ్యక్తికి కంఫర్ట్ (3AC) లో ట్విన్ షేరింగ్ రూ. 7440, ట్రిపుల్ షేరింగ్ రూ. 6630, 5-11 సంవత్సరాలు పిల్లలకు ఏమి మారలేదు. అలాగే స్టాండర్డ్ (SL) లో ట్విన్ షేరింగ్ రూ. 5900, ట్రిపుల్ షేరింగ్ రూ. 5630, 5-11 సంవత్సరాలు పిల్లలకు అదే టారిఫ్ ఉంది.

# వాడుకుని కట్టట్లేదు..

- **క్రెడిట్ కార్డ్ ఎన్పీఏలు పైపైకి**
- **ప్రభుత్వ బ్యాంకుల్లోనే అధికం**
- **ఆర్బీఐ నివేదికలో వెల్లడి**




ప్రభుత్వరంగ బ్యాంకుల్లో క్రెడిట్ కార్డుల మొండి బకాయిలు పెరిగిపోతున్నాయి. ఈ ఏడాది మార్చిలో క్రెడిట్ కార్డ్ పోర్ట్ఫో లియో నుంచి స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్పీఏ) 14.30 శాతందాకా ఉన్నట్టు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) విడుదల చేసిన అర్థ వార్షిక ఆర్థిక సుస్థిరత నివే దిక (ఎఫ్ఎస్ఆర్) లో తేలింది. 6 నెలల క్రితం ఇది 12.7 శాతంగానే ఉన్నది. అయితే ఈ విషయంలో ప్రైవేట్ రంగ బ్యాంకులు ఎంతో మెరుగ్గా ఉన్నాయి. వీటిలో ఎంతకీ వసూలుకాని క్రెడిట్ కార్డుల బకాయిలు కేవలం 2.1 శాతంగానే ఉండటం గమనార్హం. మునుపు కూడా ఇదే స్థాయిలో ఉన్నాయి. దీంతో ప్రభుత్వ బ్యాంకులు క్రెడిట్ కార్డు బకాయిల వసూళ్లలో ఎంత ఉదాసీనంగా వ్యవహరిస్తు న్నాయో అర్థమవుతున్నది.

**జాగ్రత్తగా ఉండాల్సిందే..** సర్కారీ బ్యాంకుల స్థూల నిరర్థకఆస్తుల్లో క్రెడిట్ కార్డుల ద్వారా పెరుగు తున్నవి ఎక్కువగా ఉండటంపట్ల ఆర్బీఐ ఒకింత ఆందోళన వ్యక్తం చేసింది. ఈ రకమైన అన్సెక్యూర్డ్ లోన్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, లేకపోతే ఇబ్బందులు తప్పవంటూ హెచ్చరించింది. కాగా ఓవరాల్గా ప్రైవేట్ రంగ బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తులు 1.8 శాతంగా ఉంటే.. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 2.8 శాతంగా ఉన్నాయి. నిజానికి మార్చిలో దేశంలోని ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తులు దశాబ్దాల కనిష్ఠాన్ని తాకుతూ 2.3 శాతానికి దిగొచ్చాయి. నిరుడు సెప్టెంబర్ నెలలో వచ్చిన ఎఫ్ఎస్ఆర్లో ఇవి 2.6 శాతంగా ఉన్నాయి. అయితే 2027 మార్చి నాటికి మళ్లీ పెరగవచ్చన్న అనుమానాన్ని ఆర్బీఐ కనబర్చింది. ఇక మొత్తం షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల స్థూల ఎన్పీఏల్లో 46 బ్యాంకులకు చెందినవే 98 శాతం ఉన్నట్టు ఆర్బీఐ ఈ సందర్భంగా వెల్లడించింది.

# ఐదేళ్లూ నేనే ముఖ్యమంత్రి: సిద్ధరామయ్య

## ఆయనకు మద్దతివ్వడం తప్ప మరో దారి లేదు: డీకే

బెంగళూరు, : నాయకత్వ మార్పుపై ఊహాగానాలు జోరందుకున్న నేపథ్యంలో కర్ణాటక సీఎం సిద్దరామయ్య స్పందించారు. చిక్కబళ్లాపురలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. ఐదేళ్లు తానే సీఎంగా కొనసాగుతానని, ఈ విషయంలో ఎలాంటి అనుమానం అవసరం లేదని స్పష్టంచేశారు. బీజేపీ నేతలు అబద్ధాలు చెప్పడంలో దిట్టలని, నిజాలు చెప్పడం వారికి తెలియదని విమర్శించారు. తన నాయకత్వంపై పార్టీలో ఎలాంటి అసంతృప్తి లేదని చెప్పారు. పార్టీ కోసం శ్రమించిన డీకే శివకుమార్ను గుర్తించి, ఆయనను సీఎం చేయాలని ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నారు కదా అని మీడియా ప్రశ్నించగా.. అందరూ ఎంతో కష్టపడ్డారని, తాను ఒంటరివాడిని కాదని సిద్దరామయ్య పేర్కొన్నారు.

మరోవైపు, సిద్దరామయ్యకు మద్దతు ఇవ్వడం తప్ప తనకు మరో మార్గం లేదని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టంచేశారు. చిక్కబళ్లాపుర జిల్లా నందిహిల్స్పై జరుగుతున్న క్యాబినెట్ మీటింగ్కు హాజరయ్యే సమయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తాను సిద్దరామయ్యకు అండగా ఉండి సహకరిస్తానని తెలిపారు. కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని తెలిపారు. ఓవైపు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి రణదీపసింగ్ సుర్జేవాలా బెంగళూరులో ఎమ్మెల్యేలతో చర్చలు కొనసాగిస్తుండగానే డీకే శివకుమార్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశమైంది.

# 25 ఏళ్లుగా భూ సమస్యను పరిష్కరించరా?

- **అధీకృత అధికారికి రూ.50 వేల జరిమానా విధించిన హైకోర్టు**
- **సైనిక సంక్షేమ నిధికి చెల్లించాలని ఆదేశం**




కాందిశీకుల భూములకు సంబంధించి వారసులు చేసుకున్న దరఖాస్తును 25 సంవత్సరాలైనా పరిష్కరించక పోవడం పై హైకోర్టు ఆశ్చర్యం వ్యక్తంచేసింది. భూయజమాన్య హక్కుల వివాదం తరాలు మారుతున్నా పరిష్కారం కావడంలేదంది.

హైకోర్టు ఆదేశాల మేరకు చేసుకున్న దరఖాస్తును కూడా పాతికేళ్లుగా పెండింగ్లో ఉంచిన అధీకృత అధి కారి తీరుపై అసంతృప్తి వ్యక్తంచేసింది.

మూడు నెలల్లో దరఖాస్తును పరిష్కరించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించి నందుకు రూ.50 వేలను సైనిక సంక్షేమ నిధికి చెల్లించా లని ఆదేశించింది. జనగామ పాత తాలూకాలోని కుందరం, బెక్కల్, సముద్రాల, జనగామ, మెట్టూరు, మాదూరు, సింగరాజపల్లి, బహిరిపల్లి, పథాల్, పాలకుర్తి, ఇర్రవేను, ముత్తారం, ఇప్పుగూడ, రఘునాథ్ పల్లి తదితర ప్రాంతాల్లో ఫాతిమా బేగం వారసులు సేల్ సర్టిఫికెట్ కోసం చేసిన దరఖాస్తును. పరిష్కరించపోవడాన్ని సవాలు చేస్తూ అబుల్ ఖైర్ నసీరుద్దీన్ కమ్రాన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

దీనిపై జస్టిస్ సి. వి. భాస్కర్ రెడ్డి విచారణ చేపట్టారు. ఈ భూములకు చెందిన వ్యక్తులు పాకిస్థాన్ వెళ్లిపోగా వాటిని కాందిశీకుల చట్టం కింద నియమితులైన అదీ కృత అధికారి స్వాదీనం చేసుకున్నారు. అయితే, వారి సోదరి సలేహా ఫాతిమాబేగం ఇక్కడే ఇక్కడే ఉండి సంబంధిత భూములపై సేల్ సర్టిఫికెట్ పొందారు. ఈ భూము లను 1962లో సేల్ సర్టిఫికెట్ జాబితా నుంచి తొలగించడంతో వారసులు హైకోర్టును ఆశ్రయించారు. అదీ కృత అధికారికి దరఖాస్తు చేసుకోవాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు వారసులు 2000లో దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుపై విచారణ తేలేదాకా భూము లను మ్యుటేషన్ చేయరాదని తహశీల్దారును అధీకృత అదికారి ఆదేశించారు. కానీ, ముందడుగు పడలేదు. గత ఏడాది వారసులు మరోసారి వినతిపత్రం సమర్పించినా పట్టించుకోకపో వడంతో హైకోర్టును ఆశ్రయిం చారు. దీనిపై విచారించిన న్యాయమూర్తి దరఖాస్తును మూడు నెలల్లో పరిష్కరించాలని ఆదేశించారు.

# ప్రపంచ పోలీసు క్రీడా పోటీలకు భారత్ ఆతిథ్యం

ఢిల్లీ: ప్రపంచ పోలీసు క్రీడల ఆతిథ్య దేశంగా భారత్ ఎంపికైంది. ప్రతిష్టాత్మకమైన 2029 ప్రపంచ పోలీస్, అగ్నిమాపక క్రీడలకు అహ్మదాబాద్ వేదిక అయింది. ఆతిథ్య దేశంగా భారత్ ఎంపికవడంతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు అమిత్ షా ఇవాళ(శుక్రవారం) ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతి భారత పౌరుడికి ఇది గొప్ప గర్వకారణమని అమిత్ షా పేర్కొన్నారు. పోలీసు క్రీడల నిర్వహణకు భారత్ ప్రతిష్టాత్మక బిడ్ను గెలుచుకుందని అమిత్ షా తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం నిర్మించిన విస్తారమైన క్రీడా మౌలిక సదుపాయాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. 1985 నుంచి ప్రతి రెండేళ్లకు ఒకసారి ప్రపంచ పోలీసు, అగ్నిమాపక క్రీడలు జరుగుతున్నాయి. ఇప్పటివరకు 20 సార్లు ప్రపంచ క్రీడలు జరిగాయి.

ఎనిమిదిసార్లు అమెరికా, ఐదుసార్లు కెనడా, నాలుగుసార్లు యూరప్, రెండుసార్లు బ్రిటన్, ఒకసారి చైనా నిర్వహించింది. 2007లో అడిలైట్లో జరిగిన క్రీడల్లో తొలిసారి ఇండియన్ పోలీస్ కంటింజెంట్ పాల్గొంది. 2023 కెనడాలో జరిగిన 20 పోలీసు క్రీడల్లో 343 పథకాలను 133 మంది పోలీసు సిబ్బంది గెలుచుకున్నారు. వీటిలో 224 బంగారు, 82 వెండి, 37 కాంస్య పథకాలు ఉన్నాయి. 2007 నుంచి 2023 వరకు 1400 పథకాలను భారత పోలీసు సిబ్బంది గెలుచుకున్నారు.

# దోమలు నాయనో దోమలు..

- జాడ లేని యాంటీ లార్వా ఆపరేషన్స్
- ఫాగింగ్ కూడా అంతంత మాత్రమే
- 8 నెలలుగా చీఫ్ ఎంటమాలజిస్ట్ పోస్ట్ ఖాళీ
- సగం ఫాగింగ్ మెషీన్లు పని చేస్తలేవ్
- మొత్తం పని చేస్తున్నాయని పెట్రోల్, డీజిల్ పక్కదారి




నగరంలో దోమల బాధ ఎక్కువైంది. రోజూ రాత్రి కాకముందే తలుపులు, కిటికీలు మూస్తున్నా వాటి బెడద మాత్రం తగ్గడం లేదు. బల్దియాలోని ఎంటమాలజీ విభాగం యాంటీ లార్వా ఆపరేష న్స్ సరిగ్గా చేయకపోవడం, ఫాగింగ్ ను చేయక పోవడం వల్ల తెల్లవారేదాకా జనాలు దోమలను కొట్టుకుంటూ నిద్రకు దూరమవ్వాల్సి వస్తోంది. గతంలో ఏటా ఎంటమాలజీ డిపార్ట్మెంట్ ఆఫీసర్లు సర్వే నిర్వహించి దోమల వ్యాప్తి ఉన్న ప్రాంతాలతో పాటు గతంలో ఎక్కువగా డెంగ్యూ కేసులు నమోదైన ప్రాంతాలను హాట్ స్పాట్లుగా గుర్తించేవారు. దోమల బ్రీడింగ్ పాయింట్లు ఎక్క డెక్కడున్నాయో గుర్తించి చర్యలు తీసుకునేవారు. ఇలా గ్రేటర్ లోని 4850 కాలనీలను ఎంటమాల జీ డిపార్ట్ మెంట్ పర్యవేక్షించేది ఈ సారి ఇంకా ఇటువంటి కార్యక్రమాలు చేస్తున్నట్టు కనిపించ డం లేదు.

**అసలు పోస్టు ఖాళీ..** బల్దియాలో దోమల నివారణకు కీలకమైన చీఫ్ ఎంటమాలజిస్ట్ పోస్టును 8 నెలలుగా ఖాళీ పెట్టారు. ఈ పోస్టులో ఉన్న రాంబాబు పదవీవిరమణ పొందగా, ఆయన స్థానంలో ఇప్పటివరకు ఎవరికీ బాధ్యతలు ఇవ్వలేదు. దీంతో దోమలు నివారించడానికి యాక్షన్ ప్లాన్ లేకుండా పోయింది. ముందు జోరుమీదున్నట్టు కనిపించిన వర్షాలు ఇప్పుడు ముఖం చాటెయ్య డంతో దోమలు ఎక్కువయ్యాయి. భారీ వర్షాలు కురిస్తే లార్వా నీటిలో కొట్టుకుపోయి దోమల బాధ తగ్గేది. కానీ, చిన్నపాటి వానలు, దంచు తున్న ఎండలతో సమస్య పెరిగింది. ఏటా జులై, ఆగస్టు నెలలో డెంగ్యూ కేసులు ఎక్కువగా నమో దవుతాయని, ఇప్పటికైనా పకడ్బందీ చర్యలు తీసుకోకపోతే ముప్పు తప్పదని నగరవాసులు భయపడు తున్నారు.

మూడు జోన్లలో తీవ్ర సమస్య.... గ్రేటర్ లో ఖైరతాబాద్, కూకట్ పల్లి, శేరిలింగంపల్లి జోన్లలో దోమల సమస్య తీవ్రంగా ఉంది. సికిం ద్రాబాద్ జోన్ లోని మల్కాజిగిరి, సికింద్రాబాద్ సర్కిల్స్ లోనూ ఇంతే.. ఈ జోన్లలో ఫాగింగ్ తో పాటు యాంటీ లార్వా అపరేషన్లు జరగడంలే దు. సూపర్ వైజర్లు, అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్, సీనియర్ ఎంటమాలజిస్టులు నిర్లక్ష్యం వహిస్తు న్నారు. వీరు కిందిస్థాయి వర్కర్లతో కోఆర్డినేషన్ చేసుకోవడంలో విఫలమవుతున్నారన్న ఆరోపణ లున్నాయి. కమిషనర్ ఆదేశాలను కూడా పట్టిం చుకోవడం లేదని తెలుస్తోంది. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10గంటల వరకు ఫాగింగ్ చేయాలని ఆదేశించినా లైట్ తీస్కుంటున్నారు.


**దోమల నివారణకు రూ.21 కోట్లు..** బల్దియా పరిధిలో

దోమల ఫాగింగ్ కోసం ఈసారిరూ.21 కోట్లు కేటాయించారు..150 డివిజన్లలో దోమల నియంత్రణ కోసం ఎంటమాలజీ డిపార్ట్ మెంట్లోని 2,375 సిబ్బంది పనిచేస్తున్నారు. వీరిలో 1800 మంది బస్తీలు, గల్లీలు, ఇండ్లకు వెళ్లి 1,817 ఫాగింగ్ మెషీన్లతో ఫాగింగ్ చేయాలి. కానీ, సగం ఫాగింగ్ మెషీన్లు పని చేయడం లేదు. ఎప్పుడో కొన్న మిషన్లు కావడంతో రిపేర్లు కూడా కష్టమేనని వర్కర్లంటున్నారు. కొందరు ఎంట మాలజీ ఎస్ఈలు, సూపర్ వైజర్లు కుమ్మక్కై అన్ని మెషీన్లు పనిచేస్తున్నట్లు రికార్డుల్లో రాసి డీజిల్ నొక్కేసి బయట అమ్ముకుంటున్నారు. పైగా ప్రతి రోజూ బ్రహ్మండగా ఫాగింగ్ చేస్తున్నామని ఎక్స్ లో పోస్టులు పెడుతున్నారు. ఏరియాల వారీగా రిపోర్ట్ రాసి కమిషనర్ కు ఇస్తున్నారు. చెరువుల్లో దోమల లార్వాను కంట్రోల్ చేయడానికి డ్రోన్ల ద్వారా స్ప్రే చేస్తు న్నామని చెప్తున్నా.. అందులో నిజం లేదని స్థానికు లంటున్నారు.

**పెట్రోల్, డీజిల్ స్వాహా...** ఎంటమాలజీ విభాగంలో డీజిల్, పెట్రోల్ మాయం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ సమస్యకి చెక్ పెట్టేందుకు బల్దియా కమిషనర్ డీజిల్, పెట్రోల్ కూపన్లకు బదులుగా క్రెడిక్ కార్డు తరహాలో కార్డులివ్వాలని నిర్ణయించా రు. ఈ సిస్టం ఇంకా అందుబాటులోకి రాకపో వడంతో దందా ఇంకా కొనసాగుతూనే ఉంది. అల్వాల్ సర్కిల్ లో ఓ ఆఫీసర్వర్కర్లకి ఎంతో కొంత డీజిల్, పెట్రోల్ ఇచ్చి మిగతాదంతానొక్కేస్తున్నాడు. ఇక్కడ ఎనిమిది చిన్న మెషీన్లు ఉండగా ఫీల్డ్ లోకి నాలుగే వస్తున్నాయని తెలిసింది. కానీ, 8 మెషీన్ల డీజిల్ వినియోగిస్తు న్నామని చూపుతున్నట్లు తెలిసింది. ఫాగింగ్ కోసం పెద్ద మెషీన్లకు రోజూ 45 లీటర్ల డీజిల్. 5 లీటర్ల పెట్రోల్, చిన్న యంత్రాలకు తొమ్మి దిన్నర లీటర్ల డీజిల్, లీటరున్నర పెట్రోల్ కావాలి. కానీ, సగం కంటే ఎక్కువ పక్కదారి పట్టిస్తున్నారు. అన్నిచోట్లా ఇదే పరిస్థితి ఉన్నట్టు సమాచారం.

# కొవిడ్ టీకాలు పూర్తి సురక్షితం

## ఆకస్మిక మరణాలతో వాటికి సంబంధం లేదు: కేంద్రం



న్యూఢిల్లీ, : వయసుతో సంబంధం లేకుండా ఉన్నట్టుండి గుండెపోటుతో పలువురు మృత్యువాత పడుతున్న ఘటనలు ఇటీవల తరచూ జరుగుతున్నాయి. క్రికెట్ ఆడుతూ, పెళ్లి ఊరేగింపులో నృత్యం చేస్తూ, వేదికపై పాట పాడుతూ... ఇలా ఎక్కడి వాళ్లు అక్కడే కుప్పకూ లిపోయి క్షణాల్లోనే ప్రాణాలు వదిలేస్తున్నారు. కరోనా తర్వాతే ఈ తరహా మరణాలు ఎక్కువ కావడంతో వారు తీసుకున్న కొవిడ్ టీకాలే దీనికి కారణమని ప్రచారం సాగుతోంది.


మరోవైపు కర్ణాటకలోని హాసన్ జిల్లాలో గత 40 రోజుల్లోనే 24 మంది గుండె సంబంధిత సమస్యలతో హఠాత్తుగా మృతిచెందడంతో వ్యాక్సిన్ ప్రభావంపై ఆ రాష్ట్ర సీఎం సిద్దరామయ్య అనుమానాలు వ్యక్తం చేశారు.

ఈ నేపథ్యంలో కేంద్రం కీలక ప్రకటన చేసింది. దేశంలో సంభవిస్తున్న ఆకస్మిక మరణాలకు, కొవిడ్-19 టీకాలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. పలు జాతీయ వైద్య సంస్థలు నిర్వహించిన పరిశోధనల్లో సైతం ఇదే విషయం నిర్ధారణ అయిందని తెలిపింది.

'కొవిడ్ అనంతరం ప్రత్యేకించి 18 నుంచి 45 ఏళ్ల వయసున్న వారిలో ఆకస్మిక మరణాలకు గల కారణాలపై ఐసీఎంఆర్, ఎన్సీడీసీ పరిశోధనలు చేశాయి. కొవిడ్ టీకాకు, ఈ మరణాలకు ఎలాంటి ప్రత్యక్ష సంబంధం లేదని ఈ అధ్యయనాల్లో తేలింది. భారత్‌లోని కొవిడ్ టీకాలు సురక్షితమైనవని పరిశోధనలు ధ్రువీకరించాయి. కొవిడ్ తదనంతర ఇబ్బందులతో పాటు జన్యుపరమైన సమస్యలు, జీవనశైలి, గతంలో ఉన్న అనారోగ్యం వంటివి కూడా కార్డియాక్ అరెస్టుకు దారితీసి ఉండొచ్చని అధ్యయనాల్లో వెల్లడైంది' అని కేంద్రం వివరించింది. కాగా, 2021 అక్టోబరు నుంచి 2023 మార్చి మధ్య కాలంలో ఆరోగ్యంగా ఉన్నట్లు కనిపించినప్పటికీ ఆకస్మికంగా మరణించిన వ్యక్తులకు సంబంధించిన డేటాను ఐసీఎంఆర్ విశ్లేషించి ఈ నివేదికను రూపొందించింది.

# సభలో చర్చిద్దామంటే ప్రెస్‌క్లబ్‌లో రాద్ధాంతం

- అభివృద్ధి, నదీ జలాలపై మాట్లాడటానికి సిద్ధం..
- అసెంబ్లీలో చర్చిద్దామంటే ప్రెస్ క్లబ్‌కు వెళ్లి రాద్ధాంతం
- వచ్చే ఎన్నికల్లో బిఆర్‌ఎసకు డిపాజిట్లు గల్లంతే: భట్టి
- కేటీఆర్ పిచ్చికుక్కలా ఒర్లుతున్నడు: రామ్మోహన్‌రెడ్డి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- నేను స్పందించేంత స్థాయి కేటీఆర్‌ది కాదు: మహేషగౌడ్
- మీ నాన్నని ప్రతిపక్ష హోదా అడుక్కో: పొన్నం ప్రభాకర్
- చెల్లెలి ఫోన్ ట్యాప్ చేసిన నీచ చరిత్ర నీది: అద్దంకి దయాకర్
- రేవంత్‌ను అంటే కోసి కారం పెడతాం: కవ్వంపల్లి సత్యనారాయణ




హైదరాబాద్ : తెలంగాణ సిద్ధించాక రాష్ట్రంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో, ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో జరిగిన అభివృద్ధిపై గోదావరి, కృష్ణ జలాలపై అసెంబ్లీలో చర్చకు తాము సిద్ధమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పునరుద్ఘాటించారు. ఇదే విషయంపై కేసీఆర్ సభలో చర్చకు రావాలని ముఖ్యమంత్రి పిలుపునిస్తే ఆయన రారు మేము వస్తామని కేటీఆర్ చివరకు హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌కు పోయి చర్చకు వచ్చామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తనతో ముఖ్యమంత్రి చర్చకు రావాలంటూ ప్రెస్‌క్లబ్‌లో కేటీఆర్ సవాళ్లు విసరడంపై భట్టి స్పందించారు. కృష్ణ, గోదావరి జలాలను ఇష్టం వచ్చినట్లు వాడుకోండని ఏపీ సర్కారుకు కేసీఆర్ చెప్పింది నిజం కదా ? అని ప్రశ్నించారు. సంబంధిత వీడియోలను కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌లో చూపించారని గుర్తు చేశారు. ప్రాజెక్టుల పేరుతో లక్షన్నర కోట్లు ఖర్చు చేసి బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టుమని పదెకరాలకు కూడా నీరందించలేదని ఎద్దేవా చేశారు. ఇదే ధోరణి కొనసాగితే వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు డిపాజిట్లు కూడా దక్కవని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. కేటీఆర్‌ది తాను స్పందించేంత స్థాయి కూడా కాదని టీపీసీసీ అధ్యక్షుడు మహేషకుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు.

ఆయన ప్రజా సమస్యలపై మాట్లాడాలంటే అసెంబ్లీ ఉందని, అసెంబ్లీలో ప్రతిపక్షాలకే ఎక్కువ సమయం ఇస్తున్నామని అన్నారు. ప్రజా ప్రతినిధులు ప్రజల సమస్యలపై అసెంబ్లీలోనే చర్చిస్తారని, కేటీఆర్‌కు చేతనైతే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. కేసీఆర్‌తో లేఖ రాయించుకుని, ఆయన వద్ద నుంచి ప్రతిపక్ష నేత హోదా తీసుకుని చర్చకు రావాలని కేటీఆర్‌కు సలహా ఇచ్చారు. అసెంబ్లీలో చర్చ అయితేనే అంతా రికార్డుల్లో ఉంటుందన్నారు.

**పిచ్చికుక్కలా ఒర్లుతున్న కేటీఆర్** సమస్యలపై చర్చకు అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలంటూ కేసీఆర్ లేఖ ఇస్తే సమావేశాలు జరిపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ఓడించినా కేటీఆర్, హరీశ్‌లకు సిగ్గు రాలేదని, పిచ్చికుక్కల్లా ఒర్లుతున్నారని వ్యాఖ్యానించారు. సిరిసిల్ల, సిద్దిపేటల్లో కాంగ్రెస్ హయాంలోనే ఎక్కువగా రైతు రుణమాఫీ జరిగిందన్నారు. ఇది తప్పని నిరూపిస్తే తన శాసనసభ్యత్వానికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. అద్దంకి దయాకర్ మాట్లాడుతూ, కేటీఆర్‌కు నిజంగా సమస్యలపై చర్చించే ధైర్యం ఉంటే డ్రామాలు ఆపేసి, తండ్రిని అసెంబ్లీకి తీసుకురావాలన్నారు. మదమెక్కిన కేటీఆర్ బజారున పడి, పిచ్చికుక్కలా వ్యవహరిస్తున్నాడని వ్యాఖ్యానించారు. రేవంత్ పేరు చెప్తే బీఆర్ఎస్ నేతలు వణికిపోతున్నారని చెప్పారు. సొంత చెల్లె ఫోన్ ట్యాప్ చేసిన నీచ చరిత్ర కేటీఆర్‌దన్నారు. తెలంగాణను దోచుకున్న తండ్రీకొడుకులు జైలుకు వెళ్లక తప్పదన్నారు.

# దేశంలో పెరుగుతున్న దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి బాధితుల సంఖ్య

- **హైబీపీ, మధుమేహ రోగులు, పొగాకు వాడేవారిలో అధికం**
- **46 ఏళ్లు దాటితే ముప్పు ఎక్కువ**
- **భారత్, ఉజ్బెకిస్థాన్, ఫిలిప్పీన్స్ దేశాల్లోని 25 నగరాల్లో**
- **5వేల మందికి 'నెఫ్రోప్లస్' నిర్వహించిన స్క్రీనింగ్‌లో వెల్లడి**
- **తెలంగాణలో పరీక్ష చేయించుకున్న వారిలో 9% బాధితులు**



హైదరాబాద్ : దేశంలో దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధుల(సీకేడీ)తో బాధపడేవారి సంఖ్య పెరుగుతోంది! మధుమేహం, అధిక రక్తపోటు బాధితులు, పొగాకు వాడేవారిలో ఈ సమస్య ఎక్కువగా కనపడుతోందని.. అలాగే, 46 ఏళ్లు దాటినవారిలో కూడా మూత్రపిండ వ్యాధుల ముప్పు పెరుగుతోందని.. ప్రముఖ డయాలసిస్ కేర్ నెట్‌వర్క్.. 'నెఫ్రోప్లస్' నిర్వహించిన తాజా అధ్యయనంలో వెల్లడైంది. ప్రారంభ దశల్లో లక్షణాలు పెద్దగా కనపడకపోవడంతో.. చాలా మంది తమకున్న సమస్య గురించి తెలుసుకోలేకపోతున్నారని, చివరి దశలో బయటపడడంతో ఆరోగ్య, ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నారని నెఫ్రో ప్లస్ సహ వ్యవస్థాపకుడు కమల్ డి షా, సీఈవో రోహిత్‌సింగ్, చీఫ్ ఆఫ్ స్టాఫ్ రిషభ్ ష్రాఫ్ ఆవేదన వెలిబుచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు తమ అధ్యయన వివరాలతో కూడిన శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. కిడ్నీ వ్యాధులకు సంబంధించి.. భారతదేశం, ఫిలిప్పీన్స్, ఉజ్బెకిస్తాన్‌లోని 25 నగరాల్లో ఈ ఏడాది మార్చి 6 నుంచి 11 దాకా విస్తృత స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఆ ఐదురోజుల్లో.. 10వేల మందికిపైగా వ్యక్తులకు కిడ్నీవ్యాధులపై అవగాహన కలిగించామని, 5000 మందికి పైగా వ్యక్తులకు కిడ్నీ పనితీరు ఎలా ఉందో తెలిపే సీరం క్రియాటినైన్ పరీక్షలు చేయించినట్లు వివరించారు.

**ఇతర రాష్ట్రాల్లో..** దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధులతో బాధపడుతున్నవారి సంఖ్యను రాష్ట్రాలవారీగా పరిశీలిస్తే.. స్క్రీనింగ్‌లో పాల్గొన్న వారిలో అత్యధికంగా 25 శాతంతో ఝార్ఖండ్ అగ్రస్థానంలో ఉంది. హరియాణా (17%), ఉత్తరాఖండ్ (17%), ఆంధ్రప్రదేశ్ (16%) బిహార్ (15%), ఢిల్లీ (15%), కర్ణాటక (15%), మహారాష్ట్ర (15%), ఉత్తరప్రదేశ్ (14%), గుజరాత్ (9%), రాజస్థాన్ (9%), తెలంగాణ (9%) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అలాగే అజంగఢ్ (28%), రాంచీ (25%) వంటి నగరాల్లో కిడ్నీవ్యాధులతో బాధపడుతున్నవారి సంఖ్య ఎక్కువగా ఉన్నట్టు అధ్యయనంలో వెల్లడైంది. పంచకుల (23%), విశాఖపట్నం (23%), జముహర్ (22%), హల్ద్వానీ (19%), లఖ్‌నవూ (19%), బెంగళూరు (16%), ఢిల్లీ (15%), మంగళూరు (14%), నాగ్‌పూర్ (14%), హిసార్ (11%), డెహ్రాడూన్ (10%), గోరఖ్‌పూర్ (10%), రాజమండ్రి (10), జైపూర్ (9%), పట్నా (9%), మోతిహారి (9%), వడోదర (6%) తదుపరి స్థానాల్లో ఉన్నాయి.

**మరికొన్ని లెక్కలు..** ఈ అధ్యయనంలో

పాల్గొన్నవారిలో 27 శాతం మంది క్రమం తప్పకుండా నొప్పి నివారణ మందుల వినియోగిస్తున్నారని, 23% మందికి అధిక రక్తపోటు ఉందని, 22 శాతం మందికి మధుమేహం ఉందని, 21 శాతం మంది పొగాకు వినియోగదారులని నెఫ్రోప్లస్ నివేదిక వెల్లడించింది. పరీక్షించిన వారిలో 60 శాతం మంది పురుషులు అయినప్పటికీ, మహిళల్లో ఈ సమస్య తీవ్రత ఎక్కువగానే ఉన్నట్టు తెలిపింది.

మొదట్లో లక్షణాలు అంతగా కనిపించవని.. కాబట్టి తరచుగా పరీక్షలు చేయించుకుంటే, సమస్యను ముందే గుర్తించవచ్చని నెఫ్రోప్లస్ సహవ్యవస్థాపకుడు కమల్ షా సూచించారు. అలా గుర్తించడానికి ప్రభుత్వాలు రూ.60 కోట్లు వెచ్చిస్తే.. మూడేళ్లకాలంలో ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలపై డయాలసిస్ ఖర్చుల భారాన్ని రూ.1100 కోట్ల మేర తగ్గించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

**తెలుగు రాష్ట్రాల్లో ఇలా..** ఆంధ్రప్రదేశ్‌లో ఈ అధ్యయనంలో పాల్గొన్నవారిలో 16 శాతం, తెలంగాణలో 9 శాతం మంది దీర్ఘకాలిక కిడ్నీ సమస్యతో బాధపడుతున్నట్టు వెల్లడైంది. తెలంగాణలో దాదాపు 200 మందికి పరీక్షలు చేయగా.. హైదరాబాద్‌లో 9 శాతం, మహబూబ్‌నగర్‌లో 9 శాతం మంది బాధితులున్నట్లు తమ సర్వేలో గుర్తించినట్లు నెఫ్రోప్లస్ యాజమాన్యం తెలిపింది. ఇక ఆంధ్రప్రదేశ్‌లో 200 నుంచి 300 మందికి పరీక్షలు నిర్వహించగా.. విశాఖపట్నంలో ఏకంగా 23 శాతం, రాజమండ్రి 10 శాతం మంది సీకేడీ బాధితులున్నట్లు తేలింది.

# కృష్ణా జలాల్లో అన్యాయం.. కాళేశ్వరం లోపాలపై సర్కారు ఫోకస్

## సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలకు మంత్రి ఉత్తమ్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్



హైదరాబాద్, : నీళ్లు నియామకాలు నిధులు.. సొంత రాష్ట్ర సాధన కోసం తెలంగాణ ప్రధాన నినాదం. కానీ తెలంగాణ ఆవిర్భావం తర్వాత తొమ్మిదిన్నరేళ్లలో కృష్ణా జలాల్లో రాష్ట్ర వాటాకు బీఆర్ఎస్ ప్రభుత్వం తిలోదకాలు.. ఏపీ చేపట్టిన అక్రమ ప్రాజెక్టులకు సమర్థన.. ఉమ్మడి రాష్ట్రంలోని చేవెళ్ల–ప్రాణహిత ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించకుండా రీ ఇంజనీరింగ్ పేరిట కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో లోపాలు.. వాటి నిర్మాణంతో ప్రజలపై పడిన భారాన్ని తెలంగాణ సమాజానికి రాష్ట్ర ప్రభుత్వం వివరించనున్నది. ఈ విషయమై మహాత్మాజ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో నీటి పారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరుకావాలని సీఎం రేవంత్‌రెడ్డితోపాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులకు మంత్రి ఉత్తమ్ ఆహ్వానాలు పంపారు. ఉమ్మడి ఏపీలో శ్రీశైలంలోని పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా తరలించిన కృష్ణా జలాలు, గత తొమ్మిదిన్నరేళ్లలో తరలించిన జలాలు, రాయలసీమ ఎత్తిపోతల పథకం టెం డర్లను పిలవడానికి గత ప్రభుత్వ పరోక్ష సహకారాన్ని మంత్రి ఉత్తమ్ వివరిస్తారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత కృష్ణా జలాల్లో 50 శాతానికి పైగా వాటా కోరడానికి బదులు.. ఉమ్మడి ఏపీకి బచావత్ ట్రైబ్యునల్ కేటాయించిన 811 టీఎంసీల్లో తెలంగాణకు 299 టీఎంసీలు చాలని కేంద్రం ముందు ఒప్పుకుని మిగతా 512 టీఎంసీలు ఏపీకి తరలించేందుకు గత బీఆర్ఎస్ సర్కారు సంతకాలు చేసిన ఒప్పందం 2022 వరకూ కొనసాగిందని వెల్లడిస్తారు. డిజైన్ లోపాలు, సరైన పరీక్షలు చేయకుండానే బ్యారేజీలు కట్టడంతో 2023 అక్టోబరులో మేడిగడ్డ కుంగితే, అదే ఏడాది అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో సీపేజీలు బయటపడ్డాయని ఉత్తమ్ వివరించనున్నారు.

# పారిపోవడం రేవంత్‌కు అలవాటే..

- రచ్చ తప్ప చర్చ చేయడం రాదు
- నువ్వు రాకపోతే.. డిప్యూటీ సీఎంను లేదా వ్యవసాయ మంత్రిని పంపు
- సమయం, స్థలం చెప్పు.. ఈసారి రాకుంటే కేసీఆర్‌కు క్షమాపణ చెప్పాలి
- కేటీఆర్ ధ్వజం.. పార్టీ నేతలతో ప్రెస్‌క్లబ్ వద్దకు.. సీఎం కోసం కుర్చీ!
- మళ్లీ ఎప్పుడో నువ్వే చెప్పు: కేటీఆర్




హైదరాబాద్, : తెలంగాణ రైతులు, నిరుద్యోగులకు ఎవరి ప్రభుత్వం ఏం చేసిందో చర్చకు రావాలన్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఆ సవాల్‌ను తాను స్వీకరించగానే ఢిల్లీకి పారిపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. యూరియా బస్తాల కోసం సీఎం ఢిల్లీకి వెళ్లారంటూ కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని, కానీ.. ఆయన వెళ్లేది పైసల మూటలు పంచడానికని ఆరోపించారు. తొడలు కొట్టడం, రంకెలు వేయడం, సవాళ్లు విసిరి పారిపోవడం రేవంత్‌కు అలవాటేనని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ విసిరి.. ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేశారని తెలిపారు. జీహెచ్ఎంసీలో బీఆర్ఎస్ సొంతంగా గెలిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పి మాట తప్పారని గుర్తుచేశారు. మంగళవారం పార్టీ నేతలతో కలిసి సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌కు చేరుకున్న కేటీఆర్.. 'సీఎం రేవంత్‌రెడ్డి కోసం' అంటూ వేసిన కుర్చీ పక్కనే మరో కుర్చీలో కూర్చున్నారు. ముఖ్యమంత్రి రాక కోసం కొద్దిసేపు వేచిచూసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. "నువ్వు విసిరిన సవాల్‌ను స్వీకరించా. నీతో చర్చకు కేసీఆర్ రావడమెందుకు? నేనే వస్తానని చెప్పా. మాట ప్రకారం నేనొచ్చా.. నువ్వెక్కడ?" అంటూ సీఎం రేవంత్‌ని ఉద్దేశించి కేటీఆర్ ప్రశ్నించారు. ముఖ్యమంత్రికి బేసిక్ నాలెడ్జ్ లేదని తెలిసినా ముచ్చట పడుతున్నారని ఆయన సవాల్‌ను స్వీకరించానని, ప్రెస్‌క్లబ్‌కు వస్తే మీడియా సాక్షిగా, ప్రజల సాక్షిగా చర్చిద్దామని ఆహ్వానిస్తే చివరికి ఢిల్లీకి పరారయ్యారని ఎద్దేవా చేశారు.

**మరోసారి వచ్చేందుకు సిద్ధం..** తనతో చర్చకు సీఎం రాకున్నా.. కనీసం డిప్యూటీ సీఎంనో, వ్యవసాయశాఖ మంత్రినైనా పంపాలని కేటీఆర్ అన్నారు. ఇప్పటికైనా మించిపోయింది లేదని, ఢిల్లీ నుంచి తిరిగొచ్చాక.. ఎక్కడ, ఎప్పుడు చర్చకు రావాలో రేవంత్‌రెడ్డి చెబితే వచ్చేందుకు తాను సిద్ధమని ప్రకటించారు. ఈసారి కూడా చర్చకు సీఎం రాకపోతే.. తమ పార్టీ అధినేత కేసీఆర్‌కు క్షమాపణ చెప్పాలన్నారు. "కేసీఆర్‌పై మరోసారి తప్పుడు కూతలు కూయనని, పనికిమాలిన సవాళ్లు చేయనని రేవంత్ ముక్కు నేలకు రాయాలి" అని కేటీఆర్ అన్నారు. రేవంత్‌రెడ్డికి రచ్చ చేయడమే తప్ప.. చర్చ చేయడం

రాదన్నారు. బూతులు తప్ప రైతుల గురించి బేసిక్ నాలెడ్జ్‌లేని అసమర్థ సీఎం అని, ఆయన పాలనతో 18 నెలలుగా రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గోదావరి నీళ్లను అక్రమంగా ఏపీకి తరలించేందుకు కడుతున్న బనకచర్లకు సీఎం రేవంత్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని కేటీఆర్ ఆరోపించారు. దీంతోపాటు పోతిరెడ్డిపాడు నుంచి కృష్ణా నీళ్లను దొంగచాటుగా తీసుకెళ్తుంటే కళ్లు మూసుకొని చంద్రబాబుకు కోవర్టుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. నీళ్లను ఆంధ్రకు, నిధులను ఢిల్లీకి పంపుతున్నారని, నియామకాలు తన తొత్తులకు ఇచ్చుకొని మురిసిపోతున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అగ్రనాయకత్వంతోపాటు కేంద్రంలోని బీజేపీ పెద్దలకూ పైసల మూటలు మోసి రేవంత్ తన పదవిని కాపాడుకుంటున్నారని ఆరోపించారు.

**కొడంగల్‌లో 670 మందికి భరోసా రాలేదు** : కాంగ్రెస్ చెబుతున్న రైతుభరోసా అంతా డొల్ల అని, సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోనే 670 మంది రైతులకు రైతుభరోసా రాలేదని కేటీఆర్ తెలిపారు. వారి వివరాలు తీసుకొచ్చానన్నారు. దీంతోపాటు రుణమాఫీ కాని లక్షల మంది రైతుల అధికారిక జాబితా తమ వద్ద ఉందన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఆత్మహత్య చేసుకున్న రైతుల వివరాలు, వడ్లను ప్రభుత్వం కొనక, బోనస్ రాక.. మిల్లర్లకు అమ్ముకొని నష్టపోయిన రైతుల జాబితా కూడా ఉందని తెలిపారు. కాంగ్రెస్ అరాచక పాలనతో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, యూరియా, ఎరువుల బస్తా కోసం క్యూలో చెప్పులు పెట్టి ఫర్టిలైజర్ దుకాణాల ముందు ఎదురు చూస్తున్నారని చెప్పారు. మళ్లీ ఆనాటి రోజులు తీసుకొస్తామని చెప్పిన కాంగ్రెస్.. నిజంగానే ఆ పాత దుర్దినాలను తీసుకొచ్చిందని విమర్శించారు. 50 ఏళ్ల క్రితం ఇందిరాగాంధీ విధించిన ఎమర్జన్సీని తలదన్నేలా ప్రస్తుత కాంగ్రెస్ పాలన సాగుతోందన్నారు. సోషల్ మీడియాలో పిల్లలు పోస్టులు పెడితేనే గజగజ వణికిపోతున్న రేవంత్‌రెడ్డి స్థాయికి.. కేసీఆర్ వచ్చి మాట్లాడాల్సిన అవసరం లేదని, ఆయనకు సమాధానం చెప్పే సత్తా బీఆర్ఎస్‌లోని ప్రతి ఒక్క నాయకుడికీ ఉందని అన్నారు. “దళితులు, గిరిజనులు, పేదల పొట్టకొడుతున్న ఈ ఇందిరమ్మ రాజ్యానికి ఘోరీ కట్టడంతోపాటు రేవంత్‌కు కర్రు కాల్చి వాత పెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు” అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# సికింద్రాబాద్ కంటోన్మెంట్ అభివృద్ధికి రూ.303 కోట్లు

## రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ అంగీకారం: కిషన్ రెడ్డి



న్యూఢిల్లీ, : సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో అభివృద్ధి పనుల కోసం రూ.303 కోట్లు వెచ్చించేందుకు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అంగీకారం తెలిపారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. కంటోన్మెంట్ పరిధిలో నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్లు, అభివృద్ధి పనుల కోసం ఎస్క్రో అకౌంట్ (ఏ పనులకైతే నిధులను జమ చేస్తారో ఆ పనులకు మాత్రమే ఆ నిధులను ఉపయోగించుకునేలా)ను ఏర్పాటు చేయాలని రక్షణ శాఖ మంత్రికి తాను రెండుసార్లు లేఖలు రాశానని వెల్లడించారు. ఈ అకౌంట్‌కు రూ.303.62 కోట్ల భూబదిలీ పరిహారాన్ని జమ చేయాలని కోరానని తెలిపారు. దీంతో రక్షణ శాఖ మంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేశారని వెల్లడించారు. రక్షణ శాఖ భూములకు గాను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన భూబదిలీ పరిహారాన్ని ఎస్క్రో అకౌంట్‌లో జమ చేసిన వెంటనే కంటోన్మెంట్ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టాలని రక్షణ శాఖ ఆదేశాల్లో పేర్కొందని కిషన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# ఏడాదిలోనే రైతులకు 70 వేల కోట్లు

- అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ బురదజల్లే ప్రయత్నం: భట్టి
- మంచి కారక్రమాలు చేస్తుంటే కడుపు మంటా?: పొంగులేటి
- కాంగ్రెస్ ప్రభుత్వం 15 ఏళ్లుంటే రాష్ట్రం సుభిక్షం: కోమటిరెడ్డి
- తెలంగాణలా కావాలంటున్న ఇతర రాష్ట్రాల ప్రజలు: తుమ్మల
- మహబూబాబాద్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన




మహబూబాబాద్/కేసముద్రం, : గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో రైతులను పూర్తిగా విస్మరించిందని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చాక అన్నదాతల కోసం ఒక్క ఏడాదిలోనే రూ.70 వేల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. మూడు నెలల కాలంలోనే రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత తమ సర్కారుదని చెప్పారు. తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా అందించామన్నారు. రూ.12,500 కోట్లు ఖర్చుచేసి 51 లక్షల మందికి ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తూ సహాయక సంఘాల సభ్యులకు రూ.50 వేల కోట్ల రుణాలు అందించామన్నారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లాలో పర్యటించిన డిప్యూటీ సీఎం.. ఆ నియోజకవర్గంలోని సోమ్లాతండా, కేసముద్రంలలో రూ.400 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించే అభివృద్ధి పనులకు పలువురు మంత్రులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో జరిగిన బహిరంగ సభల్లో మాట్లాడారు.

తెలంగాణ ఏర్పడ్డాక పదేళ్ల బీఆర్ఎస్ పాలన, ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో జరిగిన అభివృద్ధిపై, కృష్ణా, గోదావరి జలాలపై అసెంబ్లీలో చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

**పేదల పక్షపాతి మా ప్రభుత్వం: పొంగులేటి** రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం పేదల పక్షాన పనిచేస్తూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూనే.. హామీ ఇవ్వని పథకాలను సైతం ప్రవేశపెడుతోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తే వాటికి వడ్డీలు కడుతూనే కొత్త సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ నేతలు రంకెలు వేస్తూ సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ పరిపాలన ఉండడంతో తట్టుకోలేక వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని ధ్వజమెత్తారు. పేదలకు మంచి కార్యక్రమాలు చేస్తుంటే కడుపు మంట ఎందుకని ప్రశ్నించారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు అని ఊరించి ఎవరికీ ఇవ్వలేదని, తాము 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని తెలిపారు.

**రైతుల కళ్లలో సంతోషమే లక్ష్యం: కోమటిరెడ్డి** : రైతుల కళ్లలో సంతోషం చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. వారి కోసం ప్రత్యేకంగా నిధులు వెచ్చిస్తూ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తన శాఖ నుంచి కేసముద్రంలో రూ.175 కోట్ల అభివృద్ధి పనులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. పరిశ్రమలు రావాలంటే రోడ్లు రావాలని, మండలంలో వివిధ మార్గాలకు రాబోయే కాలంలో ప్రతీ రోడ్డును బీటీ రోడ్డుగా మారుస్తామని తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే వచ్చే 15 ఏళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉండాలని ఆయన అన్నారు.

# రైతుల కష్టాలు తీరాయి


## పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
## ఎంజీకేఎల్ఐ ప్రాజెక్టు నుంచి సాగు నీరు విడుదల



కొల్లాపూర్, : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే రైతుల కష్టాలు తీరుతున్నాయని పర్యాటక, ఎక్సైజ్, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూప ల్లి కృష్ణారావు అన్నారు. పంటలకు సకాలం లో సాగునీరు అందిస్తున్నామని తెలిపారు. రైతు భరోసా, రుణమాఫీ అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నా రు. నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మం డల పరిధిలోని ఎల్లూరు గ్రామంలో రేగు మాన్ గడ్డ వద్ద ఎంజీకేఎల్ఐ ప్రాజెక్టు పంప్‌హౌస్‌లో ఒకటవ మోటార్‌ను కంప్యూటర్ ద్వారా ఆన్ చేసి సాగు నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో మంత్రితో పాటు నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, వనపర్తి ఎమ్మెల్యేలు డాక్టర్ కూచకుళ్ల రాజేశ్ రెడ్డి, కశిరెడ్డి నారాయణరెడ్డి, మేఘారెడ్డి, ఇరిగేషన్ సీఈ విజయభాస్కర్‌రెడ్డి, ఎస్ఈ సత్యనారా యణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. రూ.8 లక్షల కోట్ల అప్పు చేసి కూడా ప్రాజెక్టులను పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. ప్రాజె క్టులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవా లని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు లకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని ఆరోపించారు. వారే ఇప్పుడు ప్రాజెక్టులపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు మోపుతున్నారని ఆగ్ర హం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వంలో రైతు లకు అన్ని విధాలా న్యాయం జరుగుతుం దని తెలిపారు. ప్రాజెక్టులను పూర్తి చేసి, చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందిస్తామని స్పష్టం చేశారు. అంతకుముం దు ఎంజీకే ఎల్ఐ ద్వారా విడుదలైన వరద నీటికి మంత్రితో పాటు ఎమ్మెల్యేలు పూలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఈఈలు శ్రీనివాస్ రెడ్డి, మాణిక్ ప్రభు, చంద్రశేఖర్, మురళి, డీఈ లోకిలాల్, ఏఈ సంతోష్ తది తరులు పాల్గొన్నారు.

# అనధికారిక నిర్మాణాలన్నీ కూల్చాల్సిందే !

- ‘నెట్ నెట్’ భవనంపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాలు సబబే
- అనధికారిక కట్టడాలను తొలగించే దాకా నిర్మాణ పనులు చేయొద్దు
- జీహెచ్ఎంసీ ఉత్తర్వుల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవాలి
- సిటీ స్మాల్ కాజెస్ కోర్టు తీర్పు
- ఇచ్చుకుంటూ పోతే భవిష్యత్తులో ప్రభుత్వ భూమన్నదే ఉండదు: హైకోర్టు



హైదరాబాద్, : హైదరా బాద్‌లోని నందగిరి హిల్స్‌లో నెట్ నెట్ వెంచర్స్ సంస్థ నిర్మిస్తున్న ఆకాశ హర్మ్యంలో తీవ్ర ఉల్లంఘనలు జరిగాయని, అనధికారిక కట్టడాలను కూల్చివేయాలంటూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఇచ్చిన ఆదేశాలను సిటీ స్మాల్ కాజెస్ కోర్టు సమర్థించింది. జీహెచ్ఎంసీ ఇచ్చిన ప్రణాళికకు భిన్నంగా భవన నిర్మాణం చేపట్టారంది. అనధికారిక నిర్మాణా లన్నింటినీ సరిచేయాల్సిందేనని కోర్టు స్పష్టం చేసింది. పర్యావరణ సమతుల్యతకు భంగం వాటిల్లేలా నిర్మాణాలు చేపట్టడంతోపాటు అనుమతించిన ప్లాన్ ప్రకారం కాకుండా ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టారంటూ ఈ ఏడాది జనవరి 24న జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు. ఇదే విషయంపై జనవరి 25న ‘నెట్ నెట్ భవనాన్ని కూల్చాల్సిందే’ అనే శీర్షికతో ‘ఆంధ్రజ్యోతి’లో కథనం ప్రచురితమైంది. అయితే, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాలను సవాలు చేస్తూ నెట్ నెట్ సంస్థ సిటీ స్మాల్ కాజెస్ కోర్టును ఆశ్రయించింది. కమిషనర్ ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలని, నిర్మాణ పనుల్లో జోక్యం చేసుకోకుండా చూడాలని కోరింది. నెట్ నెట్ వెంచర్స్ ఉల్లంఘనలపై జీహెచ్ఎంసీ తన వాదనలను వినిపించింది. ఇచ్చిన ప్రణాళిక ప్రకారం నిర్మాణం చేపట్టలేదని, సెట్ బ్యాక్ నిబంధనలు ఉల్లంఘించారని, ర్యాంపు, డ్రైవ్ వేలను సెట్ బ్యాక్ నిర్మించాల్సిన ప్రాంతంలో కట్టారని కోర్టుకు తెలిపింది. రాత్రివేళ అనధికారిక నిర్మాణాలు చేపట్టారని, భవన అంతస్తుల ఎత్తు అనుమతించినదాని కంటే ఎక్కువగా ఉందని వివరించింది. తాము ప్రణాళిక ప్రకారమే నిర్మాణం చేశామని నెట్ నెట్ వెంచర్ కోర్టుకు వివరించింది. అనధికారిక నిర్మాణాలు తొలగించామని, ఇంకా ఉల్లంఘన ఉంటే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇచ్చే సమయంలో సరిచేసుకోవచ్చని వాదించింది. అనధికారిక నిర్మాణాలు తొలగించినట్లు ఆధారాలు చూపాలని కోర్టు ఆదేశించగా.. సమాచారం ఇవ్వలేదు. జీహెచ్ఎంసీ ఇచ్చిన ఆదేశాలను, విజిలెన్స్ నివేదికను, భవన చిత్రాలను పరిశీలించిన కోర్టు.. అనధికారిక నిర్మాణాలు, నిబంధనల ఉల్లంఘనలు స్పష్టంగా కనిపిస్తున్నాయని పేర్కొంది. జీహెచ్ఎంసీ ఆదేశాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవాలని తీర్పు ఇచ్చింది. అనధికారిక నిర్మాణాలను కూల్చివేసే వరకు తదుపరి నిర్మాణ పనులు చేపట్టవద్దని ఆదేశించింది.

**ఇదీ నేపథ్యం..** నందగిరి హిల్స్‌లో హెచ్ఎండీఏ నుంచి హుడా వేలంలో అమరేందర్‌రెడ్డికి చెందిన నెట్ నెట్ వెంచర్స్ సంస్థ 4.748ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. ఈ స్థలంలో 12 అంతస్తుల(జీ+4, 7 సెల్లార్లు) భవన నిర్మాణం చేపట్టేందుకు 2013లో జీహెచ్ఎంసీ అనుమతి పొందింది. 2015లో జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 45లో జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీలో 865.42 గజాల భూమిని కొనుగోలు చేసింది. జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీకి సంబంధించి కొంత వెసులుబాటు కల్పిస్తూ ప్రభుత్వం 2017లో జీవో 305 ఇచ్చింది. దాని ప్రకారం రోడ్డుకు ఇరువైపులా ఉన్న స్థలాల్లో 30 మీటర్ల వరకు నిర్మాణాలు చేసుకోవచ్చు. కానీ, దాని వెనకే ఉన్న హుడా లేఔట్‌కు ఈ నిబంధనలు వర్తించవు. హౌసింగ్ సొసైటీకి ఇచ్చిన వెసులుబాటును అడ్డుపెట్టుకున్న నెట్ నెట్ వెంచర్స్ 30 మీటర్ల నిర్మాణానికి జీహెచ్ఎంసీ నుంచి అనుమతులు సాధించింది. అక్కడితో ఆగక జీ+4 నుంచి జీ+5, తర్వాత జీ+12, చివరకు జీ+13 వరకు అనుమతులు పొందింది. 2,09,620 చదరపు అడుగుల్లో నిర్మాణం చేసుకునేలా అనుమతి పొందింది. నందగిరి హౌసింగ్ సొసైటీ సభ్యులు ఈ నిర్మాణంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

# లక్షల కోట్లతో కూలిపోయే కాళేశ్వరం కట్టారు

- **మరమ్మతుల పేరిటా రూ.కోట్ల దోపిడీ**
- **బీఆర్ఎస్ పాలనలో పల్లెలకు రోడ్లు వేయలేదు**
- **ఫాంహౌస్ చుట్టూ రూ.750కోట్లతో రోడ్లు**
- **పదేళ్లు దోచుకున్నారు: మంత్రి కోమటిరెడ్డి**



బిచ్కుంద, : కేసీఆర్ హయాంలో రూ.లక్షల కోట్ల అప్పులు చేసి.. కూలిపోయే కాళేశ్వరం కట్టారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. ప్రాజెక్టు కుంగిపోయి కూలిపోతున్నా.. మరమ్మతుల పేరిట రూ.కోట్లు దోచుకున్నారని ధ్వజమెత్తారు. కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి కోమటిరెడ్డి ప్రారంభించారు.

అనంతరం బిచ్కుందలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. కాళేశ్వరం అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ చేపడుతుంటే.. బీఆర్ఎస్ తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. పదేళ్లుగా కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుని అప్పుల పాలు చేసిందన్నారు. కేసీఆర్ చేసిన అప్పులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ నెలకు రూ.6వేల కోట్ల వడ్డీ చెల్లిస్తుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో పల్లెలకు రోడ్లు వేయలేదు కానీ.. కేసీఆర్ తన ఫాంహౌస్ చుట్టూ రూ.750 కోట్లతో నాలుగు లేన్ల రోడ్డు వేసుకుని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు.

పదేళ్లలో యువతకు ఉద్యోగాల గురించి పట్టించుకోలేదు కానీ.. కేసీఆర్ కుటుంబంలో మాత్రం అందరికీ ఉద్యోగాలు దక్కాయని మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబానికి తప్ప... ఏ పేద కుటుంబానికీ మేలు జరగలేదని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ నేతలు చెప్పే అబద్ధాలను నమ్మవద్దని ప్రజలను కోరారు. ఏడాదిన్నరలోనే పేదలకు 5లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో రూ.200కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మిస్తున్నామని, ఏడాదిన్నరలోనే 60వేల ఉద్యోగాలను భర్తీ చేశామని గుర్తు చేశారు. బిచ్కుంద నుంచి శాంతాపూర్ జాతీయ రహదారి వరకు రెండు లేన్ల ప్రధాన రహదారికి రూ.20కోట్లు మంజూరు చేస్తున్నామన్నారు. మంత్రి ఉత్తమ్‌తో మాట్లాడి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న లెండి, నాగమడుగు ప్రాజెక్టులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

# ఉపాధికి లక్ష కోట్ల ఊతం

- రెండేళ్లలో 3.5 కోట్ల ఉద్యోగాలే లక్ష్యం
- ఈఎల్ఐ పథకానికి కేంద్ర క్యాబినెట్ పచ్చజెండా
- మొదటిసారి ఉద్యోగంలో చేరేవారికి గరిష్ఠంగా
- రూ.15 వేల దాకా ప్రోత్సాహకం అందజేత
- నూతన జాతీయ క్రీడా విధానం 'ఖేలో భారత్ నీతి'.. టార్గెట్ 2047



న్యూఢిల్లీ, : వచ్చే రెండేళ్లలో 3.5 కోట్ల ఉద్యోగాల కల్పనకు ఉపకరించే ఉపాధి ఆధారిత ప్రోత్సాహకాల పథకానికి (ఈఎల్ఐ).. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతోపాటు.. 'ఖేలో భారత్ నీతి' పేరిట రూపొందించిన జాతీయ క్రీడా విధానానికి, వ్యూహాత్మక, నూతన రంగాల్లో పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణలను ప్రోత్సహించే 'రిసెర్చ్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్'(ఆర్డీఐ) పథకానికి పచ్చజెండా ఊపింది. వీటిలో ఈఎల్ఐ పథకానికి కేంద్రం రూ.99,446 కోట్లు కేటాయించింది. వచ్చే రెండేళ్లలో ఈ పథకం ద్వారా లబ్ధి పొందేవారిలో 1.92 కోట్ల మంది మొదటిసారి ఉద్యోగం చేసేవారే ఉంటారని అంచనా. అన్ని రంగాల్లో ఉద్యోగాల సృష్టి, యువతలో నైపుణ్యాల కల్పన, సామాజిక భద్రతను పెంపొందించడమే లక్ష్యంగా కేంద్రం ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా తయారీ రంగంపై ప్రత్యేకంగా దృష్టి సారించనుంది. కాగా, ఈ పథకం కింద.. మొదటిసారి ఉద్యోగం చేసేవారు (ఈపీఎఫలో నమోదైనవారు) రూ.15 వేల గరిష్ఠ పరిమితితో ఒక నెల ఈపీఎఫ్ వేతనాన్ని రెండు విడతలుగా (ఉద్యోగంలో చేరిన ఆర్నెల్లకు తొలి విడత, 12నెలల సర్వీస్, ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని పూర్తి చేసుకున్న తర్వాత రెండో విడత మొత్తాన్ని) పొందుతారు.

ఆధార్‌తో అనుసంధానమైన చెల్లింపుల విధానం ద్వారా వారికి ఈ మొత్తాన్ని అందజేస్తారు. రూ.లక్ష దాకా జీతం అందుకునే ఉద్యోగులు ఈ ప్రోత్సహకాన్ని అందుకోవడానికి అర్హులు. ఉద్యోగుల్లో పొదుపు చేసే అలవాటును ప్రోత్సహించేందుకుగాను.. ఈ ప్రోత్సాహకాల్లో కొంత భాగాన్ని నిర్ణీత కాలావధికి డిపాజిట్ చేస్తారు. ఆ కాలపరిమితి పూర్తయ్యాక ఉద్యోగి ఆ మొత్తాన్ని ఉపసంహరించుకోవచ్చు. ఇక, యాజమాన్యాలకు విషయానికి వస్తే.. ఈ ప్రోత్సాహకాలను అందుకోవడానికి.. 50 మందిలోపు ఉద్యోగులు ఉండి, ఈపీఎఫవోలో నమోదు చేసుకున్న సంస్థలు ఏడాదికి అదనంగా ఇద్దరు ఉద్యోగులను.. 50 మంది కన్నా ఎక్కువ ఉద్యోగులు ఉండే కంపెనీలు ఏడాదికి అదనంగా ఐదుగురు ఉద్యోగులను నియమించుకోవాల్సి ఉంటుంది. 2025 ఆగస్టు 1 నుంచి 2027 జూలై 31 నడుమ అలా అదనపు ఉద్యోగాలు కల్పించే

యాజమాన్యాలకు (రెండేళ్లపాటు) ఈ ప్రోత్సాహకాలు అందుతాయి. కనీసం ఆరు నెలలపాటు ఉద్యోగులను కొనసాగించే యాజమాన్యాలకు.. ప్రతి అదనపు ఉద్యోగికీ ఇచ్చే జీతం ఆధారంగా నెలకు గరిష్ఠంగా రూ.3 వేల చొప్పున రెండేళ్లపాటు ఇస్తారు. ఉద్యోగి వేతనం రూ.10వేల లోపుంటే నెలకు రూ.1000 చొప్పున, జీతం రూ.10వేల నుంచి 20 వేల లోపు ఉంటే నెలకు రూ.2000 చొప్పున, ఉద్యోగి జీతం రూ.20 వేల నుంచి రూ.లక్షలోపు ఉంటే నెలకు రూ.3000 చొప్పున ఈ ప్రోత్సాహకం ఇస్తారు. తయారీరంగంలో అయితే ఈ ప్రోత్సాహకాలను నాలుగేళ్లపాటు ఇస్తారు. ఇక.. నూతన రంగాల్లో పరిశోధనలు, నవకల్పనలకు ఊతమిచ్చేందుకుగాను రూపొందించిన 'రిసెర్చ్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ (ఆర్డీఐ)' పథకాన్ని రూ.లక్ష కోట్ల కార్పస్ ఫండ్‌తో అమలు చేయనున్నారు. పరిశోధనలు, ఆవిష్కరణల్లో ప్రైవేటు రంగం పెట్టుబడులను ప్రోత్సహించడానికి తక్కువ/సున్నా వడ్డీ రేట్లతో దీర్ఘకాల వ్యవధిలో ఫైనాన్సింగ్ అందించడమే ఈ పథకం లక్ష్యం.

**వాణిజ్య ఎల్పీజీ ధర రూ.58.5 తగ్గింపు** : వాణిజ్య అవసరాలకు ఉపయోగించే 19 కేజీల గ్యాస్ బండ ధరను తగ్గిస్తూ ఆయిల్ కంపెనీలు నిర్ణయించాయి. తగ్గింపు ధరలు జూలై 1 నుంచే అమలులోకి వచ్చినట్లు ప్రకటించాయి. ఒక్కో సిలెండరుపై రూ.58.50 తగ్గింది.

వాణిజ్య సిలెండర్... 19 కేజీల బండ ధరను రూ.1,665గా కంపెనీలు నిర్ణయించాయి. తాజాగా వాణిజ్య సిలెండర్ ధర విజయవాడలో రూ.1,818.5 కాగా... హైదరాబాద్‌లో రూ.1,886.5గా ఉంది. కాగా, ఢిల్లీలో జీవిత కాలం ముగిసిన పెట్రోలు, డీజిల్ వాహనాలకు 'ఇంధనం లేదు' అంటూ పెట్రోలు బంకుల్లో బోర్డులను ఏర్పాటు చేశారు.

# వాయుసేన రన్‌వేనే అమ్మేశారు !

## పంజాబ్‌లోని హల్వారా ఎయిర్‌ఫోర్స్‌లోని 15 ఎకరాలను విక్రయించిన తల్లి, కుమారుడు



న్యూఢిల్లీ, : ఓ సినిమాలో రవీంద్ర భారతి, చార్మినార్ తనదేనని చెబుతూ అమ్మకానికి పెట్టి అమాయకుల నుంచి అందినకాడికి వసూలు చేసుకుంటాడో మోసగాడు! పంజాబ్‌లో అచ్చంగా ఇలాంటి ఘటనే వెలుగుచూసింది. ఓ మహిళ, ఆమె కుమారుడు కలిసి వాయుసేనకు చెందిన ఓ రన్‌వే స్థలాన్ని తెగనమ్మేశారు! కొందరు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ఆ తల్లీకొడుకులు ఈ అక్రమానికి పాల్పడటం పంజాబ్‌లో తీవ్ర సంచలనమైంది.

నిందితులు పంజాబ్‌లోని డుమినివాలా గ్రామానికి చెందిన ఉషా అన్సాల్, ఆమె కుమారుడు నవీన్ చంద్! పాక్ సరిహద్దులోని ఫట్టువాలా గ్రామ శివారులో గల రక్షణ శాఖ పరిధిలోని 982 ఎకరాల్లో విస్తరించి ఉన్న 'హల్వారా ఎయిర్‌ఫోర్స్ స్టేషన్'లోని రన్‌వే స్థలం ఇది! మన మిలటరీకి అత్యంత వ్యూహాత్మక ప్రాంతంగా దీన్ని చెబుతారు. 1939–45 మధ్య రెండో ప్రపంచ యుద్ధంలో ఈ రన్‌వేను బ్రిటిషర్లు ఉపయోగించుకున్నారు.

పైగా పొరుగు దేశాలతో 1962, 1965, 1971 జరిగిన యుద్ధాల్లో ఈ రన్‌వేను భారత వాయుసేన అత్యవసర ల్యాండింగ్ కోసం, రక్షణ పరమైన కార్యకలాపాల కోసం ఉపయోగించుకుంది. 1997లో ఉష, నవీన్ కలిసి తప్పుడు పత్రాలు సృష్టించి 15 ఎకరాల మేర విస్తరించి ఉన్న ఈ రన్‌వేను ప్రైవేటు వ్యక్తులకు విక్రయించారు. అప్పట్లోనే నిషాన్ సింగ్ అనే మాజీ రెవెన్యూ ఉద్యోగి ఫిర్యాదు చేయడంతో ఈ భూ కుంభకోణం వెలుగులోకొచ్చింది. అయితే 2021 వరకు అధికారులు ఎలాంటి చర్యా తీసుకోలేదు. ఈ భూకుంభకోణంపై మూడేళ్ల క్రితం హల్వారా ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ అధికారులు కూడా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. మళ్లీ నిషాన్ సింగే, ఈ భూకుంభకోణంపై పంజాబ్, హరియాణా కోర్టును ఆశ్రయించారు. స్పందించిన కోర్టు.. నాలుగు వారాల్లో సమగ్ర నివేదిక అందజేయాలంటూ పంజాబ్ విజిలెన్స్ బ్యూరో చీఫ్‌ను ఆదేశించింది. అయితే ఈ ఏడాది మే నెలలోనే ఎయిర్‌ఫోర్స్ భూమిని తిరిగి రక్షణ శాఖకు స్వాధీన పరిచారు.

# నిత్యావసర వస్తువులపై జీఎస్టీ తగ్గుదల?

- **12 నుంచి 5 శాతానికి తగ్గించే యోచనలో కేంద్రం**
- **పూర్తిగా ఎత్తేసే ప్రతిపాదన కూడా పరిశీలన**
- **రాబోయే జీఎస్టీ మండలి సమావేశంలో నిర్ణయం**
- **టూత్‌పేస్ట, నెయ్యి, సబ్బులు, పాదరక్షలు, దుస్తులు,**
- **వాషింగ్ మెషిన్లు తదితర వస్తువులు ఇక చౌక!**




న్యూఢిల్లీ, : మధ్యతరగతి ప్రజలకు శుభవార్త. ఈ ఏడాది ఆదాయ పన్ను రాయితీలతో ఊరట కల్పించిన కేంద్ర ప్రభుత్వం.. ఆయా వర్గాలకు మరింత ఉపశమనం కల్పించేందుకు సిద్ధమవుతోంది. మధ్యతరగతి, అల్పాదాయ కుటుంబాలకు వస్తు సేవల పన్ను (జీఎస్టీ)ని తగ్గించడం ద్వారా ఊరట కల్పించనుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం 12 శాతం జీఎస్టీ పరిధిలో ఉన్న నిత్యావసర వస్తువులపై పూర్తిగా పన్నును తొలగించడం లేదా చాలా వస్తువులను 5శాతం జీఎస్టీ పరిధిలోకి తీసుకొచ్చే అంశాన్ని పరిశీలిస్తోందని వెల్లడించాయి. టూత్‌పేస్ట, టూత్ పౌడర్, గొడుగులు, కుట్టు మిషన్లు, ప్రెషర్ కుక్కర్లు, వంట పాత్రలు, నెయ్యి, సబ్బులు, చిరుతిళ్లు, ఎలక్ట్రిక్ ఇస్త్రీ పెట్టెలు, గీజర్లు, తక్కువ సామర్థ్యం కలిగిన వాషింగ్ మెషీన్లు, సైకిళ్లు, రూ.1000 కంటే ఎక్కువ ధర కలిగిన రెడీమేడ్ దుస్తులు, రూ.500-1000 ధర కలిగిన పాదరక్షలు, తదితర వస్తువులపై జీఎస్టీని తగ్గించనున్నట్లు సమాచారం. ఈ తగ్గింపు అమల్లోకి వస్తే చాలా వస్తువులు చౌకగా దొరుకుతాయి. సామాన్యులు వాడే ఈ నిత్యావసర వస్తువులపై జీఎస్టీని తగ్గించడం వల్ల ప్రభుత్వంపై రూ.40-50వేల కోట్ల భారం పడనుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆ భారాన్ని మోసేందుకు సర్కారు సిద్ధమవుతోందనీ పేర్కొన్నాయి. ప్రజల వినియోగ సామర్థ్యాన్ని పెంచేందుకే జీఎస్టీ తగ్గింపు నిర్ణయం తీసుకుంటున్నట్లు వెల్లడించాయి. వస్తువుల ధరలు తగ్గితే విక్రయాలు పెరుగుతాయని, ఫలితంగా జీఎస్టీ వసూళ్లు కూడా పెరుగుతాయని కేంద్ర ప్రభుత్వం విశ్వసిస్తోంది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో జీఎస్టీ రేట్లలో మార్పులు చేస్తామన్న సంకేతాలు ఇచ్చారు. నిత్యావసర వస్తువులపై పన్నులను హేతుబద్ధీకరిస్తామని, మధ్యతరగతి ప్రజలకు ఊరట కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కాగా, జీఎస్టీ తగ్గింపుపై ఈ నెలలో జరగబోయే 56వ జీఎస్టీ కౌన్సిల్ భేటీలో నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నారు.

**12% జీఎస్టీ పరిధిలోని వస్తువులు ఇవే..** టూత్‌పౌడర్, హెయిర్ ఆయిల్, సబ్బులు (కొన్ని విభాగాలపై 18% ఉంది), నెయ్యి, టూత్‌పేస్ట (కొన్ని బ్రాండెడ్ రకాలపై 12%, ఇతర పేస్టలపై 18%), గొడుగులు, కుట్టు మిషన్లు, వాటర్ ఫిల్టర్లు, ప్యూరిఫయర్లు (నాన్ ఎలక్ట్రిక్), ప్రెషర్ కుక్కర్లు, అల్యూమినియం, స్టీల్‌తో చేసిన వంట పాత్రలు, ఎలక్ట్రిక్ ఇస్త్రీ పెట్టెలు, గీజర్లు, వ్యాక్యూమ్ క్లీనర్లు (తక్కువ సామర్థ్యం, వాణిజ్యేతర), వాషింగ్ మెషీన్లు (తక్కువ సామర్థ్యం), సైకిళ్లు, దివ్యాంగుల వాహనాలు, రెడీమేడ్ దుస్తులు (రూ.1000పైన ధర కలిగినవి), పాదరక్షలు (రూ.500-1000), టీకాలు, హెచ్ఐవీ, హెపటైటిస్, టీబీ డయాగ్నస్టిక్ కిట్లు, కొన్ని ఆయుర్వేద, యునానీ మందులు, డ్రాయింగ్, కలరింగ్ పుస్తకాలు, రెడీ మిక్స్ కాంక్రీట్, ప్రి-ఫ్యాబ్రికేటెడ్ భవనాలు, వ్యవసాయ పనిముట్లు, ప్యాకేజ్డ్ ఆహారం, సోలార్ వాటర్ హీటర్లు. కాగా, సిగరెట్లు, విలాసవంతమైన కార్లు, కార్బొనేటెడ్ డ్రింక్స్ తదితర వస్తువులపై జీఎస్టీని భారీగా పెంచనున్నట్లు తెలుస్తోంది.

# విద్యార్థి, హెల్త్‌కేర్ వీసాలకు బ్రేక్ !

- ఆంక్షలకు అమెరికా, బ్రిటన్ సన్నద్ధం ఎఫ్-1, జే-1, ఎం-1
- వీసాలకు నిర్దిష్ట కాలపరిమితి
- ట్రంప్ సర్కారు నిబంధనల కొరడా
- 22 నుంచి ఇంగ్లండ్‌లో విదేశీ ఆరోగ్య సిబ్బంది నియామకాల నిలిపివేత



వాషింగ్టన్/లండన్, : విదేశీ విద్యార్థులు, ఆరోగ్య సంరక్షణ సిబ్బంది తమ దేశాల్లోకి అధిక సంఖ్యలో రాకుండా అడ్డుకోవాలని అమెరికా, బ్రిటన్ భావిస్తున్నాయి. వారి సంఖ్యపై ఆంక్షలు విధించాలని నిర్ణయించాయి. అక్రమ వలసలపై కొరడా ఝళిపిస్తున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం.. తాజాగా ఎఫ్–1, జే–1 వీసాలపై వచ్చిన విదేశీ విద్యార్థులపై ఆంక్షలు విధించాలని, వారు అమెరికాలో నివసించే సమయాన్ని కుదించాలని భావిస్తోంది. దీనివల్ల ఆయా వీసాలపై అక్కడకు వెళ్లిన 3.3 లక్షల మంది భారతీయ విద్యార్థులు ఇబ్బందులు పాలయ్యే అవకాశముంది. ప్రస్తుతం ఈ వీసాలతో వెళ్లేవారిపై కఠినమైన ఆంక్షలు లేవు. తామొచ్చిన కార్యక్రమాలు పూర్తయ్యేవరకు వారు అమెరికాలో ఉండే అవకాశం ఉంది. అయితే ఎక్సేంజ్ విజిటర్లుగా వచ్చేవారు ఉండేందుకు కాలవ్యవధి నిర్ధారించాలని ట్రంప్ మొదటిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు 2020లోనే ప్రతిపాదించారు. ఇప్పుడు అమెరికా హోంల్యాండ్ భద్రత విభాగం తాజాగా ఈ ప్రతిపాదన తెచ్చింది. ట్రంప్ యంత్రాంగం ప్రజాభిప్రాయం కోరకుండానే దీన్ని అమలు చేసే అవకాశం ఉంది.

భారత్‌లోని అమెరికా ఎంబసీ ఇటీవల విదేశీ విద్యార్థులకు మే 14న ఓ హెచ్చరిక చేసింది. నిర్ణీత గడువును మించి అమెరికాలో అక్రమంగా నివసించేవారు తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని స్పష్టంచేసింది. వారిని స్వదేశాలకు పంపేయడం, భవిష్యత్‌లో అమెరికాకు రాకుండా శాశ్వత నిషేధం వంటివి జరుగుతాయని తెలిపింది. ఆ తర్వాత ట్రంప్ యంత్రాంగం ఎఫ్–1, జే–1, ఎం–1 వీసాలను రద్దుచేయడమే గాక,, స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ వ్యవస్థ (సెవిస్) రికార్డులను కూడా క్యాన్సిల్ చేయడంతో లక్షల సంఖ్యలో విదేశీ విద్యార్థులు అమెరికాను వీడాల్సి వచ్చింది. కాగా, జే–1 వీసా అంటే నాన్–ఇమిగ్రెంట్ వీసా. విద్య, సైన్స్, కళలు తదితర రంగాల్లో సాంస్కృతిక, మేధో సంబంధ మార్పిడిలో భాగంగా చేపట్టే విద్య, అధ్యయనం, పరిశోధన, ప్రత్యేక నైపుణ్యం, శిక్షణ కార్యక్రమాల్లో పాలుపంచుకునేందుకు అమెరికా వచ్చేవారికి ఈ వీసాలిస్తారు. ఈ కార్యక్రమాలు పూర్తయ్యేంతవరకు వారు అక్కడ నివసించవచ్చు. కాలపరిమితి లేదు. ఎఫ్–1 వీసా.. అమెరికాలో ప్రముఖ విద్యాసంస్థల్లో చదువుకునేందుకు వచ్చే విదేశీ విద్యార్థులకు ఇస్తారు. దీనికీ కాలపరిమితి లేదు. చదువు, పరిశోధనలు పూర్తయ్యేవరకు వారు ఉండొచ్చు. ఎం–1 వీసా.. గుర్తింపు పొందిన విద్యాసంస్థలు..జూనియర్ కాలేజీలు, పోస్ట్–సెకండరీ వొకేషనల్ స్కూళ్లు, పోస్ట్–సెకండరీ బిజినెస్ స్కూళ్ల వంటివాటిలో వొకేషనల్ లేదా సాంకేతిక శిక్షణ కోసం వచ్చేవారికి ఇస్తారు.

# 95 కోట్ల మందికి సంక్షేమం

## దేశ జనాభాలో 64% మందికి సంక్షేమ పథకాలతో లబ్ధి.. మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, : కేంద్ర సామాజిక భద్రత పథకాలతో దేశంలో 95 కోట్ల మంది లబ్ధి పొందుతున్నారని ప్రధాని మోదీ వెల్లడించారు. జనాభాలో 64 శాతం మందికి ఏదో ఒక రూపంలో సంక్షేమం అందుతోందన్నారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌వో) తన నివేదికలో ఈ విషయం వెల్లడించిందన్నారు. ఆకాశవాణిలో ఆదివారం ప్రసారమైన 'మన్ కీ బాత్' 123వ సంచికలో ఆయన ప్రసంగించారు. 2015కి ముందు వరకు దేశంలో 25 కోట్ల మంది మాత్రమే సామాజిక భద్రత కార్యక్రమాలతో ప్రయోజనం పొందారని చెప్పారు. ఇవాళ ఏదో ఒక పథకం ద్వారా 95 కోట్ల మంది లబ్ధి పొందుతున్నారని అన్నారు. ఆరోగ్యం నుంచి సామాజిక భద్రత వరకు ప్రతి రంగంలో సంతుష్ట స్థాయికి చేరే దిశగా దేశం ముందు కెళ్తోందన్నారు. భారత్‌ను ట్రాకోమా(కంటివాపు) రహితదేశంగా ఐఎల్‌వో ప్రకటించడంపై ప్రధాని హర్షం వ్యక్తంచేశారు. దీని నిర్మూలనలో 'స్వచ్ఛ భారత్ అభియాన్', 'జల్‌జీవన్ మిషన్' కార్యక్రమాల సహకారం కూడా ఉందన్నారు. ఊబకాయాన్ని కూడా తగ్గించుకోవాలని పిలుపిచ్చారు. ఇందుకోసం నూనె వాడకాన్ని పది శాతం తగ్గించుకోవాలని పునరుద్ఘాటించారు. వివిధ యాత్రలకు బయల్దేరుతున్న భక్తులు, యాత్రికులకు శుభాకాంక్షలు తెలియజేశారు. 'సుదీర్ఘ కాలం తర్వాత సోమవారం నుంచి కైలాస్ మానసరోవర్ యాత్ర పునః ప్రారంభమవుతోంది. అమరనాథ్ యాత్ర 3వ తేదీ నుంచి మొదలవుతోంది. ఇటీవలే పూరీ జగన్నాథుడి రథయాత్ర జరిగింది. కొద్ది రోజుల్లో పవిత్ర శ్రావణ మాసం వస్తోంది. ఉత్తరం నుంచి దక్షిణం.. తూర్పు నుంచి పశ్చిమం వరకు సాగే ఈ యాత్రలన్నీ 'ఏక్ భారత్..శ్రేష్ఠ భారత్' స్ఫూర్తిని ప్రతిబింబిస్తాయి' అని చెప్పారు.

**విశాఖ యోగాంధ్రలో 3 లక్షలకుపైనే..** దేశవ్యాప్తంగానే గాక ప్రపంచవ్యాప్తంగా ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొన్నారని ప్రధాని గుర్తుచేశారు. "విశాఖ బీచ్‌లో నేను పాల్గొన్న యోగాంధ్ర కార్యక్రమంలో 3లక్షల మంది పాలుపంచుకున్నారు. ఇదోఅద్భుత దృశ్యం" అని పేర్కొన్నారు. తెలంగాణలో మూడు వేల మంది దివ్యాంగులు కలిసి యోగా శిబిరంలో పాల్గొన్నారని, సాధికారతకు యోగా ఎలా మాధ్యమం అవుతుందో నిరూపించారని ప్రశంసించారు. మేఘాలయలో 'ఎరి' పట్టును ప్రధాని ఈ సందర్భంగా ప్రస్తావించారు. దీనికి కొద్ది రోజుల కిందట 'జీఐ' ట్యాగ్ కూడా లభించిందన్నారు. 'ఎరి పట్టు మేఘాలయకు వారసత్వంలాంటిది. ఇక్కడి ఖాసీ తెగ ప్రజలు ఎన్నో తరాలుగా దీనిని సంరక్షిస్తూ వస్తున్నారు. ఈ పట్టును తీసుకోవడానికి పట్టుపురుగులను చంపవసరం లేదు. అందుకే దీనిని 'అహింస పట్టు'గా పేర్కొంటున్నారు' అని తెలిపారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన వారిని దేశం ఎల్లప్పుడూ గుర్తుపెట్టుకుందని ప్రధాని ఈ సందర్భంగా చెప్పారు. ప్రజల క్రియాశీల భాగస్వామ్యం ఉంటే ఇలాంటి పెను

సంక్షోభాలను ఎదుర్కోగలమన్నారు.

**భద్రాద్రి మిల్లెట్ మ్యాజిక్..** తెలంగాణలోని భద్రాచలానికి చెందిన గిరిజన మహిళలను ప్రధాని ప్రశంసించారు. తమ జీవనోపాధి కోసం రోజంతా పొలాల్లో కూలీలుగా కష్టపడి పనిచేసే గిరిజన మహిళలు నేడు చిరుధాన్యాల (మిల్లెట్స్) నుంచి ఆరోగ్యకరమైన బిస్కెట్లు తయారు చేస్తున్నారని అన్నారు. ఈ బిస్కెట్లు 'భద్రాద్రి మిల్లెట్ మ్యాజిక్' పేరుతో హైదరాబాద్ నుంచి లండన్ దాకా వెళ్తున్నాయని తెలిపారు. ఆ గిరిజన మహిళలు 'గిరి శానిటరీ ప్యాడ్లు' తయారుచేశారని.. కేవలం మూడు నెలల్లో 40 వేల ప్యాడ్లను తయారుచేసి చాలా సరసమైన ధరకు పాఠశాలలు, సమీపంలోని కార్యాలయాలకు పంపిణీ చేశారని గుర్తుచేశారు.

# పాక్ ఆర్థికం అతలాకుతలం..

- **నౌకలపై భారత్ నిషేధం విధించడంతో తీవ్ర నష్టం**
- **ఎగుమతులు, దిగుమతుల్లో 50 రోజుల జాప్యం**
- **వెల్లడించిన 'డాన్' కథనం**




(సెంట్రల్ డెస్క్): పహల్గాంలో ఉగ్రవాద దాడి తర్వాత.. మే 2 నుంచి పాకిస్థాన్‌పై భారత్ విధించిన నిషేధంతో ఆ దేశ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమవుతోంది. ముఖ్యంగా భారతీయ పోర్టుల్లో పాకిస్థానీ నౌకలను నిషేధించడంతో ఎగుమతులు, దిగుమతులపై తీవ్ర ప్రభావం పడుతోంది. పాకిస్థాన్ పత్రిక 'డాన్' ఈ అంశంపై ఓ కథనాన్ని ప్రచురించింది. పాకిస్థాన్ నౌకలపై నిషేధం విధించడంతో.. భారీ నౌకలు కరాచీ పోర్టులోనే లంగర్ వేసుకుని, ఎదురు చూస్తున్నాయి. భారత పోర్టుల్లో అనుమతి లేకపోవడంతో.. సాధారణంగా జరగాల్సిన ఎగుమతులు, దిగుమతుల్లో 30 నుంచి 50 రోజుల మేర ఆలస్యం నమోదవుతోంది. భారత్ విధించిన నిషేధంతో లాజిస్టిక్స్ ధరలు గణనీయంగా పెరిగాయని, బీమా ఖర్చులు కూడా పెరిగినట్లు కరాచీకి చెందిన వస్త్రాల ఎగుమతిదారుడు ఆమిర్ అజీజ్ వాపోయారు. ఫలితంగా షిప్పింగ్ ధరలు భారీగా పెరిగినట్లు వివరించారు. భారత్ నిషేధం విధించిన తొలినాళ్లలో పాకిస్థాన్ దొడ్డిదారిలో సరుకు రవాణాకు సిద్ధమైంది. అయితే.. భారత్‌లో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) ఈ తరహా దిగుమతులు, ఎగుమతులపై కొరడా ఝుళిపిస్తోంది. యూఏఈ, శ్రీలంక, సింగపూర్ వంటి దేశాల నుంచి పాక్ పంపే సరుకులను కట్టడి చేసేందుకు 'ఆపరేషన్ డీప్ మానిఫెస్ట్'ను ప్రారంభించింది. ఫలితంగా 39 కంటైనర్లలోని రూ.9 కోట్ల విలువ చేసే 1,100 మెట్రిక్ టన్నుల సరుకు సీజ్ అయ్యింది. పాక్ ఈ సరుకును యూఏఈలో తయారైనట్లు తప్పుడు రికార్డులను సృష్టించి, భారత్‌కు తరలించింది.

**దారుణ పరిస్థితులు** : కరాచీ, కాసీం పోర్టులు పాక్ ఎగుమతులు, దిగుమతులకు అత్యంత కీలకం. వీటికి దన్నుగా గ్వాదర్ పోర్టు ఉంది. ఈ మూడు పోర్టులు ఆ దేశ జీడీపీకి 0.5% వాటాను అందజేస్తున్నాయి. ఈ పోర్టుల ద్వారా పాక్ ప్రభుత్వానికి ఏటా రూ.15 వేల కోట్ల మేర ఆదాయం లభిస్తుందని అంచనా. భారత్ ఆంక్షల తర్వాత.. పోర్టుల ద్వారా ప్రభుత్వాదాయానికి భారీగా గండి పడుతోంది. ఇక భారత్ నుంచి 2018లో ఇరు దేశాల మధ్య 2.41 బిలియన్ డాలర్ల మేర వాణిజ్యం జరగ్గా.. 2024లో అది 1.2 బిలియన్ల డాలర్లకు పడిపోయింది. పహల్గాం దాడితో ఈ సంబంధాలు మరింతగా క్షీణించాయి.

**వారంలోనే ధరాఘాతం** : గడిచిన వారం రోజుల్లో పాకిస్థాన్ ప్రభుత్వం పలు ఉత్పత్తుల ధరలను పెంచగా.. నిత్యావసరాలకు రెక్కలు వచ్చే పరిస్థితి నెలకొంది. ఎల్‌పీజీ సిలిండర్ ధరను ప్రభుత్వం 50% పెంచింది. గతంలో సబ్సిడీ సిలిండర్ ధర భారత కరెన్సీలో రూ.120గా ఉండగా.. ప్రస్తుతం రూ.180కి చేరుకుంది. నాన్-సబ్సిడీ సిలిండర్ల ధర రూ.303 నుంచి రూ.455కు పెరిగింది గత వారంలో పెట్రోల్ ధర లీటరుకు రూ.78.56 నుంచి రూ.80.02కు.. డీజిల్ ధర రూ.79.84 నుంచి రూ.82.26కు పెరిగింది. జూలై 1 నుంచి ఈ ధరలు మరింత పెరగనున్నాయి.

# విమాన ప్రమాదం వెనుక కుట్ర కోణాన్ని తోసిపుచ్చలేం



న్యూఢిల్లీ: అహ్మదాబాద్ నుంచి బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం జూన్ 12న కుప్పకూలిన దుర్ఘటన వెనుక కుట్ర కోణాన్ని తోసిపుచ్చలేమని, ఆ కోణంలో కూడా దర్యాప్తు జరుపుతున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ (Muralidhar Mohol) తెలిపారు. బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787–8 విమానం (AI171) కుప్పకూలిన ఘటనలో విమానంలోని 242 మందిలో ఒక్కరు మాత్రమే బయట పడగా, 29 మంది సివిలియన్స్‌తో కలిపి కలిపి మొత్తం 270 మంది ప్రాణాలు కోల్పోయారు.

'విమాన ప్రమాద ఘటనపై ఏఏబీ పూర్తి విచారణ చేపట్టింది. ప్రమాదం వెనుక కుట్ర కోణంతో సహా అన్ని కోణాల నుంచి దర్యాప్తు జరుగుతోంది. సీసీటీవీ ఫుటేజ్‌ను సమీక్షిస్తున్నారు. దీనిపై పలు ఏజెన్సీలు పనిచేస్తున్నాయి' అని కేంద్ర మంత్రి తెలిపారు.

**3 నెలల్లో క్రాష్ రిపోర్ట్** కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ (సీవీఆర్), ఫ్లైట్ డాటా రికార్డర్ (ఎఫ్‌డీఆర్)తో ఉన్న బ్లాక్ బాక్స్‌ను స్వాధీనం చేసుకున్నట్టు మంత్రి ధ్రువీకరించారు. అది ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) అధీనంలో ఉందని తెలిపారు. డివైస్ (బ్లాక్ బాక్స్)ను విశ్లేషించేందుకు విదేశాలకు పంపవచ్చంటూ వస్తున్న ఊహాగానాలను ఆయన తోసిపుచ్చారు. ఆ అవసరం లేదని, మొత్తం విచారణ ఇక్కడే జరుగుతుందని వివరించారు.

విమాన ప్రమాదం డబుల్ ఇంజెన్ వైఫల్యం వల్ల జరిగిందా, ఇంధనం సమస్య కారణమా, సాంకేతిక లోపం వల్ల తలెత్తిందా అనే దానిపై దర్యాప్తు సంస్థలు విచారణ జరుపుతున్నాయని చెప్పారు. రెండు ఇంజెన్లు మూసుకుపోవడం ఎప్పుడూ జరగలేదని, కాక్‌పిట్ సంభాషణలను సీవీఆర్ వెల్లడిస్తుందని, అయితే దీనిపై ఇప్పటికిప్పుడు ఏమీ చెప్పలేమని మంత్రి వివరించారు. మూడు నెలల్లో పూర్తి నివేదిక వస్తుందని తెలిపారు.

**భద్రతకు పూచీ** విమాన ప్రమాదానంతరం ప్రజల్లో తలెత్తిన భయాలపై మంత్రి మాట్లాడుతూ, డీజీసీఏ ఆదేశాలపై మొత్తం 33 డ్రీమ్‌లైనర్ల తనిఖీలు చేపట్టామని, సేఫ్టీకి ఎలాంటి ధోకా లేదని మంత్రి భరోసా ఇచ్చారు. ఏవియేషన్ అంశాలపై మాట్లాడుతూ, డీజీసీఏలో 419 టెక్నికల్ వేకెన్సీలు ఉన్నాయని, త్వరలోనే దీనిని పరిష్కరిస్తామని చెప్పారు.

ఏ ప్రైవేటు ఎయిర్‌లైన్ కూడా అనధీకృత నియామకాలు చేయలేదని, పైలెట్లు ఎవరైనా ఇబ్బందులకు గురైనట్లయితే తమ శాఖను సంప్రదించవచ్చని చెప్పారు. విమానాశ్రయంలో ఆహారం ధరలు ఎక్కువగా ఉండటంపై మాట్లాడుతూ, ఐదారు ప్రాంతాల్లో తక్కువ ధరలతో 'ఉడాన్ యాత్రి కేఫ్స్' ఇప్పటికే నడుసున్నాయని, నీళ్లు రూ.10, టీ, సమోసా రూ.20కు లభిస్తున్నాయని, వీటిని క్రమంగా విస్తరిస్తామని మురళీధర్ మోహోల్ తెలిపారు.

# రాసిస్తా...నితీష్ తిరిగి సీఎం అయ్యేదే లేదు




పాట్నా: బీహార్‌లోని 60 శాతం ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, ఈ ఏడాది చివర్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల తరువాత జనతాదళ్ (యునైటెడ్) చీఫ్ నితీష్ కుమార్ ముఖ్యమంత్రి అయ్యే ప్రసక్తే లేదని జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ అన్నారు. ఈ విషయం రాసి పెట్టుకోండని ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలిపారు.

ప్రశాంత్ కిషోర్ గతంలో ప్రముఖ ఎన్నికల వ్యూహకర్తగా జనతాదళ్ (యూ), బీజేపీ, తృణమూల్ కాంగ్రెస్ సహా పలు పార్టీలకు పనిచేశారు. తాజాగా ఆయన బీహార్‌లో జరిపిన సర్వే వివరాలను వెల్లడిస్తూ, 62 శాతం ప్రజలు మార్పును కోరుకుంటున్నట్టు తాను, తన టీమ్ చేసిన సర్వేలో తేలిందని చెప్పారు. వీరంతా జన్ సురాజ్ పార్టీకి ఓటు వేస్తారా, పాత పార్టీలైన లాలూ యాదవ్ ఆర్జేడీ, కాంగ్రెస్‌కు ఓటు వేస్తారా అనేదే ప్రస్తుతం అందరి ముందున్న ప్రశ్న అని చెప్పారు.

'మార్పును కోరుకునే 60 శాతం మంది ఎవరికి ఓటు వేయాలని నిర్ణయిస్తారో రాబోయే రోజుల్లో తెలుస్తుంది. తమ కోసం ఏమాత్రం పనిచేసిన వారినే మళ్లీ విశ్వసిస్తారా, ప్రత్యామ్నాయాన్ని ఎన్నుకుంటున్నారా అనేది చూడాలి. ఏది జరిగినా నవంబర్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత నితీష్ మాత్రం ముఖ్యమంత్రి కారని నిశ్చయంగా చెప్పగలను. ఆ విషయం రాసి ఇస్తాను. బీహార్‌కు కొత్త ముఖ్యమంత్రి వస్తారు' అని ప్రశాంత్ కిషోర్ జోస్యం చెప్పారు. అంత ధీమాగా ఎలా చెప్పగలరని అడిగినప్పుడు, నితీష్ కుమార్ మానసిక, శారీరక పరిస్థితి బాగోలేదని ఆయన సమాధానమిచ్చారు. ఈ విషయం బీహార్ ప్రజలందరికీ తెలుసున్నారు. ప్రధానమంత్రి పక్కనే కూర్చుని ఆయన పేరునే మర్చిపోయే వ్యక్తి, జాతీయగీతం ఆలపించినప్పుడు అది జాతీయ గీతమో, ఖవ్వాలీనో తెలియని వ్యక్తి, ఏడాదిలో ఒక్కసారి కూడా మీడియాతో మాట్లాడని వ్యక్తి, తనను తాను చూసుకోలేని వ్యక్తి బీహార్‌ను ఎలా కాపాడతారు? మీకూ, నాకూ తెలిసిన ఈ విషయం ప్రధానికి, అమిత్‌షాకి తెలియదని ఎలా అనుకుంటాం? అని ప్రశాంత్ కిషోర్ ప్రశ్నించారు.

ఇలాంటి పరిస్థితులు ఉన్నప్పటికీ ఎన్నికలు అయ్యేంత వరకూ నితీష్‌ను ముందుంచి, ఆ తర్వాత మరో కొత్త మంత్రిని వాళ్లు (బీజేపీ) ముందుకు తెస్తారని అన్నారు. బీహార్‌లో సొంతంగా పోటీ చేయగలమనే నమ్మకం బీజేపీకి లేనందు వల్లే ఇప్పుడే నితీష్‌ను పక్కకు తప్పించలేదన్నారు. గతంలో కూడా బీజేపీ అలా చేసింది లేదని గుర్తుచేశారు. ఆ కారణంగానే నితీష్ పైనే ఆ భారం మోపుతుందని ఆయన విశ్లేషించారు.

**అలా కాకుంటే రాజకీయాల నుంచి తప్పుకుంటా..**

జేడీయూ మొత్తం 243 సీట్లలో 25 సీట్లకు మించి గెలుచుకోలేదని, తన అంచనా తప్పయితే తాను రాజకీయాలను తప్పుకుంటానని ప్రశాంత్ కిషోర్ చెప్పారు. దీన్ని కూడా రాసిపెట్టుకోవచ్చన్నారు. ఎన్నికల తర్వాత జేడీయూ ఉనికే ప్రశ్నార్థకమవుతుందని, నితీష్ కుమార్ అప్రూవ్ రేటింగ్ 60 శాతం నుంచి 16-17 శాతానికి పడిపోతుందని చెప్పారు.

జేడీయూకు కార్యకర్తలులేరని, ఉన్నదల్లా నితీష్ ఒక్కరేనని, అది కూడా ఇప్పుడు పోయిందని విశ్లేషించారు.

**సీఎం రేసులో లేను కానీ..** ఆర్జేడీ మాజీ ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ కూడా తదుపరి సీఎం కారని, జన్ సురాజ్ నుంచే కొత్త సీఎం వస్తారని, వేచి చూడండని ప్రశాంత్ కిషోర్ చెప్పారు. అయితే తాను సీఎం రేసులో లేనని, ముఖ్యమంత్రి కావడానికి తాను రాలేదని అన్నారు. తాను రాష్ట్ర అధ్యక్షుడో, జాతీయ అధ్యక్షుడో కూడా కాదని, బీహార్‌లోని వ్యవస్థలో మార్పు తెచ్చేందుకు తాను వచ్చానని, ఆ పని ఇప్పటికే మొదలైందని చెప్పారు. నితీష్ కుమార్ జిల్లాకు ఈరోజు వెళ్తున్నానని, జేడీయూ అక్కడ కూడా ఓడిపోనుందని ఆయన జోస్యం చెప్పారు.

జన్ సురాజ్ ఉద్యమంలో 1.25 కోట్ల మంది బీహార్ ప్రజలు పాల్గొన్నారని చెబుతూ తాను కింగ్‌మేకర్‌నని ఆయన స్పష్టం చేశారు. తాము గెలిచినా, గెలవకపోయినా జన్ సురాజ్ పవర్‌ఫుల్ ఫోర్స్‌గా, ప్రజావాణిగా ఆవిర్భవించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయేతో కానీ, విపక్ష యూపీఏతోనూ కలిసేది లేదని, 243 స్థానాల్లోనూ పోటీ చేస్తామని, ఎవరైనా తమ పార్టీని జన్ సురాజ్‌లో కలపాలనుకుంటే ఆ పని చేయవచ్చని సూచించారు.

**పోటీపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు** ఎన్నికల్లో జన్‌సురాజ్ అభ్యర్థిగా పోటీ చేస్తారా అడిగినప్పుడు దీనిపై తానింకా నిర్ణయం తీసుకులేదని ప్రశాంత్ కిషోర్ చెప్పారు. పార్టీ ఎగ్జిక్యూటివ్ కమిటీ దీనిపై నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

# మధ్యవర్తిత్వంతో పెండింగ్ కేసుల పరిష్కారం

- **జూలై 1 నుంచి 90 రోజుల పాటు కార్యాచరణ**
- **జాతీయ కార్యక్రమంగా చేపట్టిన సుప్రీంకోర్టు**




న్యూఢిల్లీ, : పెండింగ్ కేసుల పరిష్కారంపై సుప్రీంకోర్టు ప్రత్యేక కార్యాచరణను ప్రారంభించనుంది. తాలూకా స్థాయి కోర్టుల నుంచి హైకోర్టుల వరకు పెండింగ్‌లో ఉన్న వివాదాలను తేల్చేందుకు 90 రోజుల పాటు 'జాతీయ స్థాయి మధ్యవర్తిత్వ ప్రచార కార్యక్రమా'న్ని నిర్వహించనుంది. 'జాతి కోసం మధ్యవర్తిత్వం' పేరుతో జరిగే ఈ కార్యక్రమం జులై ఒకటో తేదీన ప్రారంభమయి సెప్టెంబరు 30న ముగియనుంది. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు ఆధ్వర్యంలోని మధ్యవర్తిత్వ, సాంత్వన ప్రాజెక్టు కమిటీ (మీడియేషన్ అండ్ కాన్సిలియేషన్ ప్రాజెక్టు కమిటీ–ఎంసీపీసీ), జాతీయ న్యాయసేవల సంస్థ (నల్సా) గురువారం ప్రకటించాయి.

స్నేహపూర్వక విధానంలో మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించవచ్చన్న విషయాన్ని దేశం నలుమూలలకు తీసుకెళ్లనున్నట్టు సుప్రీంకోర్టు ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. రాజీకి అనుకూలంగా ఉండే కేసులను గుర్తించి, వాటిని మధ్యవర్తిత్వ విధానం ద్వారా పరిష్కరించుకోవచ్చన్న భావనను ప్రజల్లో కల్పించనున్నట్టు పేర్కొంది. జులై ఒకటో తేదీ నుంచి 30 వరకు పెండింగ్ కేసుల గుర్తింపు, కక్షిదారులు, మధ్యవర్తులకు సమాచారం పంపించే ప్రక్రియ కొనసాగుతుంది. అనంతరం కేసులపై ఆయా కోర్టుల్లో సంప్రదింపులు జరుగుతాయి. వారంలో మొత్తం ఏడు రోజుల పాటు విచారణ జరగనుంది.

# సోషలిస్టు, సెక్యులర్ పదాలను రాజ్యాంగ పీఠిక నుంచి తొలగించాలి

- సంఘ్ నేత దత్తాత్రేయ హోసబలే సూచన
- దేశంలో ఎమర్జెన్సీ విధించిన కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- ఆర్ఎస్ఎస్ ముసుగు తొలగిపోయింది
- సంఘ్, బీజేపీలకు రాజ్యాంగం అక్కర్లే: రాహుల్



న్యూఢిల్లీ, : రాజ్యాంగ పీఠిక నుంచి సామ్యవాదం (సోషలిస్టు), లౌకికవాదం (సెక్యులరిజం) అనే పదాలను తొలగించాలని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబోలే అభిప్రాయపడ్డారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగ ముసాయిదాలో ఇవి లేవని.. ఎమర్జెన్సీ సమయంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వీటిని పీఠికలో చేర్చిందని అన్నారు.

ఆయన వ్యాఖ్యలపై కాంగ్రెస్, సీపీఎం విరుచుకుపడ్డాయి. హోసబోలే గురువారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. 'బాబాసాహెబ్ రాసిన రాజ్యాంగ పీఠికలో ఈ పదాలు ఎప్పుడూ లేవు. ఎమర్జెన్సీ సమయంలో సోషలిస్టు, సెక్యులర్ పదాలను పీఠికలో చేర్చారు. అలాగే బలవంతంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు పెద్దఎత్తున చేయించారు. ఇలాంటి పనులు చేసినవాళ్లు ఇప్పుడు రాజ్యాంగ ప్రతిని చేతిలో పట్టుకుని తిరుగుతున్నారు. ఎమర్జెన్సీ విధించినందుకు ఇప్పటి వరకు క్షమాపణ చెప్పలేదు. మీ పూర్వీకులు చేసినదానికి క్షమాపణ కోరాల్సిందే' అని స్పష్టంచేశారు.

ఆర్ఎస్ఎస్ ముసుగు మళ్లీ తొలగిపోయిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఆ సంస్థకు, బీజేపీకి రాజ్యాంగం అవసరం లేదని, వారికి మనుస్మృతి కావాలని 'ఎక్స్'లో మండిపడ్డారు. సమానత్వం, లౌకికవాదం, న్యాయం గురించి రాజ్యాంగం మాట్లాడుతుంది కాబట్టి బీజేపీకి నచ్చడం లేదన్నారు. రాజ్యాంగం వంటి శక్తివంతమైన ఆయుధాన్ని పేదల నుంచి లాక్కోవడమే బీజేపీ నిజమైన ఎజెండాగా పేర్కొన్నారు. అయితే, బీజేపీ కలలను ఎప్పటికీ విజయవంతం కానివ్వబోమని చెప్పారు. హోసబోలే వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. అంబేద్కర్ విజన్‌పై ఆర్ఎస్ఎస్ కుట్ర చేస్తోందని 'ఎక్స్'లో విమర్శించింది. పీఠికలో సోషలిస్టు, సెక్యులర్ పదాలు ఉంచడంపై సమీక్షించాలనడం రాజ్యాంగ ఆత్మపైనే దాడిగా అభివర్ణించింది. భారత రాజ్యాంగమంటే ఆర్ఎస్ఎస్‌కు మొదటి నుంచీ గౌరవం లేదని, దానిని అంగీకరించలేదని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు.

# వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుంది

## క్షతగాత్రులకు మెరుగైన చికిత్స.. 13 మంది ఆచూకీ లభించాల్సి ఉంది

## బాధితులను పరామర్శించిన మీనాక్షి నటరాజన్, మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర



పటాన్‌చెరు / హైదరా బాద్, : సిగాచి పరిశ్రమలో జరిగిన అగ్నిప్రమాదంలో గాయ పడి చికిత్స పొందుతున్న క్షతగాత్రుల వైద్య ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేషకుమా ర్‌గౌడ్, వైద్యారోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి ఆమె పాశమైలారంలోని పరిశ్రమ సంఘటన ప్రాంతాన్ని సంద ర్శించి బాధిత బంధువులతో మాట్లాడారు. అంతకుముందు పటాన్‌చెరులోని ప్రభుత్వ ఆస్పత్రి, ధ్రువ ఆస్పత్రి, మాదీనగూడ ప్రణం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా మీనాక్షి మాట్లాడుతూ.. ఇప్పటికే బాధితులకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహకారం అందించినట్లు తెలిపారు. మహేషకుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి, మంత్రులు ఘటనపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నారని, క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు.

పేలుడు ఘటనను ప్రభుత్వం చాలా తీవ్రంగా పరిగణిస్తోందని బాధ్యులను వదిలే ప్రసక్తి లేదన్నారు. మంత్రి రాజనర్సింహ మాట్లాడుతూ.. ఇప్పటివరకు 36 మృతదేహాలు లభ్యమయ్యాయని, 13 మంది ఆచూకీ లభించలేదన్నారు. 11 మంది మృతదేహాలను అప్పగించామని, ఎఫ్ఎసఎల్ రిపోర్ట్ వచ్చాక మిగిలిన మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని తెలిపారు. మిగిలిన శిథిలాలు తొలగిస్తే మిగతా 13 మంది ఆచూకీ లభించే అవకాశం ఉందన్నారు. బాధితులను పరామర్శించిన వారిలో శేరిలింగంపల్లి ఎమ్మెలే గాంధీ, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తదితరులున్నారు. కాగా, ప్రమాదంపై విచారణకు ఆదేశించాలని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ యాజమాన్యానిది తప్పు అని తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

# తెలంగాణలో చంద్రబాబు కోవర్టులు

## పెద్ద కాంట్రాక్టులన్నీ వాళ్లకే : అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, : తెలంగాణలో చంద్రబాబుకు కోవర్టులు ఉన్నారని, వాళ్లే పెద్ద, పెద్ద కాంట్రాక్టులన్నీ చేపడుతున్నారని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం ఆపాలంటే లేఖలు రాస్తే సరిపోదని, కోవర్ట్ కాంట్రాక్టర్లను కట్టడి చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఆయన సూచించారు.

మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం మోతీఘనపూర్‌లో ముడా నిధులతో నిర్మించే పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. హైదరాబాద్‌లో దందాలు కూడా చంద్రబాబు కోవర్టులే చేస్తున్నారని, వారికి నల్లా, కరెంటు కనెక్షన్లు కట్ చేయాలని, ఇరిగేషన్ ప్రాజెక్టులలో ఒక్క రూపాయి కూడా రాకుండా చూడాలన్నారు. ఇలా చేస్తే వారంతా చంద్రబాబు వద్దకు వెళ్లి బనకచర్లను బంద్ చేయిస్తారని చెప్పారు.

# మైనార్టీలపై దాడులు పెరుగుతున్నా యూపీ సర్కారు మౌనమెందుకు?

## మజ్లిస్ చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ

హైదరాబాద్, :ఉత్తరప్రదేశ్‌లో మైనార్టీ వర్గాలే లక్ష్యంగా దాడులు, దౌర్జన్యాలు పెచ్చుమీరుతున్నాయని మజ్లిస్ పార్టీ చీఫ్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. కన్వర్ యాత్ర సందర్భంగా ముజఫర్‌నగర్ ప్రాంతంలోని హోటళ్ల సిబ్బందిని అల్లరిమూకలు వేధింపులకు గురి చేస్తున్నాయన్నారు. 'ముజఫర్‌నగర్ సమీపంలో హోటళ్లలోని సిబ్బంది మతాన్ని నిరూపించుకునేందుకు ఆధార్ కార్డులు చూపాలని.. లేని పక్షంలో ప్యాంట్ విప్పాలని దుర్మార్గంగా వ్యవహరించే అల్లరిమూకలను పోలీసులు అదుపు చేయలేకపోతున్నారు.

భారతీయ సనాతన్ సురక్ష దళ్ అనే స్వయం ప్రకటిత సంస్థకు చెందిన ఓ గ్రూప్ మైనార్టీలను లక్ష్యంగా చేసుకుని ఇలాంటి దౌర్జన్యాలకు పాల్పడుతోంది. కన్వర్ యాత్ర మార్గాల్లో దుకాణదారులు తమ పేర్లను ప్రదర్శించాలన్న యూపీ సర్కారు



ఆదేశాన్ని గతంలోనే సుప్రీంకోర్టు నిలిపేస్తూ ఆదేశాలిచ్చింది' అని వ్యాఖ్యానించారు.

# బనకచర్లకు బీఆర్ఎస్ రాజకీయ రంగు

## కేటీఆర్, హరీశ్‌రావు మధ్య రాజకీయ అస్తిత్వ పోరు

## సీమకు నీరిస్తామన్న కేసీఆర్ మాటలు మరిచిపోయారా.. : ఏపీ మంత్రి పయ్యావుల




అనంతపురం, : 'కేటీఆర్, హరీశ్‌రావు మధ్య రాజకీయ అస్తిత్వ పోరు నడుస్తోంది. ఆ కారణంగానే బనకచర్ల ప్రాజెక్టుకు రాజకీయ రంగు పులుముతున్నారు' అని ఏపీ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. 'మేం తెలంగాణకు వ్యతిరేకం కాదు. సముద్రంలోకి వెళ్లే జలాలను వాడుకునే ప్రయత్నం చేస్తున్నాం. కేటీఆర్, హరీశ్‌రావు మధ్య ఉన్న అస్తిత్వ పోరుకు రాజకీయ రంగు పులిమి, ఇదేదో ప్రాంతాల మధ్య సమస్య అన్నట్లు మాట్లాడటం బాధాకరం. రాయలసీమను రతనాల సీమను చేస్తానని చెప్పిన కేసీఆర్ మాటలు హరీశ్‌రావుకు గుర్తుకు రాలేదా? ఆయన తన అస్తిత్వాన్ని కోల్పోతున్న క్రమంలో, సొంత పార్టీలో తనను తాను నిలబెట్టుకునే ప్రయత్నంలో భాగంగానే బనకచర్ల ప్రాజెక్టు అంశాన్ని లేవనెత్తారు.

కేటీఆర్ ఎక్కడా బనకచర్ల ప్రాజెక్టు గురించి మాట్లాడలేదు. హరీశ్‌రావు ట్రాప్‌లో పడి, ఆ పార్టీ మిగతా నేతలు బనకచర్లపై మాట్లాడే ప్రయత్నం చేస్తున్నారే తప్ప, దాని మూలంగా తెలంగాణకు నష్టం ఉండదని వారికీ తెలుసు. తెలంగాణ బాగుండాలని మేము కోరుకుంటున్నాం. ఆ రాష్ట్రంలో అన్ని ప్రాజెక్టులు కట్టినా సంతోషాన్ని వ్యక్తం చేశాం. మొన్నటి దాకా కలిసున్న వాళ్లమే కదా..! ఇదంతా పొలిటికల్ డ్రామా' అని పయ్యావుల అన్నారు.

# పాఠశాల విద్య.. ఇకపై 12వ తరగతి దాకా!

- హైస్కూళ్ల స్థాయిని పెంచే యోచన విద్యార్థుల డ్రాపౌట్లను నివారించేందుకు..
- ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేయాలి..
- పదో తరగతిలో ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థి.. ఇంటర్మీడియట్ పూర్తి చేసేలా చూడాలి
- యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాల ప్రగతిపై నివేదిక సమర్పించాలి
- విద్యాశాఖపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, : రాష్ట్రంలో ప్రస్తుతం పదో తరగతి వరకు ఉన్న పాఠశాల విద్యను ఇకపై 12వ తరగతి వరకు పొడిగించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ మేరకు ఉన్నత పాఠశాలల స్థాయిని పెంచి 12వ తరగతి వరకు కొనసాగించాలని భావిస్తోంది. ఈ అంశంపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పలు ఇతర రాష్ట్రాల్లో పాఠశాల విద్య 12వ తరగతి వరకు ఉంటోందని, దీంతో 9వ తరగతిలో ఉన్న విద్యార్థుల సంఖ్య 12వ తరగతి వరకూ కొనసాగుతోందని అన్నారు. కానీ, తెలంగాణలో పదో తరగతిలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటున్నా, మంచి ఫలితాలు వస్తున్నా.. ఇంటర్మీడియట్‌కు వచ్చేసరికి సంఖ్య ఎందుకు తగ్గుతోందని ప్రశ్నించారు. ఇందుకు.. ఆయా రాష్ట్రాల్లో పాఠశాల విద్య 12వ తరగతి వరకు ఉండడం వల్లే డ్రాపౌట్ల సంఖ్య తక్కువగా ఉంటోందని అధికారులు బదులిచ్చారు. దీంతో ఇంటర్మీడియట్ వేరుగా ఉన్న రాష్ట్రాలు, పాఠశాలల్లో 12వ తరగతి వరకు ఉన్న రాష్ట్రాల్లో అధ్యయనం చేసి సమగ్ర నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. ఈ విషయంలో విద్యా కమిషన్, ఆ విభాగంలో పని చేసే స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజం సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. బుధవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విద్యాశాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతిలో ఉత్తీర్ణులైన ప్రతీ విద్యార్థి తప్పనిసరిగా ఇంటర్మీడియట్ పూర్తి చేసేలా చూడాలన్నారు. విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ దశ కీలకమైనది అయిందున.. ఆ దశలో సరైన మార్గదర్శకత్వం అందాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్యను మెరుగుపరిచేందుకు అన్ని స్థాయుల్లో చర్చించి.. శాసనసభలోనూ చర్చకు పెడతామని తెలిపారు.

**హాజరుపైనా దృష్టి పెట్టాలి..** ఇంటర్మీడియట్‌లో విద్యార్థుల చేరికతోపాటు వారి హాజరుపైనా దృష్టి పెట్టాలని అధికారులను సీఎం ఆదేశించారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్స్ స్కూళ్ల నమూనాలను పరిశీలించిన ముఖ్యమంత్రి.. ప్రతి పాఠశాల ఆవరణలో భారీ జాతీయ జెండాను ఏర్పాటు చేయాలన్నారు. భవనాల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని, నిర్మాణాల ప్రగతిపై ప్రతి వారం తనకు నివేదిక సమర్పించాలని అన్నారు. ప్రతి నియోజకవర్గంలో బాలురు, బాలికలకు ఒక్కొక్కటి చొప్పున యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాలు చేపడతామని తెలిపారు. ఇప్పటికే ఒక్కో పాఠశాలకు సంబంధించి స్థల సేకరణ పూర్తయిందని, రెండో పాఠశాలకు స్థల గుర్తింపు, సేకరణ ప్రక్రియపై దృష్టి సారించాలని నిర్దేశించారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం నిర్మాణ నమూనాను సీఎం పరిశీలించి పలు మార్పులను సూచించారు. సాధ్యమైనంత త్వరగా టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. కాగా సీఎం రేవంత్ రెడ్డి రాత్రి 10 నుంచి 11-30 వరకు ఇంజనీరింగ్‌లో అదనపు సీట్ల అంశమ్మీద సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ ఇప్పటికే ప్రారంభమైన నేపథ్యంలో అదనపు సీట్లపై చర్చించారు. అయితే సీఎస్ఈ సీట్లు పెరిగితే కోర్ ఇంజినీరింగ్ కోర్సులైన సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్, కెమికల్ ఇంజినీరింగ్ సీట్లకు ప్రాధాన్యం తగ్గుతుందన్న అభిప్రాయం వ్యక్తమైంది.

# 'సెస్' అభివృద్ధికి పాలకవర్గం కృషి

## సెస్ చైర్మన్ చిక్కాల రామారావు




సిరిసిల్ల : సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం అభివృద్ధికి తమ పాలకవర్గం కృషి చేస్తోం దని, కావాలనే కొంతమంది అసత్యపు ప్రచారాలు చేస్తున్నారని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. సిరిసిల్ల సెస్ ప్రధాన కార్యాల యంలోని సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత సెస్ పాలకవర్గం రూ 14కోట్లు రెవెన్యూను ఉంచగా, తమ పాలకవర్గం వచ్చిన రెండున్నర సంవత్సరాల్లో దానిని రూ. 22 కోట్లకు పెంచి, సెస్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తోందన్నారు.

సిరిసిల్ల పట్టణంలో విద్యుత్ అధికంగా ఉప యోగించడం వలన అంతరాయాలు ఏర్పడుతున్నాయని దానిని పరి ష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. సిరిసిల్లలో ఎస్ఎస్ఐ యూనిట్ సభ్యులకు 25 హెచ్‌పీల కరెంట్‌ను ఉచితంగా ఇవ్వాలని ఈఆర్‌సీని ప్రత్యేకంగా కోరానన్నారు. విద్యుత్ సబ్సీడీపై నేతన్నలు తనను అపా ర్థం చేసుకోవద్దన్నారు. సెస్ పరిధిలో ఏ పనులు చేపట్టిన కూడా పాల కవర్గం తీర్మానంతో పాటు టెండర్‌లతోనే చేయిస్తామని, ఇందులో ఎక్క డా కూడా అవకతవకలు జరిగే ప్రసక్తి లేదన్నారు. సిరిసిల్ల, వేముల వాడ పట్టణాల్లో నిరంతరం కరెంట్‌ను సరఫరా చేసేందుకు ఆ పట్టణా లకు నలుదిక్కులా ఉన్న సబ్‌స్టేషన్‌ల నుంచి ప్రత్యేకంగా విద్యుత్ లైన్ లు వేయించామన్నారు. సిరిసిల్ల పట్టణానికి అదనంగా రెండు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లు మంజూరు అయ్యాయని, రెవెన్యూ అధికా రులకు స్థలం ఇవ్వాలంటూ లెటర్‌లు ఇచ్చామని స్థలం చూపించిన వెంటనే సబ్‌స్టేషన్‌ల నిర్మాణాలు ప్రారంభిస్తామన్నారు. సెస్ పరిధిలో గతంలో 36విద్యుత్ సబ్‌స్టేసన్‌లు ఉండేవని తాము పాలకవర్గం ప్రస్తు తం 85 సబ్‌స్టేషన్‌లకు పెంచామన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో 220కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైందన్నారు. అలాగే నేరేళ్ల, బోయి న్‌పల్లిలలో 220 కేవీ సబ్‌స్టేషన్‌లు మంజూరు కావాల్సి ఉందన్నారు. సెస్‌లో పనిచేసేందుకు సిబ్బందితోపాటు హెల్పర్‌లు, ఏఈలు లేరని ఆ పోస్టులను భర్తీచేయాలని ప్రభుత్వానికి నివేదిక పంపించామన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్‌లు దార్నం లక్ష్మీనారాయణ, రేగులపాటి హరిచర ణ్‌రావు, వరుస కృష్ణహరి తదితరులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్లపైనే రాజకీయ భవిష్యత్తు

- **పాలమూరు నగరపాలికలో అందరిచూపు వాటిపైనే**
- **ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ మారుతున్న రాజకీయ సమీకరణలు**
- **అధికార పార్టీలో చేరనున్న బీఆర్ఎస్ మాజీలు**



మహబూబ్‌నగర్, : పాలమూరు కార్పొరేషన్‌లో ఆశావహులు ఇప్పటి నుంచే డివిజన్లలో పర్యటిస్తున్నారు. కార్పొరేషన్‌లో ఇదివరకు ఉన్న 49 వార్డులు కాస్త 60 డివిజన్ లుగా మారాయి. వాటి విభజన ప్రక్రియ పూర్తయి, తుది జాబితా వెలువడటంతో పోటీలో చేయాలనుకుంటున్న వారు ఎక్కడి నుంచి పోటీ చేయాలి? డివిజన్‌లో ఉన్న అనుకూల పరిస్థితులు ఏంటి? అని లెక్కలు వేసుకుంటున్నారు. ఇప్పటి వరకు బాగానే ఉన్నా డివిజన్ రిజర్వేషన్ పైనే రాజకీయ భవిష్యత్తు ఆధారపడి ఉండటంతో అదే వారిని టెన్షన్ పెట్టిస్తోంది.

**రిజర్వేషన్లు ఇలా..** 60 వార్డులున్న కార్పొరేషన్‌లో 50 శాతం అంటే 30 స్థానాలు మహిళలకు రిజర్వ్ కానున్నాయి. మహిళా రిజర్వేషన్‌కు ఖరారైన చోట భార్యలు, లేదంటే తల్లులను బరిలో దించేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు. అదేవిధంగా మేయర్ పీఠం కోసం చాలామందే ప్రయత్నాలు చేసుకుంటున్నారు. మేయర్ రిజర్వేషన్‌పైనా అందరిలో ఉత్కంఠ నెలకొంది. మునిసిపల్, కార్పొరేషన్ ఎన్నికలకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున ఇప్పట్లో రిజర్వేషన్ ప్రక్రియ చేపట్టే అవకాశం లేదు. ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ, పంచాయతీ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసిన అనంతరం వీటికి ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. అంటే మరో 3–4 నెలల తరువాతే మునిసిపల్, కార్పొరేషన్ ఎన్నికల ప్రక్రియ చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**డివిజన్‌లలో మొదలైన క్యాంపెయిన్** ప్రస్తుతం డివిజన్‌ల ప్రక్రియ పూర్తవడంతో అశావహులు అవగాహనకు వచ్చినందున ఆయా డివిజన్‌ల ప్రజలతో మాట్లాడుతున్నారు. తాజా మాజీలతో పాటు కొత్తతరం నాయకులు ప్రజలను పలుకరిస్తూ, అవసరాలు, సమస్యలను పరిష్కరించే ప్రయత్నాలు చేస్తున్నారు. డివిజన్‌ల ముఖ్యులతో వాట్సప్ గ్రూప్‌లు క్రియేట్ చేసి, వీధిలైట్లు, డ్రైనేజీలు, విద్యుత్ తీగల సమస్యలు ఉంటే గ్రూప్‌లో తెలియజేయాలని కోరుతున్నారు. వాటిని వెంటనే పరిష్కరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదివరకు ఫోన్‌లు ఎత్తని నాయకులు కూడా ఇప్పుడు డివిజన్ ప్రజలు ఫోన్ చేస్తే వెంటనే స్పందిస్తున్నారు. చాలామంది ఇప్పటికే కాలనీలలో ఎన్నికల క్యాంపెయిన్ మొదలుపెట్టారు.

**మారనున్న రాజకీయ సమీకరణలు** ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడం, తొందరలోనే ఎన్నికలు రానున్న నేపథ్యంలో పాలమూరు కార్పొరేషన్‌లో రాజకీయ సమీకరణలు మారుతున్నాయి. అధికార పార్టీలో టికెట్ల మధ్య పోటీ ఎక్కువగా ఉంటుంది. టికెట్ ఖాయమని భరోసా ఇస్తే పార్టీ ఫిరాయింపులకు ప్రతిపక్ష నాయకులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలోనే బీఆర్ఎసకు చెందిన కొందరు తాజామాజీలు, మాజీ కౌన్సిలర్లు అధికార పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. టికెట్ గ్యారెంటీతో పార్టీ మారుతున్నట్లు తెలుస్తోంది. నలుగురు లేదంటే ఐదుగురు మాజీలు ఈనెలలోనే అధికార పార్టీలో చేరనున్నట్లు సమాచారం. అందులో ఇద్దరు తాజామాజీలు కాగా మరో ఇద్దరు గత కౌన్సిల్‌లో కౌన్సిలర్లుగా ప్రాతినిధ్యం వహించిన వారు ఉన్నారు. వీరంతా సీనియర్ నాయకులే కావడం గమనార్హం. ఇప్పటికే వీరంతా అధికార పార్టీ ముఖ్యులతో సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తోంది. ఇప్పటికే బీఆర్ఎసకు చెందిన మాజీలు మునిసిపల్ చైర్మన్ అవిశ్వాస తీర్మాన సమయంలో పెద్ద ఎత్తున అధికార పార్టీలో చేరారు. కాంగ్రెసలోనే చాలామంది ఆయా డివిజన్‌లలో పోటీలో ఉండగా, కొత్తవారి రాకను ఇప్పటికే వ్యతిరేకిస్తున్న క్రమంలో టికెట్ల సర్దుబాటు అధికారపార్టీకి తలనొప్పిగా మారనుంది.

# రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

## కలెక్టర్ పమేలా సత్పతి




కరీంనగర్, : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో ప్రమాదాల జరిగే ప్రాంతాలను, జిల్లా యంత్రాంగం తరపున తీసుకోవాల్సిన చర్యలను పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రోడ్లు భవనాలశాఖ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో యూటర్న్‌లు ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ అత్యాధునిక కెమెరాల సహాయంతో ట్రాఫిక్ పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. నిబంధనలు పాటించని వాహనాలను ఈ కెమెరాలు ఆటోమేటిక్‌గా గుర్తిస్తాయని, వాహనదారులపై ట్రాఫిక్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీనివాస్, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్ పాల్గొన్నారు.

**మాదక ద్రవ్యాల నిర్మూలనకు చర్యలు :** మాదకద్రవ్యాల నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లాస్థాయి నార్కో కో–ఆర్డినేటర్ సెంటర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్, ఎక్సైజ్ అధికారులు సమన్వయంతో పని చేస్తూ జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ మాదకద్రవ్యాల నియంత్రణకు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. డ్రగ్ టెస్ట్ కిట్ల ద్వారా నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని, అవసరమైతే డాగ్ స్క్వాడ్ వినియోగిస్తామని తెలిపారు. జిల్లాలో ఈ ఏడాది 13 కేసులు నమోదు చేశామని, 13.8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు.

**బాలలను తల్లిదండ్రులకు చెంతకు చేర్చండి...** ఆపరేషన్ ముస్కాన్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ బాల బాలికలను పని నుంచి విముక్తి కల్పించి తల్లిదండ్రుల చెంతకు చేర్చాలన్నారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా అన్ని పని ప్రదేశాల్లో బాలబాలికలను గుర్తించాలని, వారికి పని నుంచి విముక్తి కల్పించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఇన్‌చార్జి డీడబ్ల్యూవో సబిత, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, డీఈవో మొండయ్య, డీసీపీవో పర్వీన్ పాల్గొన్నారు.

# విద్యా, వైద్యానికే అధిక ప్రాధాన్యం : సీఎం రేవంత్



హైదరాబాద్, : నగరంలోని బంజారాహిల్స్‌లో ఏఐజీ ఆస్పత్రిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. నగర ప్రజలకు రెండో అతిపెద్ద హాస్పిటల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినందుకు డాక్టర్ నాగేశ్వర్ రెడ్డిని అభినందించారు. హైదరాబాద్, తెలంగాణకు నాగేశ్వర్ రెడ్డి గొప్ప పేరు తీసుకొచ్చారని.. ఆయన సేవలను గుర్తించి కేంద్రప్రభుత్వం పద్మవిభూషణ్ ఇచ్చిందని తెలిపారు. నాగేశ్వర్ రెడ్డి భారతరత్నకు అర్హులన్నారు. ఆయనకు భారతరత్న వచ్చేలా తెలంగాణ నుంచి తన వంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు.

66 దేశాల నుంచి పేషంట్స్ ఏఐజీ ఆసుపత్రిలో చికిత్సకు వస్తున్నారని ఇది గర్వకారణమన్నారు.
తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తున్నామని.. అందులో హెల్త్ టూరిజం ఒక చాప్టర్‌గా ఉంటుందని సీఎం తెలిపారు.హైదరాబాద్‌ను హెల్త్ టూరిజం హబ్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తున్నామని.. అందులో భాగంగానే డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని క్యాన్సర్ కేర్ సలహాదారుడిగా నియమించామన్నారు. తెలంగాణ రాష్ట్రం చేపట్టే ప్రణాళికలో డాక్టర్ నాగేశ్వర్ రెడ్డిని కూడా భాగస్వాములు కావాల్సిందిగా ముఖ్యమంత్రి కోరారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 10 లక్షల వరకు ప్రభుత్వం పేదలకు ఉచిత వైద్యం అందిస్తోంద న్నారు. సమస్య రాకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాల్సిన అవసరం ఉందని.. ఇందుకు సరైన విధానంతో ముందుకు వెళుతున్నామని వెల్లడించారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలకు హెల్త్ ప్రొఫైల్ కార్డును క్రియేట్ చేయాలని భావిస్తున్నామన్నారు. ఒక యూనిక్ ఐడీతో ఈ హెల్త్ ప్రొఫైల్ కార్డులు ఉంటాయని తెలిపారు. ఒకప్పుడు ఉన్న ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థపోయి ఇప్పుడు స్పెషలిస్ట్ డాక్టర్స్ రోజులు వచ్చాయన్నారు. హెల్త్ ప్రొఫైల్ క్రియేట్ చేయడం ద్వారా దీన్ని బ్రేక్ చేయొచ్చని సీఎం అన్నారు. ప్రపంచ దేశాలతో పోటీ పడగలుగుతున్నామని చెప్పడానికే మిస్ వరల్డ్ పార్టిసిపెంట్స్‌కు ఏఐజీ హాస్పిటల్ విజిట్ లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి తెలిపారు.

రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రులు నిర్మాణంలో ఉన్నాయన్నారు. గోశామహల్‌లో నూతన ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించబోతున్నామని.. పనులు కూడా ప్రారంభమయ్యాయని అన్నారు. నిర్మాణంలో ఉన్న వివిధ ఆసుపత్రులు పూర్తైతే మొత్తం 7 వేల పడకలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. కార్పొరేట్ ఆసుపత్రులతో పోటీపడి ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందిస్తామని స్పష్టంచేశారు. వైద్య రంగం అభివృద్ధికి రూ. 11500 కోట్లు కేటాయించామని.. రూ. 21500 కోట్లు విద్యా రంగం అభివృద్ధికి కేటాయించామని తెలిపారు. పేదలకు ఉచిత వైద్యం, నాణ్యమైన విద్య అందించాలనే ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నాని పేర్కొన్నారు. వైద్యులు ఏడాదిలో ఒక నెల రోజులు సామాజిక బాధ్యతగా ప్రభుత్వ ఆసుపత్రులలో సేవలందించాలన్నారు. సాంకేతిక రంగంలో ప్రపంచంలో హైదరాబాద్ కూడా ఒక వేదికగా మారిందని అన్నారు. మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి హైదరాబాద్‌కు డైరెక్ట్ కనెక్టివిటీ పెంచేలా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతున్నామని.. కనెక్టివిటీ పెరిగితే హైదరాబాద్ మరింత అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# రేవంత్‌రెడ్డి.. తెలంగాణకు మరణశాసనం రాశాడు : హరీష్‌రావు



హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. బనకచర్లపై అసెంబ్లీలో చర్చకు తాము రెడీ.. సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధమా అని సవాల్ విసిరారు. బనకచర్లపై అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డిని నిలదీస్తామని అన్నారు. ఇవాళ తెలంగాణభవన్‌లో హరీష్‌రావు మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీలో బనకచర్లపై చర్చ జరుగుతున్నప్పుడు తమ మైక్ కట్ చేయకూడదని కోరారు. రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమ ద్రోహి.. సీఎం హోదాలోనూ రేవంత్‌రెడ్డి తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణలు చేశారు మాజీ మంత్రి హరీష్‌రావు. రేవంత్‌రెడ్డి తెలంగాణకు పట్టిన అబద్దాల వైరస్ అని మాజీ మంత్రి హరీష్‌రావు ఎద్దేవా చేశారు. బయట వారికి సద్దులు కడుతూ.. ఇంటి మనిషి కేసీఆర్‌పై నిందలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ .. హైదరాబాద్‌లో కాకుండా అమరావతి నుంచి ఇచ్చినట్లుందని విమర్శించారు.

ఉత్తమ్ పీపీటీ.. ఏపీ సీఎం చంద్రబాబు తయారు చేశాడా అనే అనుమానం కలుగు తోందని అన్నారు. చంద్రబాబు తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకు న్న విషయాన్ని పీపీటీలో ఎందుకు చూపించలేదని ప్రశ్నించారు. అహంకారంతో మాట్లాడితే.. రేవంత్‌ను ప్రజలు పాతాళానికి తొక్కుతారని హెచ్చరించారు. తెలుగుదేశం, చంద్రబాబుతో ఉన్న అనుబంధాన్ని రేవంత్‌రెడ్డి ఇంకా మర్చిపోలేకపోతున్నారని విమర్శించారు మాజీ మంత్రి హరీష్‌రావు.

విభజన హామీల ముసుగులో ప్రజాభవన్ వేదికగా బనకచర్ల ఒప్పందం కుదిరిందని, ప్రజాభవన్ వేదికగా 2024 జులై 6వ తేదీన రేవంత్ తెలంగాణకు మరణశాసనం రాశారని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపణలు చేశారు. సెప్టెంబర్ 23వ తేదీన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సతీసమేతంగా బెజవాడ పోయి బజ్జీలు తిని బనకచర్లకు పచ్చజెండా ఊపారని విమర్శించారు. బీఆర్ఎస్ పోరాటంతోనే కేంద్ర ప్రభుత్వం బనకచర్లకు అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ చచ్చిన పాము అయితే.. ఎందుకు తమపై విమర్శలు చేస్తున్నారని నిలదీశారు. కేసీఆర్ పేరు ఎత్తకుండా ఒక్కసారైనా రేవంత్‌రెడ్డి ఉండగలరా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా కాకుండా.. రేవంత్‌రెడ్డి ఇంకా ప్రతిపక్ష నేత మాదిరిగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇరు రాష్ట్రాలు కూర్చుని ఆమోదయోగ్యంగా మాట్లాడుకుందామని మాత్రమే కేసీఆర్ అన్నారని తేల్చిచెప్పారు మాజీ మంత్రి హరీష్‌రావు.

బీఆర్ఎస్ హయాంలో బనకచర్లపై ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని మాజీ మంత్రి హరీష్‌రావు క్లారిటీ ఇచ్చారు. రేవంత్‌రెడ్డే.. ఉత్తమ్ కుమార్ రెడ్డిని విజయవాడ పంపించారని ఆరోపించారు. చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్క ఎమ్మెల్యే, ఎంపీ సీటు కూడా గెలవలేదని.. అంతమాత్రాన ఆ పార్టీ చచ్చిన పాము అవుతుందా అని ప్రశ్నించారు. చచ్చిన పాము ముచ్చట్లు రేవంత్‌రెడ్డి రాహుల్ గాంధీకి చెప్పుకోవాలని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి చెప్పేవన్నీ అబద్ధాలేనని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర హక్కుల కోసం కాకుండా.. రాజకీయ ప్రయోజనాల కోసమే రేవంత్ మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. బనకచర్లపై మంత్రి ఉత్తమ్ ఇచ్చిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌కు ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలను ఎందుకు పిలవలేదని మాజీ మంత్రి హరీష్‌రావు ప్రశ్నల వర్షం కురిపించారు.

# భూ సమీకరణకు కొత్త చట్టం..

- సరికొత్త నిబంధనలతో రూపకల్పన
- మార్గదర్శకాలకు త్వరలోనే ప్రతిపాదనలు...
- విస్తరిత హెచ్ఎండీఏ పరిధిలో అమలు



హైదరాబాద్ : భూ సమీకరణ పథకం (ల్యాండ్ పూలింగ్ స్కీమ్)కు మరిన్ని సంస్కరణలను జోడించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. విస్తరిత హెచ్ఎండీఏ పరిధిలో అమలు చేయనుంది. భూ సమీకరణ పథకం-2017తో ఆశించిన ప్రయోజనాలు నెరవేరకపోవడంతో ఆస్థానంలో సరికొత్త చట్టాన్ని తీసుకురావాలని భావిస్తోంది. సరికొత్త నిబంధనలు, మార్గదర్శకాలతో ల్యాండ్ పూలింగ్ ఏరియా డెవలప్‌మెంట్ (ఎల్‌పీఏడీ) అనే ముసాయిదా చట్టాన్ని తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకు అవసరమైన మార్గదర్శకాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయడానికి ఓ కన్సల్టెన్సీని నియమించేందుకు హెచ్ఎండీఏ టెండర్లను ఆహ్వానించింది.

**పట్టాభూములకే అవకాశం :** అభివృద్ధి అనేది ఒకే ప్రాంతానికి పరిమితమవ్వకుండా ఔటర్ అవతల మినీ నగరాలు, టౌన్‌షిపలను తీసుకొచ్చేందుకు అప్పటి ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ స్కీమ్-2017 తీసుకువచ్చింది. అయితే దానికి ఆశించిన స్పందన రావడం లేదు. ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌ను 733 ఎకరాలతో ల్యాండ్ పూలింగ్ స్కీమ్‌లో భాగంగా ఉమ్మడి రాష్ట్రంలో చేపట్టగా, అదే తరహాలో స్వరాష్ట్రంలోనూ ఎనిమిదేళ్ల క్రితం తీసుకొచ్చారు. నాటి చట్టం ప్రకారం ఇన్ముల్ నర్వ (95 ఎకరాలు), లేమూరు (84 ఎకరాలు)లో లే అవుట్‌లు అభివృద్ధి చేయగా, ప్రతాపసింగారం (110 ఎకరాలు)లో పనులు చేపట్టాల్సి ఉన్నది. ఈ స్కీమ్ వచ్చిన ఎనిమిదేళ్లలో మూడు ప్రాంతాల్లో 289 ఎకరాలే సేకరించారు. 2017లో ఉన్న కొన్ని నిబంధనలు ప్రభుత్వానికి, రైతులకు ఇబ్బందికరంగా మారాయి. కేవలం పట్టా భూములకే అవకాశం కల్పించారు. అసైన్డ్, సీలింగ్ భూములు సేకరించే అవకాశం లేదు.

**ఇతర రాష్ట్రాల్లో ఉపయుక్తంగా..** దేశంలోని పలు నగరాల్లోని డెవలప్‌మెంట్ అథారిటీలకు ల్యాండ్ పూలింగ్ స్కీమ్ వరంగా మారింది. ప్రధానంగా మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్ తదితర రాష్ట్ర ప్రభుత్వాలు ల్యాండ్ పూలింగ్ స్కీమ్‌కు నోటిఫికేషన్ వేయగానే రైతులు స్వచ్ఛందంగా భూములిచ్చి పరిహారంగా మరోచోట అభివృద్ధి చేసిన మరింత భూమిని తీసుకుంటున్నారు. అక్కడి ప్రభుత్వానికి, స్థానిక సంస్థలకు పెద్దఎత్తున ల్యాండ్ బ్యాంకు అందుబాటులోకి వస్తోంది. ఆయా రాష్ట్రాల్లో ల్యాండ్ పూలింగ్ స్కీమ్‌కు రైతులు, ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తుండడంతో 2017లో రాష్ట్ర ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ స్కీమ్‌ను తెలంగాణలో అమలు చేసేందుకు మార్గదర్శకాలతో ఉత్తర్వులిలిచ్చింది. కానీ ఇప్పటి వరకు కేవలం హెచ్ఎండీఏ పరిధిలో మినహా రాష్ట్రంలో ఎక్కడా ల్యాండ్ పూలింగ్ స్కీమ్‌ను అమలు చేయలేదు. హెచ్ఎండీఏ పరిధిలో కూడా ఆశించిన ప్రయోజనాలు నెరవేరలేదు.

**కొత్త నిబంధనలతో చట్టం :** రాష్ట్రం మొత్తం కాకుండా

విస్తరించిన హెచ్ఎండీఏ పరిధి 10,472 చదరపు కిలోమీటర్లలో ల్యాండ్ పూలింగ్ స్కీమ్‌ను పకడ్బందీగా అమలు చేయడానికి అధికారులు సరికొత్త సంస్కరణలను తీసుకొస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ల్యాండ్‌పూలింగ్ ఏరియా డెవలప్‌మెంట్ (ఎల్‌పీఏడీ) ముసాయిదా చట్టాన్ని తీసుకురావాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. హెచ్ఎండీఏ పరిధిలో జాతీయ, రాష్ట్రీయ రహదారులతో పాటు ప్రధాన ప్రాంతాల రహదారుల వెంట ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి తీసుకురావాలని భావిస్తోంది.

ఈ చట్టానికి అవసరమైన నియమాలు, మార్గదర్శకాలు రూపొందించడానికి ఓ కన్సల్టెన్సీని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం హెచ్ఎండీఏకు ఆదేశాలిచ్చింది. విస్తరించిన హెచ్ఎండీఏ పరిధిని ఆధారంగా చేసుకొని ల్యాండ్‌పూలింగ్ ఏరియా డెవలప్‌మెంట్ ముసాయిదా చట్టం ఉండాలని, ఈ చట్టానికి దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న మార్గదర్శకాలు, నియమాలను జోడించాలని సూచించినట్లు తెలిసింది.

ముసాయిదా చట్టానికి అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయడానికి హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో కన్సల్టెన్సీ నియామకానికి చర్యలు చేపట్టారు. ఆరు నెలల్లో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని టెండర్ నోటిఫికేషన్‌లో నిర్ణయించారు. శివారు ప్రాంతాల్లో ల్యాండ్ బ్యాంక్ పెంచడానికి, టౌన్‌షిపలను తీసుకురావడానికి ల్యాండ్ పూలింగ్ ఏరియా డెవలప్‌మెంట్ (చట్టం) ఉపయుక్తంగా మారుతుందని హెచ్ఎండీఏ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

# చంపుతామని ప్రభుత్వమే ప్రకటించడం అమానవీయం : ఆచార్య హరగోపాల్



హైదరాబాద్ : ప్రభుత్వం వెంటనే కాల్పుల విరమణ ప్రకటించాలి. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని వక్తలు డిమాండ్ చేశారు. బదనకల్ అమరుల 20వ వర్ధంతి సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రూపొందించిన శాంతమ్మ సమర గాథ పాటలను అమరుడు రాజు తల్లి పెద్ది పిచ్చమ్మ ఆవిష్కరించారు. అనంతం ఆచార్య హరగోపాల్ మాట్లాడుతూ.. స్వార్థంతో బతకండి అని వ్యక్తిత్వ వికాసం పేరుతో పుస్తకాలు కూడా వస్తున్నాయి అని ఆందోళన వ్యక్తం చేశారు.

నిస్వార్థ పరులను బలహీనులుగా చూసే పరిస్థితులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఫలానా తేదీలోపు మావోయిస్టు పార్టీని లేకుండా చేస్తామని గడువు పెట్టి మరీ ప్రకటించడం అన్యాయమని విమర్శించారు. ఒక సిద్ధాంతాన్ని విశ్వసించి, సమ సమాజ నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తున్న మావోయిస్టులను చంపి పోలీసులు ఆనందంతో నృత్యం చేయడం అమానుషమని దుయ్యబట్టారు.

ఉమ్మడి ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్ మాట్లాడుతూ.. 2026, మార్చి31 నాటికి మావోయిస్టులను లేకుండా చేస్తామని కాదు, ఈ దేశంలో నిరుద్యోగాన్ని, అవినీతిని నిర్మూలిస్తామని ప్రకటించండి అని సవాల్ విసిరారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిస్తామని ప్రకటించండి. గడువు పెట్టాల్సింది మంచి కోసమే గానీ మనుషులను చంపటానికి కాదని అన్నారు. మానవ హక్కుల వేదిక జాతీయ కన్వీనర్ జీవనకుమార్ మాట్లాడుతూ 1969లో బూటకపు ఎన్ కౌంటర్ హత్యలు మొదలయ్యాయని ప్రస్తావించారు. ఇప్పటి వరకు 4,200 మంది ఎన్ కౌంటర్‌లో చనిపోయినట్లు తెలిపారు.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌కౌంటర్ పేరుతో చంపి, వారి భౌతిక కాయాలను కుటుంబ సభ్యులకు ఇవ్వకపోవడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. మావోయిస్టులు కూడా ఇన్ఫార్మర్ల పేరుతో అమాయకులను చంపే ప్రయత్నం మానుకోవాలని జీవన్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో ఆచార్య భగవంత్ రెడ్డి, ప్రజా గాయని విమలక్క తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు ఉత్సాహంగా పనిచేయాలి

## ఆర్ అండ్ బీ శాఖపై సమీక్షలో మంత్రి కోమటిరెడ్డి




హైదరాబాద్, : రోడ్లు, భవనాల శాఖలో ఎప్పుడూ లేనివిధంగా పదోన్నతులు, బదిలీలను చేసుకున్నామని.. అధికారులు, ఇంజనీర్లు ఉత్సాహంగా పనిచేయాలని ఆ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సూచించారు. ఎర్రమంజిల్‌లోని ఆర్ అండ్ బీ కేంద్ర కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు.

హ్యామ్ రోడ్లు పది ప్యాకేజీలకు సంబంధించిన పనులను ప్రారంభించేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఈఎన్సీ జయభారతిని ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆర్ అండ్ బీ శాఖకు నిధుల విడుదలపై సానుకూలంగా ఉన్నారని తెలిపారు. ఆర్వోబీలు, మెడికల్ కాలేజీలు, టిమ్స్ ఆస్పత్రులు, కలెక్టరేట్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.

# విద్యార్థుల హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలి

## డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క




హైదరాబాద్, : సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లోని విద్యార్థులందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు.

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి ఆయన ప్రజాభవన్‌లో సమీక్ష నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారుల (డీఎం అండ్ హెచ్‌వో)తో కలెక్టర్లు సమన్వయం చేసుకుని విద్యార్థుల హెల్త్ ప్రొఫైల్ కార్డులను రూపొందించాలని డిప్యూటీ సీఎం చెప్పారు.

సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో అధికారుల పర్యటన, సమీక్షపై పకడ్బందీ క్యాలెండర్‌ను తయారు చేయాలని చెప్పారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న హాస్టళ్లపై నివేదికను రూపొందించాలన్నారు. గురుకుల విద్యాలయాల భవనాలపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు, విద్యుత్తు అవసరాలను తీర్చేందుకు అవసరమైన ప్రణాళికను తయారు చేయాలన్నారు. సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఎస్సీ గురుకుల విద్యాలయాల కార్యదర్శి అలుగు వర్షిణి తదితరులు పాల్గొన్నారు.

# సిగాచి ప్రమాదంపై ఎన్‌హెచ్ఆర్‌సీ విచారణ

## సుమోటోగా స్వీకరించిన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్




హైదరాబాద్, పటాన్‌చెరు, : పాశ మైలారంలోని సిగాచి రసాయన పరిశ్రమలో జరిగిన ప్రమాదానికి సంబంధించి జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్ఆర్‌సీ) కేసు నమోదు చేసింది.

న్యాయవాది ఇమ్మనేని రామారావు వేసిన పిటిషన్ ఆధారంగా కంపెనీ బాధ్యులపై ఎన్‌హెచ్ఆర్‌సీ విచారణ చేపట్టనుంది. సిగాచి యాజమాన్య ప్రతినిధులైన చిదంబరం షణ్ముఖనాథన్, గుంతక ధనలక్ష్మి, అమిత్‌రాజ్ సిన్హా, శనివారపు సర్వేశ్వర్‌రెడ్డి, వివేక్‌కుమార్, ఓరుగంటి సుబ్బరామిరెడ్డి, రవీంద్ర ప్రసాద్ సిన్హా, బిందు వినోదాన్‌పై హత్యగా పరిగణింపబడని(కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కేసు నమోదు చేయాలని పిటిషనర్ కోరారు.

కాగా ఈ ఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ స్పందించింది. కేసును సుమోటోగా స్వీకరించింది. పారిశ్రామిక భద్రత చట్టం అమలుతో సహా లోపాలపై సమగ్ర విచారణ జరిపించి నివేదిక అందజేయాలని కోరుతూ అగ్నిమాపక సేవల శాఖ డైరెక్టర్, కార్మిక శాఖ కమిషనర్, సంగారెడ్డి ఎస్పీలకు కమిషన్ నోటీసులు జారీ చేసింది.

# ఏసీబీకి చిక్కిన ఇద్దరు అధికారులు

హైద్రాబ్: లంచం తీసుకుంటూ ఇద్దరు అధికారులు మంగళవారం ఏసీబీకి చిక్కారు. జీహెచ్ఎంసీలోని మూసాపేట సర్కిల్ పరిధిలో ఓ వ్యక్తి తన స్థలం ఆన్‌లైన్ మ్యుటేషన్ చేయాలని కోరితే.. ఆస్తి పన్ను విభాగం సీనియర్ అసిస్టెంట్ ఎం.సునీత రూ.80 వేలు లంచం అడిగారు. మంగళవారం బాధితుడి నుంచి ఆమె రూ.30 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం అంతారం గ్రామ రైతు మల్లయ్య భూమి విరాసత్ కోసం వస్తే.. తహసీల్దార్ నాగార్జున రూ.50 వేలు లంచమడిగాడు.

తహసీల్దార్ కార్యాలయంలో రైతు నుంచి రూ.10 వేలు లంచం తీసుకుంటున్న కార్యాలయ అటెండర్ యాదగిరిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. తహసీల్దార్ నాగార్జున, యాదగిరిని అరెస్టు చేశారు. తహసీల్దార్ పట్టుబడినట్లు తెలుసుకున్న స్థానికులు.. కార్యాలయానికి వచ్చి బాణసంచా పేల్చి, మిఠాయిలు పంచుకున్నారు.

# రెండున్నర నెలల్లో 1,500 కేసుల పరిశీలన

## రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్



నల్లగొండ : రెండున్నర నెలల్లో రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ 1,500 కేసులను పరిశీలించి ఉత్తర్వులు జారీ చేసిందని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ తెలిపారు. జిల్లాకేంద్రంలోని రోడ్లు, భవనాల అతిథి గృహం లో మంగళవారం మీడియా ప్రతినిధులతో ఆయన మా ట్లాడారు. మానవ హక్కులకు భంగం కలిగినప్పుడు వచ్చి న ఫిర్యాదులను మానవ హక్కుల కమిషన్ పరిశీలించి చర్యలు తీసుకుంటుందన్నారు. రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ 2025 ఏప్రిల్ 17వ తేదీన బాధ్యతలు తీసుకుంద ని, తనతో పాటు, మరో ఇద్దరు సభ్యులు కమిషన్‌లో ఉ న్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడైనా మానవ హక్కులు ఉల్లంఘన జరిగినప్పుడు ఆన్‌లైన్ ద్వారా లేదా రాతపూర్వకంగా దరఖాస్తు ఇస్తే వాటిని పరిశీలించి, పూర్తి విచారణ చేసిన తర్వాత చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. విచారణ అనంతరం అవసరమైతే ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని తెలిపారు. పని చేయించుకున్న వారికి వేతనాలు చెల్లించకపోవడం, వారి హక్కులకు, స్వేచ్ఛకు, సమానత్వానికి ఆటంకం కలిగడం, ఇలాంటివన్నీ మానవ హక్కుల ఉల్లంఘన కిందికి వస్తాయ న్నారు. వీటిపై ఫిర్యాదులు వచ్చినప్పుడు వెంటనే స్పందిస్తామని తెలిపారు. కమిషన్ ఛార్జ్ తీసుకున్న సమయంలో 11,500 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, రెండున్నర నెలల కాలంలో 1500 కేసులు పరిశీలించి ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. కొన్ని సుమోటో కేసులు సైతం తీసుకుంటామని, అలాగే బాధి తుల తరఫున ఇచ్చే దరఖాస్తులను సైతం కమిషన్ స్వీకరిస్తుందని తెలిపారు. ముఖ్యంగా విద్య, వైద్య తదితర సంస్థలను సందర్శించి సరైన విధంగా అమలవుతున్నది లేనిది పరిశీలిస్తామ ని తెలిపారు. మానవ హక్కులపై ప్రజలకు అవగాహన కల్పిం చేందుకు మానవ హక్కుల కమిషన్ చర్యలు తీసుకుంటుందని, ప్రతి ఒక్కరికి మంచి విద్య, వైద్యం, సమానత్వం అందాల్సిన బాధ్య త రాజ్యాంగ ప్రకారం ఉందని తెలిపారు.

# కేంద్రం తీరుతో పన్నుల భారం

## మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

గరిడేపల్లి, : కేంద్రంలో బీజేపీ 11 ఏళ్ల పాలనలో సామాన్యులపై అధిక ధరలు, పన్నుల భారం మోపడం తప్ప సాధించిన ప్రగతి ఏమీలేదని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. కీతవారిగూడెంలోని ఓ ఫంక్షనహాల్‌లో నిర్వహించిన ఒక్కరోజు రాజకీయ శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ దేశాభివృద్ధి చెందిందని గొప్పలు చెప్పడం సిగ్గుచేటన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను లేబర్ కోడ్ పేరుతో తొలగించడం సరికాదన్నారు. ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై కార్మికులంతా ఏకమై గళం ఎత్తాలన్నారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో రేవంతరెడ్డి పాలనతో ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు.

కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, షేక్ యాకుబ్, నెమ్మాది వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి, బ్రహ్మం, సైదులు, తుమ్మల సైదయ్య, అర్జున, భిక్షం, శ్రీనివాస్, మట్టయ్య, సుధాకర్, రామస్వామి, వీర రాఘవయ్య, వీరస్వామి పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఎన్నికపై దృష్టి పెట్టాలి: సీఎం రేవంత్‌రెడ్డి




హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఎన్నికపై దృష్టి పెట్టాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఉప ఎన్నికలో మూడు పార్టీలు కలిసి బరిలోకి దిగుతాయని చెప్పుకొచ్చారు. ఉప ఎన్నికను సమర్థవంతంగా ఎదుర్కొవాలని దిశానిర్దేశం చేశారు. గాంధీభవన్‌లో టీపీసీసీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఇన్‌చార్జీ మంత్రులు ప్రతి అంశాన్నీ సీరియస్‌గా తీసుకోవాలని ముఖ్యమంత్రి మార్గనిర్దేశం చేశారు. క్రమశిక్షణ విషయంలో సీరియస్‌గా ఉండాలని ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీ పదవులు వెంటనే భర్తీ చేయాలన్నారు. పార్టీ కమిటీల్లో అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రమశిక్షణ విషయంలో సీరియస్‌గా ఉండాలని హుకుం జారీ చేశారు. పార్టీ పదవులు భర్తీ చేయడంలో టీపీసీసీ చీఫ్ ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. లోకల్ బాడీ ఎన్నికల్లో నేషనల్ నరేటివ్ బిల్డప్ చేసుకోవాలని సూచించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఇచ్చేందుకు సాధ్యమైనంత వరకు ప్రయత్నం చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.


దేశంలోనే అన్నిరాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. కేంద్రప్రభుత్వం మెడలు వంచి జనగణనలో కులగణన చేసేలా చేయడంలో మనం విజయం సాధించామని వ్యాఖ్యానించారు. విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పనలో మనం చాలా విజయాలు సాధించామని చెప్పుకొచ్చారు. తాను టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో 45 లక్షల మందితో క్రియాశీలక సభ్యత్వం చేయించానని గుర్తుచేశారు. యూత్ కాంగ్రెస్, NSUI, పార్టీ జిల్లా అధ్యక్షుల్లో చాలా మందికి కాంగ్రెస్ ప్రభుత్వంలో పదవులు వరించాయని స్పష్టం చేశారు సీఎం రేవంత్‌రెడ్డి.

పార్టీ పదవులను క్యాజువల్‌గా తీసుకోవద్దని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. పార్టీ పదవులతోనే నేతలకు గుర్తింపు, గౌరవమని ఉద్ఘాటించారు. రాజకీయాల్లో నేతల ఎదుగుదలకు ఇది చాలా ఉపయోగపడుతుందని చెప్పుకొచ్చారు. రాబోయే రోజుల్లో అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు పెరగబోతున్నాయని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లు, జమిలి ఎన్నికలు ప్రభావితం చేయబోతున్నాయని చెప్పుకొచ్చారు. నూతన నాయకత్వానికి 2029 ఎన్నికలు వేదిక కావాలని సూచించారు. మీరు నాయకులుగా ఎదగాలంటే ఇప్పటి నుంచే కష్టపడాలని మార్గనిర్దేశం చేశారు. గ్రామాలకు వెళ్లి క్షేత్రస్థాయిలో పర్యటించి సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు సీఎం రేవంత్‌రెడ్డి.

మన ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. మనందరం కలిసి కట్టుగా ఈరోజు నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకుని కష్టపడి మళ్లీ రెండోసారి కాంగ్రెస్‌ని అధికారంలోకి తీసుకురావాలని సూచించారు. తెలంగాణలో వచ్చే పదేళ్లు కాంగ్రెస్‌దే అధికారమని ధీమా వ్యక్తం చేశారు. సుదీర్ఘ కాలం ప్రజాప్రతినిధిగా ఎన్నికైన అరుదైన ఘనత మల్లికార్జున ఖర్గేదని కొనియాడారు. ఖర్గేని నేతలు స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్లాలని సూచించారు. పార్టీ పదవితోనే అందరికీ గౌరవం, గుర్తింపు వస్తాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# బనకచర్లపై తమ వాదనతో ఏకీభవించిన కేంద్రం

## నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్, : ఏపీ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్ట్‌పై ప్రతిపక్షాలు బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నాయని తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. మంగళవారం ప్రజా భవన్‌లో బనకచర్లపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లతోపాటు ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కృష్ణా నదిలో ఏపీకి ఎక్కువ నీళ్లు ఇచ్చేందుకు గత ప్రభుత్వం ఒప్పుకొని తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ తీరని ద్రోహం చేసిందని మండిపడ్డారు.

గోదావరి జలాలను రాయలసీమకు తరలించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రయత్నాలు మొదలయ్యాయిని ఆయన గుర్తు చేశారు. అంతేకాకుండా తమ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. అయితే బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణాన్ని అడ్డుకునేందుకు తాము చేసిన ప్రయత్నం ఫలించిందన్నారు. తమ వాదనతో కేంద్రం ఏకీభవించిందని స్పష్టం చేశారు. ఏపీ ప్రభుత్వం పంపిన బనకచర్ల లింక్ ప్రాజెక్ట్ ప్రతిపాదనను కేంద్రం వెనక్కి పంపిందని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు.

# ఆలయాల అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

ములుగు: ములుగు నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. దేవాలయాల అభివృద్ధి కోసం రూ.1.42 కోట్లు మంజూరు చేసింది. మంత్రి సీతక్క విజ్ఞప్తితో నిధులు మంజూరయ్యాయి. సీజీఎఫ్ నిధుల నుంచి రూ.1.42 కోట్లు మంజూరు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. గోవిందరావు పేట మండలం బుస్సాపూర్ జానకి రామాలయానికి రూ.12 లక్షలు, కొత్తగూడ మండలం గుంజేడులోని ముసలమ్మ ఆలయానికి రూ. 50 లక్షలు మంజూరు చేసింది తెలంగాణ ప్రభుత్వం.

ములుగు మండలం జగ్గన్నపేట పుట్టా మల్లిఖార్జున స్వామి దేవాలయానికి రూ.30 లక్షలు, మల్లంపల్లిలోని వెంకటేశ్వరస్వామి దేవాలయానికి రూ.20 లక్షలు, ములుగు పట్టణంలోని నాగేశ్వరస్వామి దేవాలయానికి రూ.20 లక్షలు, రామాలయానికి రూ.10 లక్షలు మంజూరు చేసింది. త్వరలో టెండర్లు పిలిచి ఆలయ అభివృద్ధి పనులను నిర్వాహకులకు దేవదాయ శాఖ అధికారులు అప్పగించనున్నారు. నిధుల మంజూరుకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు మంత్రి సీతక్క కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రధాని మోదీ చెప్పేవన్నీ అబద్ధాలే: ఖర్గే



హైదరాబాద్, : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినట్లే.. కేంద్రంలో సైతం కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరుతుందని ఏఐసీసీ అధ్యక్షులు, ఎంపీ మల్లికార్జున్ ఖర్గే విశ్వాసం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయ సమరభేరి సభలో భాగంగా పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. దేశ ప్రజలకు ప్రధాని మోదీ చెప్పేవన్నీ అబద్ధాలేనన్నారు. దేశానికి ప్రధాని మోదీ, కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా చాలా చాలా చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

కానీ వాళ్లు ఈ దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి చేసిందేమిటని సూటిగా ప్రశ్నించారు. నెహ్రూ, ఇందిరాగాంధీ హయాంలోనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందన్నారు. ఇప్పటి వరకు ప్రధాని మోదీ 42 దేశాలు తిరిగారని గుర్తు చేశారు. కానీ ప్రజలు చనిపోతున్నా.. మణిపూర్ రాష్ట్రానికి మాత్రం ఆయన వెళ్లలేదని మండిపడ్డారు. పాకిస్థాన్‌ను ఏదేదో చేస్తామని మోదీ ప్రభుత్వం ప్రకటించారన్నారు. కానీ ఎందుకు ఏం చేయలేదని మోదీ ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. పాకిస్తాన్‌పై యుద్ధం చేయకుండా.. మిమ్మల్ని ఎవరు ఆపారంటూ సందేహం వ్యక్తం చేశారు.

ప్రధాని మోదీలాగా ఇందిరా గాంధీ ప్రధానిగా భయపడ లేదన్నారు. ఎవరు వచ్చినా బంగ్లాదేశ్‌కు స్వాతంత్ర్యం కల్పిస్తామని ఇందిరాగాంధీ ప్రకటించారని.. అదే పని ఆమె చేసి చూపించారన్నారు. క్షమాపణలు చెప్పడమే బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల పని అంటూ ఆయన ఎద్దేవా చేశారు. రాజ్యాంగం నుంచి లౌకిక అనే పదాన్ని తీసి వేయాలని బీజేపీ చూస్తోందని విమర్శించారు. సెక్యులర్ అనే పదం రాజ్యాంగంలోనే లేదని బీజేపీ చెపుతుందన్నారు.

రాజ్యాంగం నుండి లౌకిక పదాన్ని తీసేయారని తాను చాలెంజ్ చేస్తున్నానని ఈ సందర్భంగా ఖర్గే ప్రకటించారు. సెక్యులర్ అనే పదం బీజేపీ ప్రణాళికలో రాసుకున్నారని వివరించారు. సెక్యులర్ అనే పదంతో మీకు ఇబ్బంది ఉంటే మీ పార్టీ ప్రణాళిక నుంచి తీసివేయాలని బీజేపీ అగ్రనేతలకు ఖర్గే బహిరంగ సవాల్ విసిరారు.

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కష్టపడి పని చేశారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలిచిందంటే.. అది కార్యకర్తల కృషి ఫలితమేనని స్పష్టం చేశారు. రేవంత్, భట్టి, మంత్రులు కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేశారన్ని వివరించారు. కేసీఆర్, బీజేపీ కలిసి తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అడ్డుకుంటున్నారన్నారు. కానీ తెలంగాణ ప్రజలు మాత్రం ఈ రెండు పార్టీలను ఓడించారని గుర్తు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని గతంలో తాను చెప్పానని వివరించారు. కాంగ్రెస్ హయాంలోనే తెలంగాణలో 50కిపైగా కేంద్ర సంస్థలు వచ్చాయని గుర్తు చేశారు. తెలంగాణకు ఈ 11 ఏళ్లలో ఏం ఇచ్చారంటూ ప్రధాని మోదీని ఈ సందర్భంగా ఖర్గే సూటిగా ప్రశ్నించారు.

# గ్రీన్ ట్రాన్స్‌ఫర్మేషన్ దిశగా అడుగులు వేస్తున్నాం
## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్: గ్రీన్ టెక్నాలజీని ప్రోత్సహించేందుకు, గ్రీన్ ట్రాన్స్‌ఫర్మేషన్ దిశగా మోదీ ప్రభుత్వం అడుగులు వేస్తోం దని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఉద్ఘాటించారు. ఇందుకోసం కోల్ గ్యాసిఫికేషన్, రెన్యూవబుల్ ఎనర్జీ డైవర్సిఫికేషన్, పెద్దమొత్తంలో మొక్కల పెంపకం, తవ్వకం పూర్తయిన గనుల రీపర్పసింగ్ వంటివాటిపై మోదీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పుకొచ్చారు. హైదరా బాద్‌లో అట్టహాసంగా వరల్డ్ మైనింగ్ కాంగ్రెస్ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకి కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సదస్సులో జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.

ప్రపంచవ్యాప్తంగా అమలవుతున్న సుస్థిర మైనింగ్ పద్ధతులను తెలుసుకోవడంలో వరల్డ్ మైనింగ్ కాంగ్రెస్ సదస్సు చాలా కీలకమని కిషన్‌రెడ్డి వెల్లడించారు. మైనింగ్ రంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం చాలా అవసరమని వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో కేంద్రప్రభుత్వం ఈ దిశగా కీలక నిర్ణయాలు తీసుకుందని ఉద్ఘాటించారు. బొగ్గు, గనుల రంగం ఆత్మనిర్భరత సాధించాలంటే ప్రపంచస్థాయి ఆలోచనల అమలు అవసరమని చెప్పుకొచ్చారు. ప్రకృతిని, ప్రజలను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తేనే సుస్థిర మైనింగ్ సాధ్యమని తెలిపారు. బొగ్గు, ఇతర మినరల్స్ ఉత్పత్తి, ప్రజాసంక్షేమం, పర్యావరణ పరిరక్షణ, సాంకేతికతకు ప్రోత్సాహం అందించడం మోదీ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని ఉద్ఘాటించారు కిషన్‌రెడ్డి.

ఉత్పత్తి చేయడం ఎంత ముఖ్యమో.. బాధ్యతా యుతంగా మైన్ క్లోజర్‌పై దృష్టిపెట్టడం కూడా చాలా కీలకమని కిషన్‌రెడ్డి చెప్పుకొచ్చారు. ఇందుకోసం సింగిల్ విండో సిస్టం తీసుకొచ్చామని అన్నారు. ఇందుకోసం త్వరగా అనుమతులను మంజూరు చేస్తున్నామని చెప్పారు.

గనుల కోసం భూములు ఇస్తున్న వారికి అవసరమైన ఉపాధి అవకాశాలు కల్పించడం, వారి జీవన ప్రమాణాలను పెంచేందుకు మోదీ సర్కార్ కృషిచేస్తోందని చెప్పుకొచ్చారు. ఇన్సెంటివ్స్ ఇస్తున్నాం, పరిశోధనలకు, అధునాతన సాంకేతికతను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లొరేషన్ ట్రస్ట్ ద్వారా ఎక్స్‌ప్లొరేషన్‌ను మరింతగా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ప్రైవేట్ సంస్థలను కూడా ఎక్స్‌ప్లొరేషన్ చేసేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# స్థానికంలో 80% స్థానాలు బీఆర్ఎస్‌కే: కవిత



హైదరాబాద్, : కాంగ్రెస్ పనితీరుపై ప్రజలు విసిగిపోయి ఉన్నారని, ఇది బీఆర్ఎసకు ఉపయోగపడనుందని, రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే.. 80శాతం స్థానాల్లో గులాబీ పార్టీ గెలిచే అవకాశాలు ఉన్నాయని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్లకుంట్ల కవిత పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించడం కోసం తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 17న రైల్‌రోకో చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆమె తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు.

స్థానిక ఎన్నికల్లో జాగృతి నాయకులు ఎవరైనా.. పోటీచేయాలని భావిస్తే.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి విజ్ఞప్తిచేయాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే కేటీఆర్‌కు లేఖ రాయాలని తాను జాగృతి కార్యకర్తలకు విజ్ఞప్తి చేశానని చెప్పారు. జాగృతి ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలకు బీఆర్ఎస్ నాయకులు కూడా వస్తున్నారని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే స్పష్టతనివ్వాలని కోరారు.

# అన్ని రంగాల్లో మహిళలకు గౌరవం దక్కాలి : జస్టిస్ సుజోయ్‌పాల్




హైదరాబాద్, : అన్ని రంగాల్లో మహిళలకు సరైన ప్రాతినిధ్యం, గౌరవం దక్కాలని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ అన్నారు. మధ్యప్రదేశ్‌లో మహిళా న్యాయమూర్తుల సంఖ్య 50 శాతం దాటిందని, భవిష్యత్తులో పురుషులే రిజర్వేషన్ కోరాల్సిన అవసరం రావచ్చని పేర్కొన్నారు. హైకోర్టు జెండర్ సెన్సిటైజేషన్ అండ్ ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం కార్యక్రమాన్ని గురువారం హైకోర్టు బార్ అసోసియేషన్‌లో నిర్వహించారు.

ఈ సందర్భంగా జస్టిస్ పాల్ మాట్లాడుతూ తెలంగాణలో సైతం మహిళా న్యాయమూర్తుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, రిజర్వేషన్ లేకుండానే హైకోర్టులో 30 శాతం కంటే ఎక్కువ మంది మహిళా న్యాయమూర్తులు ఉన్నారని పేర్కొన్నారు. కమిటీ చైర్‌పర్సన్ జస్టిస్ మాధవీదేవి మాట్లాడుతూ.. హైకోర్టులో లింగ వివక్ష లేకుండా చూడటంతోపాటు ఫిర్యాదులపై విచారణ చేపట్టేందుకు ఈ కమిటీ ఏర్పాటైందని తెలిపారు. దీనికి కేవలం రెండు ఫిర్యాదుల మాత్రమే వచ్చాయని, వాటిని సైతం పరిష్కరించామని పేర్కొన్నారు. కమిటీ సభ్యురాలు జస్టిస్ శ్రీదేవి మాట్లాడుతూ మహిళలకు గౌరవప్రదమైన పని వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ ఛైర్మన్ నర్సింహారెడ్డి, టీహెచ్‌సీఏఏ అధ్యక్షుడు ఏ జగన్ పాల్గొన్నారు.

# చేనేత రుణమాఫీ !

- ప్రస్తుతం రూ.లక్ష లోపు రుణాలకే రూ.33 కోట్లు మంజూరు
- ఉమ్మడి జిల్లాలో 3,326 మందికి.. రూ.26.68 కోట్ల ఆర్థిక ప్రయోజనం
- కార్మికుల్లో ఆనందోత్సాహాలు



భూదానపోచంపల్లి : రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు శుభవార్త అందించింది. సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న రుణమాఫీని అమలుచేస్తూ, ఈ పథకం కోసం రూ.33 కోట్లు విడుదల చేసింది. దీంతో చేనేత కార్మికులకు గొప్ప ఆర్థిక ఊరట లభించింది. రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న కార్మికులందరికీ లబ్ధి చేకూరనుంది. రాష్ట్రవ్యాప్తంగా 6,600 మంది చేనేత కార్మికులు ప్రయోజనం పొందుతుండగా, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3,326 మందికి రూ.26.68 కోట్ల ఆర్థిక ప్రయోజనం చేకూరనుంది.

చేనేత కార్మికులకు ఊరటనిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం కీలకనిర్ణయం తీసుకుంది. కార్మికులను రుణవిముక్తులను చేస్తూ 2025-26 బడ్జెట్ నుంచి రూ.33కోట్ల నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయాన్ని చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2017 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు చేనేత కార్మికులు తీసుకున్న రుణాలకే మాఫీ వర్తిస్తుంది. చేనేత వృత్తిపై తీసుకున్న రుణాలు, చేనేత వస్త్రాల ఉత్పత్తికి, వృత్తి సంబంధ కార్యకలాపాలు, ముద్ర రుణాలన్నింటికీ మాఫీ కానున్నాయి. యాదాద్రి-భువనగిరి జిల్లాలో ఆయా బ్యాంకుల్లో రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న 1,162 మంది చేనేత కార్మికులకు రూ.8.04 కోట్ల రుణమాఫీ జరుగనుంది. వీరితోపాటు మరో 1,560 మంది రూ.లక్షకు పైగా రుణాలు తీసుకున్నారు. వీరికి సైతం రూ.15.60 కోట్లు రుణమాఫీ వర్తించనుంది. యాదాద్రి-భువనగిరి జిల్లాలో మొత్తం 2,722 మంది కార్మికులకు రూ.23.64కోట్ల రుణవిముక్తి లభించనుంది. అయితే నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో కలిపి మొత్తం 604 మంది చేనేత కార్మికులకు రూ.3.04 కోట్ల రుణమాఫీ కానుంది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో మొత్తం 3,326 మంది చేనేత కార్మికులకు రూ.26.68 కోట్ల రుణమాఫీ జరుగనుంది.

చేనేత రుణమాఫీపై సర్కారు తిరకాసు! చేనేత రుణమాఫీపై కాంగ్రెస్ సర్కారు తిరకాసు పెడుతోంది. అసలుకే మాఫీ చేసి, మిత్తికి మంగళం పాడేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ మేరకు చేనేత రుణమాఫీపై జరుగుతున్న కసరత్తులో ఈ విషయం వెల్లడైంది. దీంతో రూ.లక్ష లోపు రుణాలు పొందిన చేనేత కార్మికులు ఆందోళన చెందుతున్నారు. బ్యాంకుల నుంచి

పొందిన రుణంలో అసలు రూ.లక్ష వరకు మాత్రమే మాఫీ చేయడానికి చర్యలు చేపట్టినట్లు సమాచారం. అసలుపై పెరిగిన వడ్డీని రుణగ్రహీత తిరిగి బ్యాంకులకు చెల్లిస్తేనే రుణం పొందిన అసలు సొమ్ము మాఫీ జరుగుతుందని అధికారులు తేల్చి చెబుతున్నారు.

ఉదాహరణకు ఒక కార్మికుడు బ్యాంకు నుంచి రూ.90వేలు రుణం తీసుకుంటే దానికి వడ్డీ రూ.25 వేలు అయింది. అసలు వడ్డీ కలిపితే రూ.1.15 లక్షలు అవుతుంది. అయితే బ్యాంకు నుంచి పొందిన రుణం రూ.90వేలకు మాత్రమే ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని సమాచారం. వీడ్డ మొత్తం రూ.25వేలు కార్మికుడు చెల్లించాల్సి ఉంటుంది. మిగ తావారికి కూడా అసలు మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తు ండగా, వడ్డీ కార్మికులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఏదేమైనా ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీ చేయడంపై కార్మికులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేరుగా ఖాతాల్లోనే జమవుతాయి రూ.లక్షలోపు ఉన్న రుణాలున్న వార ందరికీ రుణమాఫీ అవుతుంది. రూ.లక్ష కంటే ఎక్కువ ఉన్న రుణమొత్తాన్ని చెల్లిస్తే వారికి రుణమాఫీ వర్తిస్తుంది. రూ.లక్షలోపు రుణం ఉన్నవారికి గడువులో చెల్లించిన వారికి ప్రయోజనకరం. రుణమాఫీ డబ్బులు నేరుగా చేనేత కార్మికుల ఖాతాలో జమవుతాయి. – శ్రీనివాస్‌రావు, చేనేత, జౌళీశాఖ ఏడీ, యాదాద్రిజిల్లా

# ఈఈలుగా పదోన్నతులు కల్పించండి

## మంత్రి ఉత్తమ్‌ను కోరిన 2004 బ్యాచ్ ఇంజనీర్లు



హైదరాబాద్, : డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (డీఈఈ)లుగా 12–13 ఏళ్ల నుంచి పనిచేస్తున్న వారిని తక్షణమే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు(ఈఈ)లుగా పదోన్నతి కల్పించాలని 2004 బ్యాచ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇంజనీర్లు ప్రభుత్వాన్ని కోరారు. నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ని కలిసి, వినతిపత్రాన్ని అందించారు. శాఖలో తమకంటే జూనియర్లకు ఈఈలుగా పూర్తి అదనపు బాధ్యతలు కట్టబెట్టారని, ఈ నియామకాలన్నీ రద్దు చేయాలని కోరారు. భవిష్యత్తులో ఎఫ్ఏసీలుగా జూనియర్లకు అవకాశం ఇవ్వకుండా రెగ్యులర్ ప్రాతిపదికన పదోన్నతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. 2009 తర్వాత రెగ్యులర్ ప్యానల్ లిస్టు సిద్ధం కాలేదని, తక్షణమే 2004 బ్యాచ్ డిప్యూటీ ఈఈలకు పదోన్నతులు కల్పించి, న్యాయం చేయాలని కోరారు. పదోన్నతుల అంశాన్ని వెనువెంటనే పరిష్కరిస్తామని మంత్రి వారికి భరోసా ఇచ్చారు.

# 9 ఉమ్మడి జిల్లాలు.. 373 రోడ్లు !

- **హ్యామ్ విధానంలో తొలుత నిర్మించే రోడ్లు ఇవే**
- **ప్యాకేజీలు జిల్లాల వారీగానా? సర్కిళ్ల ప్రకారమా?**
- **కసరత్తు చేస్తున్న ఆర్ అండ్‌బి.. త్వరలో సీఎంకు నివేదిక**



హైదరాబాద్, : హైబ్రిడ్ యాన్యునిటీ మోడ్ (హ్యామ్) విధానంలో హైదరాబాద్ మినహా మిగిలిన 9 ఉమ్మడి జిల్లాల్లో మొత్తం 373 రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. ఇందులో కొన్ని కొత్తవి కాగా, మరి కొన్ని ఇప్పటికే ఉన్న డబుల్ రోడ్లను నాలుగు లేన్లుగా విస్తరించనున్నారు. తొలిదశలో నిర్మించనున్న రోడ్లకు బిడ్ ప్రాజెక్టు కాస్ట్ కింద రూ.6,478కోట్లు అవసరమవు తాయని ఆర్‌అండ్‌బీ ప్రాథమికంగా అంచనా వేసింది. హ్యామ్ విధానంలో అభివృద్ధి చేయనున్న రోడ్లపై ప్రస్తుతం ట్రాఫిక్ రద్దీ ఎలా ఉందన్న అంశంపై ఇప్పటికే అధ్యయనం పూర్తయింది. ఈ మేరకు అధిక ట్రాఫిక్ రద్దీ ఉన్న పలు రోడ్లను గుర్తించింది. భువనగిరి- చిట్యాల, వనపర్తి- జడ్చర్ల, నాగర్‌కర్నూల్‌లో ఒక రోడ్డు, మన్ననూర్ మార్గంలో ఒకటి, మహబూబ్‌నగర్- వనపర్తి, తల్లాడ- భద్రాచలం, ఖమ్మం- ఇల్లందు, చంద్రుపట్ల రోడ్డు, నారాయణ పేట-మక్తల్, గద్వాల-ఎర్రగిరి రోడ్డు, మరికల్ రోడ్డు, హన్మకొండ-నర్సంపేట, మెదక్-వడియారం రోడ్లపై ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్నట్టు అధ్యయనంలో తేల్చారు. ప్రస్తుతం ఈ రోడ్లు రెండు వరుసలతో ఉండగా.. నాలుగు వరుసలుగా నిర్మించాలని, అవసరమైన చోట 7ప్లస్ పావ్‌షోల్డర్ (ఇది ఆర్‌అండ్‌బీలో వినియోగించే సాంకేతిక పదం) విధానంలో అభివృద్ధి చేయాలని ప్రాథమికంగా నిర్ణయించింది. కాగా, హ్యామ్ విధానంలో రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టేందుకు నాలుగు విధానాలపై అర్ అండ్ బీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. వీటిలో మొదటిది ఉమ్మడి జిల్లా వారీగా రోడ్లను నిర్మిస్తే.. ఎలా ఉంటుదన్న దానిపై చర్చిస్తున్నారు.

దీని ప్రకారం హైదరాబాద్ మినహా మిగిలిన 9 ఉమ్మడి జిల్లాల్లో 373 రోడ్ల నిర్మాణానికి బిడ్ ప్రాజెక్టు కాస్ట్ కింద రూ.6,478కోట్లు అవసరమని తేల్చారు. వీటిలో అధికంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 909 కి.మీ మేర 46 రోడ్లు, నల్లగొండలో 53 రోడ్లను 699కి.మీ మేర అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. ఇలా మిగిలిన జిల్లాల్లోనూ లెక్కలను తీశారు. ఇక, ప్యాకేజీల వారీగా అయితే మొత్తం కిలోమీటర్లను 14 ప్యాకేజీలుగా విభజించారు. వీటిలో ఏవైనా ప్యాకేజీలు పెద్దగా ఉన్నాయనుకుంటే రెండుగా విభజించాలని నిర్ణయించారు. ఇక, సర్కిళ్ల వారీగా అయితే మొత్తం కిలోమీటర్లను 16 ప్యాకేజీలు, క్లస్టర్ల వారీగా పనులు చేయాలంటే... 27 ప్యాకేజీలుగా లెక్క తేలినట్లు తెలిసింది. ఈ విధానాల్లో సర్కిళ్ల ప్రకార మైతే ఇబ్బంది లేకుండా ఉంటుందని, టెండర్ల ప్రక్రియ నుంచి పనుల నిర్వహణ దాకా ఎక్కడా జాప్యం జరగదని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు సమగ్ర వివరాలతో నివేదిక రూపొందించి, సీఎంకు అందించనున్నారు. సీఎం నిర్ణయం మేరకు స్పష్టత రానుంది.

**'హ్యామ్' పర్యవేక్షణకు బృందం** హ్యామ్ విధానంలో అభివృద్ధి చేయనున్న రోడ్ల పర్యవేక్షణకు ఆర్‌అండ్‌బీ శాఖ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఒక చీఫ్ ఇంజనీర్, ఒక సూపరింటెండెంట్ ఇంజనీర్, ఇద్దరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఇద్దరు డిప్యూటీ ఇంజనీర్లు, ముగ్గురు జూనియర్ టెక్నికల్ ఆఫీసర్లతోపాటు మరో ఇద్దరు, ముగ్గురు సిబ్బంది కలిపి మొత్తం 12-13 మందితో ఈ బృందాన్ని నియమించినట్లు తెలిసింది.

# హైకోర్టుకు కొత్తగా నలుగురు జడ్జిలు !

- సుద్దాల చలపతిరావు, గౌస్ మీరా మొహియుద్దీన్, వాకిటి రామకృష్ణారెడ్డి, గాడి ప్రవీణ్‌కుమార్
- ఇప్పటివరకు న్యాయవాదులుగా హైకోర్టులో సేవలు
- కేంద్రానికి పేర్లు సిఫారసు చేసిన సుప్రీంకోర్టు కొలీజియం
- ఏపీ సహా మరో 4 రాష్ట్రాలకూ కొత్త న్యాయమూర్తులు



హైదరాబాద్/న్యూఢిల్లీ, : తెలంగాణ హైకోర్టుకు కొత్తగా నలుగురు న్యాయమూర్తులు నియామకం కానున్నారు. హైకోర్టు న్యాయవాదులు గౌస్ మీరా మొహియుద్దీన్, సుద్దాల చలపతిరావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గాడి ప్రవీణ్‌కుమార్‌లను హైకోర్టు జడ్జిలుగా నియమించాలంటూ సుప్రీంకోర్టు కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. అలాగే ఏపీ సహా మరో నాలుగు రాష్ట్రాల హైకోర్టులకూ న్యాయమూర్తుల నియామకానికి సిఫారసు చేసింది. రాష్ట్రపతి ఆమోదం లభించిన తర్వాత వీరు న్యాయమూర్తులుగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. రాష్ట్ర హైకోర్టులో 42 మంది జడ్జిలు ఉండాలి. ప్రస్తుతం 26 మంది ఉన్నారు. కొత్తగా నలుగురిని నియమిస్తే ఈ సంఖ్య 30కి చేరనుంది.

గౌస్ మీరా మొహియుద్దీన్: హైదరాబాద్‌లోని బాలానగర్‌కు చెందిన గౌస్ మీరా మొహియుద్దీన్ 1969లో జన్మించారు. 1993లో ఉమ్మడి ఏపీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. ఉమ్మడి ఏపీ బార్ కౌన్సిల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేయడంతోపాటు ప్రత్యేక తెలంగాణ హైకోర్టు ఏర్పడిన తర్వాత తెలంగాణ బార్ కౌన్సిల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా ఇప్పటివరకు కొనసాగుతున్నారు.

సుద్దాల చలపతిరావు: జనగామకు చెందిన సుద్దాల చలపతిరావు 1971 జూన్ 25న జన్మించారు. ఉమ్మడి ఏపీ బార్ కౌన్సిల్‌లో 1998లో న్యాయవాదిగా నమోదు చేసుకున్న ఆయన.. న్యాయవాది వై.రామారావు చాంబర్స్‌లో జూనియర్‌గా 2004 వరకు పనిచేశారు. హైకోర్టు, రంగారెడ్డి, సిటీసివిల్ కోర్టుల్లో ప్రాక్టీస్ చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ సహా పలు సంస్థలకు స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేశారు.

వాకిటి రామకృష్ణారెడ్డి: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం కొండమడుగులో 1970 సెప్టెంబరు 14న జన్మించారు. బీకాం, ఎల్ఎల్‌బీ పూర్తిచేసిన ఆయన 1997లో న్యాయవాదిగా ఉమ్మడి ఏపీ బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్నారు. సీనియర్ న్యాయవాది ఎ.అనంతారెడ్డి ఆఫీసులో జూనియర్‌గా ప్రాక్టీస్ ప్రారంభించారు. 2005 నుంచి సొంతంగా ప్రాక్టీసు ప్రారంభించారు. ఉమ్మడి ఏపీ హైకోర్టు, ఆ తర్వాత తెలంగాణ, ఏపీ హైకోర్టులు, సిటీసివిల్, రంగారెడ్డి, సికింద్రాబాద్ కోర్టుల్లో వకాలత్ చేశారు. పలు కేంద్ర ప్రభుత్వ సంస్థలకు ప్రాతినిధ్యం వహించిన ఆయన ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తరఫు న్యాయవాదిగా కొనసాగుతున్నారు.

గాడి ప్రవీణ్‌కుమార్: నిజామాబాద్ జిల్లా భీంగల్‌లో 1971లో జన్మించారు. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి లా డిగ్రీ, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎల్‌ఎల్‌ఎం పూర్తిచేశారు. ఉమ్మడి ఏపీ బార్ కౌన్సిల్‌లో 1998లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వంలోని రక్షణ, హోం, కార్మిక, ఉపాధి శాఖల తరఫున ప్రాతినిధ్యం వహించారు. ఈడీ, ఇండియా మింట్, సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ వంటి అనేక కేంద్ర ప్రభుత్వ సంస్థల తరఫున ప్రాతినిధ్యం వహించి ప్రస్తుతం డిప్యూటీ సొలిసిటర్ జనరల్‌గా పనిచేస్తున్నారు.

**ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ఒక న్యాయమూర్తి** : ఆంధ్రప్రదేశ్ సహా నాలుగు రాష్ట్రాల హైకోర్టులకు కొత్త జడ్జిల నియామకానికి సుప్రీం కొలీజియం సిఫారసు చేసింది. ఏపీ హైకోర్టుకు తుహిన్ కుమార్ నియామకానికి సిఫారసు చేసింది. అలాగే ఢిల్లీ హైకోర్టుకు ఇద్దరు న్యాయాధికారుల్ని, రాజస్థాన్ హైకోర్టుకు న్యాయవాది అనురూప్ సింఘీ, ఓ జ్యుడీషియల్ అధికారిన్ని, మధ్యప్రదేశ్ హైకోర్టుకు ఐదుగురు జ్యుడీషియల్ అధికారులన్ను, పంజాబ్–హరియాణాకు పదిమంది జ్యుడీషియల్ అధికారులను సిఫారసు చేస్తూ కొలీజియం నిర్ణయం తీసుకుంది.

# కేటీఆర్ ఆదేశాలతోనే నిధులు విడుదల చేశాం !

- **ఎఫ్ఈవోకు నిధులు మంజూరు చేయమని ఆయన మెసేజ్ చేశారు**
- **ఆర్థిక శాఖ అనుమతి కావాలని చెబితే.. తానే చూసుకుంటానన్నారు**
- **ఏసీబీ ఎదుట ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్ వాంగ్మూలం !**



హైదరాబాద్, : ఫార్ములా ఈ కారు రేసులో విదేశీ కంపెనీ ఫార్ములా ఈ ఆపరేషన్స్‌కు నిధుల చెల్లింపు విషయంలో ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్‌ను ఏసీబీ అధికారులు గురువారం ఆరు గంటల పాటు విచారించారు. ఈ కేసుకు సంబంధించి గతనెల 16న మాజీమంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు ఎనిమిది గంటల పాటు ప్రశ్నించారు. అంతకు ముందు నిధుల విడుదలకు సంబంధించి రిలీజింగ్ ఆర్డర్ ఇచ్చిన హెచ్ఎండీఐ మాజీ అధికారి బీఎల్ఎన్ రెడ్డిని ఏసీబీ అధికారులు విచారించారు. నిధుల విడుదల ఏ విధంగా జరిగింది? ఆదేశాలు ఎవరు ఇచ్చారు? నోట్‌ఫైల్ తయారైన తర్వాత నిధుల విడుదలకు ఆదేశాలు వచ్చాయా? లేదంటే.. ఆదేశాలు వచ్చి నిధుల విడుదల జరిగాక ఫైల్ తయారైందా? అనే కోణంలో అర్వింద్‌కుమార్‌ను ఏసీబీ అధికారులు ప్రశ్నించినట్లు తెలుస్తోంది.

అప్పటి మునిసిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశాలతోనే నిధులను విడుదల చేశామని, ఎఫ్ఈవోకు నిధుల విడుదల చేయాలని కేటీఆర్ వాట్సాప్ మేసేజ్ ద్వారా ఆదేశించారని అర్వింద్‌కుమార్ చెప్పినట్లు తెలుస్తోంది. బిజినెస్ రూల్స్ ప్రకారం నిధుల విడుదలకు సంబంధించి ఆర్థిక శాఖ అనుమతి తీసుకోవాలని తాను.. మంత్రిగా ఉన్న కేటీఆర్‌కు చెప్పానని, ముందు నిధులు విడుదల చేయాలని.. అవన్నీ తాను చూసుకుంటానని కేటీఆర్ అన్నారని అర్వింద్‌కుమార్ ఏసీబీకి వాంగ్మూలం ఇచ్చినట్లు తెలుస్తోంది. రూ. 45.71కోట్ల నగదును ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు ద్వారా బ్రిటన్ పౌండ్ల రూపంలో ఎఫ్ఈవోకు చెల్లించామని ఆయన వివరించినట్లు తెలుస్తోంది. కేటీఆర్ విచారణ తర్వాత అర్వింద్‌కుమార్‌నూ ప్రశ్నించడంతో నిధుల విడుదల ఏ విధంగా జరిగిందనే విషయంలో ఏసీబీ అధికారులు ఒక అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ కేసుకు సంబంధించి త్వరలో చార్జ్‌షీటు దాఖలు చేయడానికి ఏసీబీ అధికారులు సన్నాహాలు ప్రారంభించినట్లు సమాచారం.

# ప్రపంచ వ్యాపార కేంద్రంగా హైదరాబాద్ !

- **అంతర్జాతీయ స్థాయిలో 'భారత్ ఫ్యూచర్ సిటీ'**
- **పెట్టుబడిదారులకు పూర్తి రక్షణ కల్పిస్తాం**
- **మలబార్ ఆభరణాల తయారీ యూనిట్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**



రంగారెడ్డి : తెలంగాణలో పెట్టుబడిదారులకు పూర్తి రక్షణ కల్పిస్తామని, వ్యాపారాలు లాభదాయకంగా కొనసాగేలా చూస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. హైదరాబాద్‌ను పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చి, ప్రపంచ వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వాలు మారినంత మాత్రాన విధానాల్లో, ప్రోత్సాహకాల్లో మార్పు ఉండదని స్పష్టం చేశారు. వాటిని మరింత మెరుగ్గా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మహేశ్వరం పారిశ్రామిక పార్కులో ప్రముఖ ఆభరణాల తయారీ సంస్థ మలబార్ నిర్మించిన 'మలబార్ జెమ్స్ అండ్ జ్యూయలరీ' తయారీ కేంద్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి.అహ్మద్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు దేశంలో ఏ నగరం పోటీ కాదని, ప్రపంచ స్థాయి నగరాలతోనే పోటీ అని చెప్పారు. ఇందులో భాగంగానే మహేశ్వరంలో అంతర్జాతీయ స్థాయిలో 'భారత్ ఫ్యూచర్ సిటీ' నిర్మాణానికి రూపకల్పన చేస్తున్నామన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తర్వాత ఇప్పుడు తమ ప్రభుత్వం నాలుగో నగరాన్ని నిర్మించి.. దేశానికి ఫ్యూచర్ సిటీని అందించే ఏర్పాట్లు చేస్తోందని చెప్పారు. రాబోయే వందేళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని విజన్ 2047 ప్రణాళికను రూపొందిస్తున్నామన్నారు. తెలంగాణ రైజింగ్ పేరుతో దీన్ని డిసెంబరు 9న ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. చరిత్రలో గుర్తుండిపోయేలా మహేశ్వరం నియోజకవర్గంలో 35 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామన్నారు.

**గోల్డ్‌లో కూడా లెజెండ్** బంగారం కొనేవాళ్లలో తెలుగు మహిళలదే అగ్రస్థానమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. రాష్ట్రంపై నమ్మకం ఉంచి ఇక్కడ తయారీ యూనిట్ ప్రారంభించిన మలబార్ సంస్థకు అభినందనలు తెలిపారు. మలబార్ తయారీ యూనిట్ ఏర్పాటుతో ఇక్కడ బంగారం, వజ్రాభరణాల రంగంలో నూతన శకం ప్రారంభమైందని అన్నారు. దేశంలో ఐటీ, ఫార్మా రంగంలో హైదరాబాద్ లెజెండ్‌గా ఉందని.. ఇపుడు గోల్డ్‌లో కూడా లెజెండ్‌గా మారనుందని చెప్పారు. 2035 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్నదే

తమ ప్రభుత్వ లక్ష్యమని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కొత్త పారిశ్రామిక విధానం-2025 రూపకల్పనకు శ్రీకారం చుట్టామని చెప్పారు.

ఈ విధాన రూపకల్పనలో పారిశ్రామిక దిగ్గజాలను భాగస్వాముల్ని చేశామన్నారు. పరిశ్రమలకు వేగంగా, పారదర్శకంగా అనుమతులు మంజూరు చేసేలా టీజీఐపాసను ఏఐతో అనుసంధానం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. తమది నిబంధనల పేరిట వేధించే ప్రభుత్వం కాదని, భుజం తట్టి ప్రోత్సహించే సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వమని చెప్పారు. కొత్తగా ప్రారంభించిన మలబార్ యూనిట్.. తెలంగాణను తయారీ రంగ హబ్‌గా తీర్చిదిద్దడంలో దిక్సూచిగా ఉంటుందన్నారు. మలబార్ సంస్థ ఫర్నిచర్ తయారీ యూనిట్ ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. తెలంగాణ యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చేందుకు చేతులు కలపాలని కోరారు. 2023-24లో తెలంగాణ తయారీ రంగ ఎగుమతులు రూ.1.2 లక్షల కోట్లకు చేరినట్లు వెల్లడించారు. ఏకగవాక్ష విధానంలో టీజీఐపాస్ ద్వారా 4200 యూనిట్లకు అనుమతులు ఇచ్చామని, ఇందులో 98 యూనిట్లకు 15 రోజుల్లోనే అనుమతులు ఇచ్చామని చెప్పారు.

**2750 మందికి ఉపాధి** మహేశ్వరంలో 3.45 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్తగా ఏర్పాటు చేసిన సమీకృత తయారీ కేంద్రం ద్వారా 2,750 మందికి ఉపాధి కల్పించనున్నట్లు మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి.అహ్మద్ చెప్పారు. తమ కంపెనీ సీఎస్ఆర్ కింద తెలంగాణలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు.

# ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలకు నిరాశ


## సీట్ల పెంపునకు హైకోర్టు నిరాకరణ



హైదరాబాద్, : కోర్సుల విలీనం, సీట్ల పెంపుపై 14 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలకు హైకోర్టులో నిరాశ ఎదురయింది. బీటెక్-సీఎస్ఈ ఇతర విభాగాల్లో సీట్లు పెంచుకోవడానికి, కోర్సుల విలీనానికి ఏఐసీటీఈ, జేఎన్‌టీయూ అంగీకరించినా రాష్ట్ర ప్రభుత్వం అనుమతివ్వడం లేదని పేర్కొంటూ మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ, సీఎంఆర్, ఎంఎల్ఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్ తదితర కాలేజీలు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. ఈ పిటిషన్‌లను కొట్టివేస్తూ సింగిల్ జడ్జి ధర్మాసనం ఈ ఏడాది మే 2న తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఆయా కాలేజీలు డివిజన్ బెంచ్‌లో రిట్ అప్పీళ్లు దాఖలు చేశాయి. ఈ పిటిషన్‌లపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం విచారణ చేపట్టింది.

కాలేజీల తరపున న్యాయవాదులు వాదిస్తూ.. ఇతర ఇంజినీరింగ్ కాలేజీలకు సీట్ల పెంపునకు అవకాశం ఇచ్చి.. కేవలం రాజకీయ కక్షతో తమ కాలేజీలకు అవకాశం ఇవ్వలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం తరపున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదిస్తూ.. పిటిషనర్ కాలేజీలు ఉన్న ప్రాంతంలో ఇప్పటికే చాలా కాలేజీలు ఉన్నాయని.. అదే లొకాలిటీలో మళ్లీ సీట్ల పెంపు కోరడం సరికాదని తెలిపారు. ఇబ్బడిముబ్బడిగా కాలేజీలు, సీట్లు పెరిగిపోకుండా ప్రభుత్వ నియంత్రణ కూడా ఉండాలని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చట్టవ్యతిరేకం కాదని పేర్కొంది. ఈ మేరకు సింగిల్ జడ్జి తీర్పును సమర్థిస్తూ ఇంజనీరింగ్ కాలేజీల పిటిషన్‌లను కొట్టివేసింది.

# మన దుఃఖానికి మనమే కారణం - గౌతమ బుద్ధుడు



అప్పుడే పుట్టిన శిశువు శరీర బాధలకు, ఆకలి దప్పులకు ఏడుస్తాడే తప్ప నిజంగా ఆలోచనల నుండి వచ్చిన దుఃఖం కాదది తర్వాత పెరిగి పెద్దవాడై జీవనం సాగిస్తున్న దశలో ఆలోచనలు పెరిగి దుఃఖ భాజనుడు అవుతాడని బుద్ధుడు.చెప్పాడు.

మనిషి జీవితం దుఃఖ భాజనం అన్నాడు బుద్ధుడు. దుఃఖాన్ని పోగొట్టుకోవడమే నిజమైన జీవనం అన చెప్పాడు. దానికోసం పంచశీల సిద్ధాంతాలు అష్టాంగ మార్గం లాంటి ఎన్నో మానవతా పద్ధతులు మనిషి యొక్క జీవితానికి నిర్దేశించాడు.

నిర్మలమైన జీవితం గడపాలన్నాడు హేతుబద్ధంగా న్యాయంగా ధర్మంగా నీతిగా బతకమన్నాడు.అప్పుడే మనిషి యొక్క జీవితానికి సార్ధకత ఉంటుందని చెప్పారు. సమాజం అనేది భిన్నరకాల మనుషులు నివసించే ఒక సముదాయం. మనిషి పుట్టగానే మొట్టమొదటిగా దుఃఖిస్తాడు .చివరికి పోయిననాడు కూడా దుఃఖపడతాడు మధ్యలో జీవితం కూడా చాలా మటుకు దుఃఖంతోనే జీవనం సాగిస్తాడు.

మనం జీవనం సాగించడానికి ఎన్నో రకాలైన పనులు చేస్తాము. చాలామందితో లావాదేవీలు జరుపుతాము. ఎందరో స్నేహితులవుతారు మరెందరో పగవారు కూడా అవుతారు బంధువులు కొందరు బంధుత్వంతో మెరుగుతారు మరికొందరు రాబందుల్లాగా పీడించుకు తింటారు. పగలు, ప్రతికారాలు, విద్వేషాలు, సన్మార్గము దుర్మార్గం ఎన్నో రకాలుగా మనిషి జీవనము గడుపుతుంటాడు. అందుకే బుద్ధుడు పంచశీల సిద్ధాంతాన్ని కనిపెట్టారు.

నిర్మలమైన జీవితం గడిపితే మనిషికి దుఃఖం నుండి దూరం చేయవచ్చు అని చెప్పారు దుఃఖం వలన మనసు చెడిపోతుంది. ప్రశాంతత చెడు ఆలోచనలు వస్తుంటాయి .బతుకు భారం అనిపిస్తుంది. కొందరు ఆత్మహత్యలకు కూడా సిద్ధపడతారు కొందరు ఒత్తిడితో హత్యలు కూడా చేస్తారు.దుఃఖం ఎల్లకాలం ఉంటే మనిషి నీరసించి పోతాడు. మనోవేదనకు గురవుతాడు. మానసికంగా చాలా వేదనకు గురవుతాడు.

మరి దుఃఖాన్ని కారణం ఏమిటి అని చాలా మంది పరిశోధనలు చేశారు మానసికంగా బాధ ఉన్నప్పుడే దుఃఖపడతాం కన్నీళ్లు కారుతాయి. మన దుఃఖానికి మనమే కారణమని చాలా మంది మేధావుల అభిప్రాయం. కానీ మన దుఃఖానికి మనమే కారణమని చాలామందికి తెలియదు తెలియకుండానే దుఃఖపడుతుంటాము, మన దుఃఖానికి కారణం ఇతరులని నిందిస్తాం.కారణాలు తెలుసుకోము. మన దుఃఖానికి ఇతరులే కారణమని అనవసరంగా ఇతరులపై అబాండాలు వేస్తాము. మంచి స్నేహాన్ని చెడగొట్టుకుంటాం మంచి బంధుత్వాన్ని దూరం చేసుకుంటాం.

మనం ఎదుటివారి నుండి ఏదైనా ఆశిస్తే, అది లభించకుంటే దుఃఖం కలుగుతుంది అత్యాశ, పడకపోవడం తొలగించుకుంటే దుఃఖం మన దరి చేరదు. ఎల్లప్పుడు సంతోషంగా ఉంటాము కొన్ని సమయాల్లో మన బంధువులు మనకు దూరమైతే ఆశించినది లభించకుంటే కష్టాలు సంభవిస్తే దుఃఖము దానంతట అదే వస్తుంది అప్పుడు మనిషి స్థిమితంగా ఆలోచించి దుఃఖాన్ని కారణం ఏమిటో తెలుసుకొని దాని నుండి దూరం కావాల్సి ఉంటుంది ఈ విషయము చాలామందికి సాధ్య పడదు అయినా సాధనవల్ల ఏదైనా సమకూర్తుంది కాబట్టి దుఃఖాన్ని మనం దూరం చేసుకోవాలంటే మన చేతిలోనే ఉంటుంది.

మన యొక్క మంచితనాన్ని చూసి కొందరు మోసగించాలని చూస్తుంటారు అలాంటి అవకాశం మనమే ఇస్తుంటాం

వాళ్లు మోసం చేశారు. వీళ్ళు మోసం చేశారు.

వాళ్లు బాధపెట్టారు. వీళ్లు బాధ పెట్టారు. అంటుంటాం.

మన దుఃఖానికి ఇతరులే కారణమని

అనుకుంటూ ఉంటాం. కానీ మన దుఃఖానికి మనమే కారణం వాళ్ల నుండి వీళ్ళ నుండి ఏదో ఆశిస్తేనే, అత్యాశ పడితేనే మనకు ఆ బాధ దుఃఖం కలుగుతాయి.మరి వాళ్ళకి, వీళ్ళకి ఆ ఛాన్స్ ఇచ్చింది ఎవరు?మనమే కదా?అంటే మన దుఃఖానికి మనమే కారణం. మనిషి ఆశాజీవి గా ఉంటే పర్వాలేదు. హాయిగా బతికేయవచ్చు. ఉన్న దానిలో సంతృప్తి పడి పని చేస్తూ బ్రతకడం వలన ఎలాంటి దుఃఖం సంభవించదు కానీ ఎప్పుడైతే అత్యాశపడతామో అది లభించదో మనం నిరాశకు లోనవుతాం. దానివల్ల దుఃఖం కలుగు తుంది. ఈ చిన్న విషయాన్ని మనం ఆలోచించి మన జీవితం దుఃఖ నిలయం కాకుండా కాపాడుకోవడం మన చేతిలోనే ఉంటుంది.

అడియాల శంకర్,అధ్యక్షులు,
తెలంగాణ హేతువాద సంఘం

# తొలిసారి SSMB 29 పై స్పందించిన ప్రియాంక..



ప్రపంచవ్యాప్తంగా ఉన్న మూవీ లవర్స్ ఒకే ఒక్క సినిమా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆ ప్రాజెక్ట్ మరేదో కాదు మహేష్ బాబు– రాజమౌళి చిత్రం. SSMB%29 ప్రాజెక్ట్ ఇప్పుడు టాలీవుడ్‌లోనే కాదు, అంతర్జాతీయంగా కూడా హాట్ టాపిక్‌గా మారింది. సూపర్ స్టార్ మహేష్ బాబు – దర్శక ధీరుడు రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న మూవీ లవర్స్ ఒకే ఒక్క సినిమా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆ ప్రాజెక్ట్ మరేదో కాదు మహేష్ బాబు– రాజమౌళి చిత్రం. SSMB29 ప్రాజెక్ట్ ఇప్పుడు టాలీవుడ్‌లోనే కాదు, అంతర్జాతీయంగా కూడా హాట్ టాపిక్‌గా మారింది. సూపర్ స్టార్ మహేష్ బాబు – దర్శక ధీరుడు రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి.ఏ చిన్న అప్డేట్ అయినా సోషల్ మీడియాలో క్షణాల్లో వైరల్ అవుతోంది. రాజమౌళి సినిమా అంటేనే భారీ స్థాయి లో ప్రీ–ప్రొడక్షన్, టాప్ లెవల్ యాక్షన్, అద్భుతమైన విజువల్స్ ఉంటాయి. SSMB29 కూడా ఆ స్థాయిలోనే రూపొందుతోందని ఇండస్ట్రీ టాక్.

ఇప్పటివరకు ఈ సినిమా గురించి అధికారికంగా వివరాలు బయటకు రాలేదు. ఈ చిత్రంలో మహేష్ బాబు, ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారని మాత్రం తెలిసింది. ఇప్పటికే ప్రియాంక పలు షెడ్యూల్స్‌లో పాల్గొంది. అయితే తాజాగా ప్రియాంక చోప్రా ఓ ఆంగ్ల మీడియా ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, “ఈ ఏడాది ఓ పాన్ ఇండియా ఇండియన్ సినిమాలో నటిస్తున్నాను. ఇండియా సినిమాలు, ఆడియన్స్ ఎంతో మిస్ అవుతున్నాను. మళ్లీ ఇక్కడి ప్రేక్షకులతో కనెక్ట్ అవ్వడం ఎంతో ఆనందంగా ఉంది” అని వ్యాఖ్యానించారు. ఇది విన్న మహేష్ అభిమానులు ఆమె కామెంట్ చేసింది SSMB29 గురించేనని భావిస్తున్నారు. దీంతో ఇంటర్వ్యూ క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ప్రియాంక తన బాల్యంలో ఎక్కువగా సినిమాలు చూడలేదని, కానీ మణిరత్నం దర్శకత్వం వహించిన ‘ముంబయి’ తనకు గుర్తుండే ఫస్ట్ మూవీ అని చెప్పారు. “నా 13 ఏళ్ల వయసులో థియేటర్‌లో ముంబయి సినిమా చూశాను. ఇప్పటికీ ఆ సినిమా చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది,” అని చెప్పారు. ఇక SSMB29 విషయానికి వస్తే ఇది అడ్వెంచరల్‌గా మూవీగా రూపొందుతుంది. జులై రెండో వారంలో కెన్యాలో కొత్త షెడ్యూల్ ప్రారంభం కానుందని సమాచారం. ఈ షెడ్యూల్‌లో భారీ యాక్షన్ ఎపిసోడ్స్, ఛేజింగ్ సీక్వెన్స్‌లను చిత్రీకరించనున్నారు. ఈ షెడ్యూల్‌కు తమిళ స్టార్ ఆర్ మాధవన్ జాయిన్ కానున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమాని 2027లో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు.